
ఆంధ్రజ్యోతి
1ST DEC. '47.
6
MTV

త్వరలో విడుదలకానున్న యూనిటీ పిక్చర్సు వారి.



శ్రీ సాయిబాబా

దర్శకుడు : పట్టాభి


తారాగణం :-ముస్నవ రామచంద్రరావు. అద్దంకి. సి. ఎస్. ఆర్.. పారుపల్లి. కృత్తివెంటి.
ఘొవిలి కృష్ణమూర్తి. రామనాథశాస్త్రి. డా॥ చంద్రశేఖరరావు, ఎస్. నాగేశ్వరరావు.
శ్రీమతి భారతిదేవి మొదలగువారు.

సంగీతం: మల్లిఖార్జున్ * నృత్యం: వి. జె. శర్మ, * స్టూడియో: చంద్రా ఆర్ట్ స్టూడియో

వ్యాపార వివరాలకు: (ఆంధ్రజిల్లాలు తప్ప) యూనిటీ పిక్చర్స్, మదరాసు. 17

రాయలసీమ: యూనివర్సల్ ఫిల్ము డిస్ట్రిబ్యూటర్స్. త్యాగరాయనగరు - మదరాసు.

మైసూరు: మారుతి సెస్ సిండికేటు, 6?. సున్నకాలు పేట - బెంగుళూరు సిటీ.




*Distributors :*

*Andhra & Ceded :* **PREMIER FILMS LTD., BEZWADA.**

*Mysore :* **RAGHAVENDRA PICTURES, BANGALORE CITY.**

ఈ సంచికలో కొందరు రచయితలు

చాణక్య | మునిమాణిక్యం
శ్రీ వాత్సవ | కుటుంబరావు
పనిలేనిమంగలి | కృష్ణారావు

బి. వి. సుబ్రహ్మణ్యం వగైరాలు

# ఆంధ్రజ్యోతి

సాలుచందా 5-8-0 | విడిప్రతి 0-6-0

ఆఫీసు :

37, ఆచారప్పన్‌వీధి :: మద్రాసు

# సంచారి

రాజకీయ మాసపత్రిక.

పాలుచందా 4-0-0 | విడిప్రతి 0-6-0

ఆఫీసు :

37, ఆచారప్పన్ వీధి, మద్రాసు 1.



# మీ జుట్టు ఈ విధంగా అదుపులేకుండా ఉంటే



# స్వస్తిక్ పరిమళ ఆముదంవల్ల దాన్ని అదుపు చేయ్యండి

మీ జుట్టు ఉంగరాలు తిరిగి ఒత్తుడు పడక ఎదురు తిరిగేదయితే, ఏదో ఒక తల నూనె ఏదైనా సరే అనుకుంటే కాదు. ఇల్లాంటి జుట్టులో ఉండే శోభ నంతనూ స్వస్తిక్ వారి పరిమళ ఆముదం వెలికి తెస్తుంది. ఈ జుట్టును మీరు సరిగా ముస్తాబు చెయ్య గలిగేట్టు చేస్తుంది. మనోహర సుగంధ పరిమళ మిళిత మైన స్వస్తిక్ పరిమళ ఆముదం అభిరుచు లెరిగిన స్త్రీ పురుషులకు ప్రియమైనదిగ గణుతి కెక్కింది.

స్వస్తిక్ వారి నాణ్యమైన ఇతర వస్తువులలో కొన్ని: కాంతి సబ్బు.
స్వస్తిక్ షేవింగ్ స్టిక్. బట్టల సబ్బులు.
గోవాలిన్ బ్రాండు వనస్పతి మొదలైనవి.



# స్వస్తిక్ పరిమళ ఆముదం

భారతీయులై కొనండి.

స్వస్తిక్ ఆయిల్ మిల్సు లిమిటెడ్

బొంబాయి

SHILPI

Sws. 81 Telugu




# బిటాకేఫిన్

## (తలనొప్పి బిళ్లలు)

అన్నినొప్పులను, జ్వరములను
కుదుర్చును.

తలనొప్పి, పంటినొప్పి, కాళ్లనొప్పి, నిద్రలేకుండుట, కీళ్ళనొప్పులు, మలేరియా, స్త్రీల బహిష్టు నొప్పులు, అలసట వగైరా అన్నిటికి గ్యారంటీగా పనిచేయును. వాడుకొను విధము పొట్లములో నుండును.

పొట్లం 3 బిళ్లలు **1 అణా.**

స్టాకిస్టులు: దాదా అండ్ కంపెనీ,
పి. టి., మద్రాసు.

అన్నిచోట్ల దొరకును.

★

తయారుచేయువారు:

*Stockists:—*

M/S DADHA & CO, P. T. MADRAS.

*Manufactured by—*

**BOMBAY TABLET MFG: CO.,**
**Post Box No. 2092, BOMBAY. 2.**

★

# స్వర్ణోత్సవ సుప్రభాతము



పండిత డి. గోపాలాచార్యులవారి

# జీవామృతము

పీడితమానవులకు సేవచేయుటలో నేటితో జీవామృతమునకు ఏబది వత్సరములు ఉదయించినది. నేటికిని, మెదడు పనిచెయువారికి, బలహీనులకు జీవశక్తి ప్రసాదించేది జీవామృమేయని, శ్లాఘింపబడినది




**ఆయుర్వేదాశ్రమము లిమిటెడ్**
**మద్రాసు 17**

★

# సైన్ ప్రొజెక్టర్సు

## అన్ని రకముల అక్కరలను తీర్చును



ఇంకను:

**FEDI V/R. 5**

విక్టోరియా

**IV. B**


రెడీ స్టాకునుండి
సప్లయి
చేయబడును.

★

మైక్రోన్

**XI B & XII**

పేరొందిన ఇటాలి
యన్ ప్రొజెక్టర్లు
సరసమైన ధరలకు
మావద్ద దొరకును.




★

:డైరెక్టు ఇంపోర్టర్సు:

## దేవి ఫిలింసు, లిమిటెడ్

**498,** మింట్ స్ట్రీట్, :: పి. టి. మదరాస్ **3.**

# తాజా
## చెరకు పంచదార...

స్వీట్స్‌లో ఉపయోగించే వస్తువులలో తాజా చెరకు పంచదార, శుద్ధమైన గ్లూకోజు చాలా ముఖ్యమైనవి. సావరిన్ స్వీట్స్‌లో శ్రేష్ఠమైన, పరిశుద్ధమైన పంచదార, గ్లూకోజు ఉపయోగించబడ్డవి. మీకు ఏది రుచో చూడడానికి మా దగ్గర ఉన్న కొన్ని రకాలు తీసుకొని చూడండని మా సలహా. మా స్వీట్స్ చాలా రుచిగా ఉంటవని అనేక వేలమంది పిల్లలు మాకు చెప్పారు...వాళ్లకు తప్పకుండా తెలుసు.



దేశమంతా ఆదరించబడినవి



## సావరిన్ స్వీట్స్
కె. సి. పి. తయారీ



# భారతప్రశస్తి





స్త్రీల ఆరోగ్య భాగ్యానికి
# లోధ్ర


కేసరికుటీరం లిమిటెడ్, మద్రాస్

EASTERNS.384

ఒరిస్సా, నైజాము, ఆంధ్ర, తమిళజిల్లాలకు
ఏజెంట్లు :

శ్రీ సీతారామ జనరల్ స్టోర్సు,
బరంపురం, సికింద్రాబాదు, బెజవాడ, మధుర.





సెల్లింగ్ ఏజెంట్లు: బెస్ట్ అండ్ కో. లిమిటెడ్ P. B. నెం. 63, మద్రాసు.

సంక్రాంతికి

# చందమామ

సాలుచందా
6-0-0

ప్రత్యేక కథలసంచిక.

●

వచ్చే జనవరి చందమామ సంచిక సంక్రాంతి ప్రత్యేక సంచికగా వెలువడుతుంది. మామూలుకు రెట్టింపుపైగా పేజీలుంటాయి. ముగ్గులుంటాయి. పాటలుంటాయి. సమస్యలుంటాయి. చాలా చక్కని కథలుంటాయి. ఎన్నో బొమ్మలుంటాయి. ఇంత అందమైన సంచిక మళ్లీ ఎప్పుడు మీ చేతికివస్తుందో? అందుచేత ఇప్పుడే మీ సొంత కాపీకోసం జాగర్తపడండి. అశ్రద్ధచేస్తే తరవాత విచారిస్తారు.

వెల
1-4-0

●

ఆఫీసు:
37, ఆచారప్పన్ వీధి
మద్రాసు 1

# ఆంధ్రజ్యోతి

.....సచిత్ర మాస పత్రిక......

సంపుటి 8]　　డిశంబర్ 1947　　[సంచిక 6

## జరుగుతున్న చరిత్ర

కాశ్మీరంలో సంఘటనలు ఎవరూ అనుకోనంత త్వరగా జరిగిపోయాయి. ఆ సంస్థానంలో అశాంతికి చేయూత యిచ్చి, దుండగీండ్రను దండయాత్రకు పురిగొల్పి పాకీస్థాన్ ప్రభుత్వం పుణ్యం కట్టుకొన్నది. నవంబరు 25 న ఇండియా కేంద్రశాసనసభలో పండిట్ నెహ్రూ ప్రకటన వెలువడినతరువాత కాశ్మీర దౌర్జన్యాలలో పాకీస్థాన్‌కు సంబంధం ఉన్నదా లేదా అన్న సందేహం తీరిపోయింది. "జమ్మూరాష్ట్రంలోను కాశ్మీరంలోను జరిగినదురంతాలు, వాటిపై జరిగిన దాడులు కావాలని పాకీస్థాన్ ప్రభుత్వంలోని పై అధికారులు జరిపించినట్లు తగినసాక్ష్యం మనకు ఉంది" అని పండిట్ నెహ్రూ ప్రకటించాడు. పాకీస్థాన్ ప్రభుత్వం సానుభూతిసహకారాలు లేకుండా అంతమంది సాయుధులైన దుండగీండ్రు పాకీస్థాన్‌లోగుండా కాశ్మీరంలో ప్రవేశించటానికి వీలులేదని స్పష్టమౌతూనే వుంది. ఇండియాప్రభుత్వం సంస్థానానికిసైన్యసహాయంచేసినా యుద్ధానికి దిగవలసినప్రమాదమూఉంది. అలాంటిసహాయంచేయక ఉపేక్షిస్తేనూ ప్రమాదం ఉంది. అయినా ఇండియా ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించింది. కాశ్మీరసంస్థానంలో మామూలు పరిస్థితులు నెలకొనగనే ఆసంస్థానం ఇండియాలో చేరాలా, లేక పాకీస్థాన్‌లో చేరాలా అన్నసమస్యను ప్రపంచరాజ్యసమితిలాంటి మధ్యవర్తులు నియమించిన సంఘం పర్యవేక్షణక్రింద ప్రజలలో ఓటింగుకుపెట్టి తద్వారా తేల్చుకోవాలని ప్రకటించింది. సంస్థానంపై దండెత్తివచ్చిన దుండగీండ్రను ప్రజలంతా ఏకోన్ముఖులై ప్రతిఘటించి తరుముతున్నారంటే వారి దీక్ష ఏకీభావం స్పష్టమౌతున్నాయి. అలాంటప్పుడు కాశ్మీరం

ఎందులో చేరాలన్నసమస్యను తేల్చుకో టానికి మళ్లీ స్థితిగతులు కుదటబడిన తరువాత ఎన్నికలు జరపవలసిన అవ సరంలేదని షేక్ అబ్దుల్లా సహచరుడైన భక్షిగారు అన్నారు. అయినా ఇండియా ప్రభుత్వవైఖరి ఏమిటో పండిట్ నెహ్రూ నిర్ధారించి చెప్పాడు. అంత కన్నా సముచితవైఖరి మరొకటి ఉండ దు. "మనం కాశ్మీరం రక్షించటానికి వెళ్ళాము, ఆవిధ్యుక్తధర్మం నెరవేరిందే మనబలాలు అక్కడ ఉండనవసరం లేదు, వాటిని ఉపసంహరించుకొంటాం, మనఆశయం ఒకటే. తమ భవిష్యత్తును తేల్చుకోటానికి ప్రజలకు అవకాశం ఇవ్వాలి, ఈ ప్రజానిర్ణయం ప్రపంచ రాజ్యసమితిసంఘంలాటి నిష్పాక్షిక సంఘం పర్యవేక్షణక్రింద జరగాలని సూచించాము" అని పండిట్ నెహ్రూ అన్నాడు. కాశ్మీరవిషయంలో ఇండియా ప్రభుత్వానికి సంబంధించి నంతవరకు ఇదీ అంతిమ నిర్ణయం. పోతే సంస్థాన భాగమంతా దుండగీంద్ర బారినుంచి త్వరగా బయట పడవలసిఉంది. ఏమి జరిగినా కాశ్మీరం ఇండియాలోనే చేరా లన్న అనివార్య నగ్నసత్యాన్ని కాశ్మీర జాతీయ సమావేశంలో పాల్గొన్న నాయ కులు గుర్తించారు.

* * *

దక్షిణ భారతంలో ముఖ్యమైన సమస్య హైదరాబాదు భవిష్యత్తు. గడ చిన కొన్నిమాసాలనుంచి స్టేట్ కాంగ్రెస్ హైదరాబాదును ఇండియాలో చేర్చటానికి, అక్కడ బాధ్యతాయుత ప్రభుత్వం నెలకొల్పటానికి ఆందోళన సాగిస్తూవుంది. ఈరెండు విషయాల లోను నిజాంప్రభుత్వం బెల్లంకొట్టిన రాయిలాగా వూరకున్నది. ఇత్తిహాదె ముస్లిమీన్‌సంస్థ స్టేట్‌కాంగ్రెస్‌కు ప్రతి కూలంగా ఆందోళన సాగిస్తూంది. హైద రాబాదు పాకీస్థాన్‌లో చేరాలని యీ ముస్లింపార్టీ కోరిక, దాన్ని ఆపార్టీ నాయ కులు బాహాటంగానే ప్రకటిస్తున్నారు. అంతేకాదు సంస్థానంలో స్వపరిపాలన కొల్పటమంటే అత్యల్పసంఖ్యాకులగా ఉన్న మహమ్మదీయుల పాలన అత్య ధిక సంఖ్యాకులైన హిందువుల మీద రుద్దటమేననికూడా చెప్పివేస్తున్నారు. స్టేట్‌కాంగ్రెస్ స్వపరిపాలన కోసం, స్వయం నిర్ణయాధికారం కోసం ఉద్య మం ప్రారంభించగానే నిజాంప్రభుత్వం హింసాకాండకు ఉపక్రమించింది. గడ చిన రెండు మాసాలలోను యీదౌర్జ న్యాలు, దురాగతాలు ఎక్కువవుటవల్ల సంస్థానంలో నుంచి మహమ్మదీయే తరులు తండోప తండాలుగా యూని యన్ ప్రాంతంలోకి లేచిరావటం జరుగు

తున్నది. సంస్థానంలో శాంతిభద్రతలు ఏర్పడాలన్నా, అక్కడి మహమ్మదీయేతర ప్రజలధనప్రాణాలకు ప్రమాదం లేకుండా పోవాలన్నా హైదబాదు యూనియన్‌లో చేరాలి. ఆచేరటం మీదనే యివన్నీ ఆధారపడి ఉన్నాయి. ఈ సంస్థానం స్వతంత్రంగా ఉండటానికి అవకాశం ఇవ్వాలనీ, నిజాం ప్రభువుకు స్వతంత్ర ప్రభుత్వాధికారా లుండాలనీ చెప్పే వాదనలో అర్థంలేదు. పైగా అందులో చాలప్రమాదం ఉంది. హైదరాబాదు వెలుపలఉన్న దేశంకాదు, ఇండియన్ యూనియన్‌లో నట్టనడుమఉంది. రాజకీయంగా ఎటువైపు మొగ్గుతుందో తెలీదు. అలాటప్పుడుదేశమధ్యభాగంలో ఒక స్వతంత్ర సంసానం ఉండనీయటమంటే పక్కలో బల్లెంఉండనీయటమౌతుంది. పైగా . హైదరాబాదులో అత్యాధిక సంఖ్యాకులు నైజాంప్రభుత్వం కొనసాగితే తమకు శాంతిభద్రతలు దక్కవని భయపడుతున్నారు. ఇండియాలో ఆసంసానంచేరే సమస్యను ఉపేక్షించటమంటే ప్రజల అభిమతాన్ని త్రోసివేయట మౌతుంది, వివాదగ్రస్థ విషయాలను ప్రజాభిప్రాయం ద్వారా తేల్చుకోవడం ఉత్తమమని ఎన్నిసార్లు సూచిస్తున్నా అవతల పక్షం నుంచి అతీపతీలేదు. దానికితోడు ఇత్తిహాదేముసిల్మీన్‌వారి చర్యలను పట్టి చూస్తే, సంసానప్రభుత్వం అత్యల్ప సంఖ్యాకులైన మహమ్మదీయులు శాంతి విధ్వంసక్రియలు సాగించటానికి, తమ అధికారాన్ని ప్రజాబాహుళ్యంమీద చెలాయించటానికి అవకాశ మిస్తున్నదని స్పష్టంగా తేలిపోయింది.

ఇలాంటి పరిస్థితులలో ఆగస్టు 15 కు పూర్వమున్న సంబంధ బాంధవ్యాలను యథాతథంగా కొనసాగించటానికి ఇండియా ప్రభుత్వం. నిజాంప్రభుత్వం ఒడంబడిక చేసుకొన్నాయి. దీనివల్ల ముమ్ముందు ఎలాంటి ఫలితా లేర్పడుతాయో చెప్పడం కష్టసాధ్యం. సంస్థాన ప్రభుత్వం, పంపించిన రాయబారవర్గం లాభసాటి బేరమే చేసింది. వాళ్లు కోరుకొన్న వన్నీ సంపాదించుకొన్నారు.

"ఇండియాలో కొంతభాగాన్ని కాజేయటానికీ, పాకీస్థాన్‌లో చేరటానికీ నిజాం ప్రభుత్వం ప్లానువేసుకొన్నది. ఆ ప్లాను పూర్తిచేసుకొవటానికి కావలసిన వ్యవధి వాళ్ళకు లభించింద"ని కొందరు భావిస్తున్నారు. 1948 ఫిబ్రవరి చివరికి ఇండియా ప్రభుత్వం ఈ ఒడంబడిక ప్రకారం సంసానంలో ఉన్న తనసైన్యాన్ని ఉపసంహరించుకోటానికి అంగీకరించింది

ఇలా ఉపసంహరణ జరుగుతుందంటే ప్రజలలో కొంతమంది భయపడుతున్నారు. సంస్థానం యూనియన్‌లో చేరే విషయాన్ని తేల్చకుండా వదలి నైజాముకు సంవత్సరం గడువిచ్చారు. పైగా సంస్థానంలో జరిగే ప్రభుత్వ ప్రతికూల ఆందోళనను నిరుత్సాహపరచటానికి కూడా యూనియన్ ప్రభుత్వం అంగీకరించింది. ఇదంతా, సంస్థాన ప్రజల దృష్టితో చూస్తే, నిజాంప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ పుచ్చుకోకుండా అది కోరినవన్నీ యిచ్చినట్లు కనిపించవచ్చును. 'హైదరాబాదు ఇండియాలో ఉన్న సంస్థానా లన్నిటికంటె పెద్దది కాబట్టి ఇతర సంస్థానాలకంటే భిన్నంగా దానిపట్ల వ్యవహరించవలసి వచ్చిం'దని సర్దార్ పటేల్ ఇండియా ప్రభుత్వ వైఖరిని సమర్థించాడు. ఈ సమర్థన సమంజసంగా సంతృప్తికరంగా లేదని కొంతమంది భావిస్తున్నారు. ఏది ఎలా జరిగినా, హైదరాబాదు విషయంలో ఇండియా ప్రభుత్వం దేశానికి శ్రేయస్కరమైన విధానాన్నే అవలంబిస్తుంది. ఇందులో ఏమాత్రం సందేహించవలసిన పనిలేదు. కాని అసలు ముఖ్యవిషయం ఒకటి ఉంది. ఈ ఒడంబడికవల్ల సంస్థానంలోని మహమ్మదీయేతర ప్రజలకు అభయ మేర్పడి అక్కడి ఆందోళన జయప్రదంగా సమాప్తమౌతుందా?

మద్రాసు రాష్ట్రానికి, సంస్థానానికి మధ్యనున్న గ్రామాలలో నిజాం పోలీసులు సాగిస్తున్న దౌర్జన్యాలు, దురంతాలు ఇంతటితోనైనా ఆగిపోతాయా? ఉభయ పక్షాలకు సుహృద్భావం నెలకొనాలని నిజాంప్రభువు ప్రకటించాడు. నిజంగా అదే అతని అభిమతమైతే, సంస్థానంలో ప్రభుత్వాధికారులు సాగిస్తున్న దురంతాలను దౌర్జన్యాలను ఆపించి బాధ్యతాయుత పరిపాలన నెలకొల్పి తద్వారా ముందు తన సుహృద్భావాన్ని ప్రకటించాలి.

* * *

దేశవిభజనవల్ల జాతీయ ఆర్థికస్థితికి దెబ్బతగిలిందని ఇండియా ప్రభుత్వం వారి ఏప్రిల్ — నవంబరు బడ్జెట్టును పట్టి స్పష్టమౌతున్నది. పాకిస్థాన్ నుంచి వచ్చిన ముప్పయిలక్షల కాందిశీకులను సహాయంచేసి అందుకోవలసిన బాధ్యత అంతా ఇండియాప్రభుత్వంమీద పడింది.

ఈ కాందిశీకులకోసమని ప్రభుత్వం రోజుకు దాదాపు 15 లక్షల చొప్పున ఖర్చుపెడుతున్నది. ఇంకా ఎంతకాలం ఈ ఆర్థికభారం ప్రభుత్వం మోయవలసి ఉంటుందో తెలీదు. ఈ బాధ్యతలో కొంత తూర్పుపంజాబు వహించాలని పండిట్ నెహ్రూ యిటీవల ప్రకటించాడు. దేశవిభజనతో తగ్గుతుందనుకొన్న మిలిటరీ వ్యయంతగ్గలేదు. పైగా జునాగఢ్ కాశ్మీరం మొదలైన సంస్థానాలలో ప్రభుత్వం బలాలను పంపించి యుద్ధం సాగించవలసివచ్చింది. యూనియన్‌కు ప్రమాదంలేకుండా చేయటానికి దాదాపు యుద్ధానికి పూర్వం ఎంత సైనికబలం ఉండేదో అంతా అట్టిపెట్టవలసివచ్చింది. దీనికి తోడు దేశంలోని ఆహారపదార్థాల కొరతవల్ల విదేశాలలో ధాన్యాలను ఎక్కువ ధరలకుకొని దేశంలో తక్కువ ధరలకు సప్లయి చేయవలసివస్తున్నది. దేశంలో స్థిమితత్వం ఏర్పడకపోవటం వల్ల, కావలసిన యంత్రసామగ్రిలభ్యం కాకపోవటంవల్ల మన యుద్ధానంతర ప్రణాళికలు సంతృప్తికరంగా అభివృద్ధి చెందలేదు. వీటి అన్నిటివల్ల దేశీయ ఆర్థికస్థితి క్లిష్టంగా ఉంది. నిత్యావసరాలైన వస్తువుల ధరలు పెరిగిఉండటం వల్ల ప్రజాబాహుళ్యంయొక్క ఆర్థిక స్థితి చక్కబడలేదు. సరకు ఉత్పత్తి అధికంగా ఉన్నప్పుడే ధరలు తగ్గుతాయి. అప్పుడే యిప్పుడు ఖర్చుపెడుతున్న డబ్బుకు ఎక్కువ సరకు లభిస్తుంది. ఉత్పత్తి పెంపొందించటానికి, చెలామణిలోఉన్న అదనపు ధనం తగ్గించి ఇన్‌ఫ్లేషన్ కంట్రోలు చేయటానికి ప్రభుత్వం కృషిచేస్తుందని ఆర్థికమంత్రి కె. షణ్ముఖంచెట్టిగారు ప్రకటించారు. బడ్జెట్టులోటు భర్తచేయటానికీ, ధరలు పెరిగిపోకుండా నిరోధించటానికీ ప్రజలు ప్రభుత్వ ఋణపత్రాలు స్వీకరించి తోడ్పడటం అవసరమని ఆయన హెచ్చరించాడు. ఈహెచ్చరికను పాటించటం చాల అవసరం. ప్రజలు ప్రభుత్వ ఋణపత్రాలను కొనీ, సేవింగ్ సర్టిఫికేట్లు సంపాదించీ ప్రభుత్వ విజ్ఞప్తిని పాటించాలి.

—చాణక్య.






తృతీయ ప్రపంచయుద్ధం తప్పనిసరి అవుతుందా? అనే ప్రశ్న క్రిందటి మహాయుద్ధం అంతమయినప్పటినించీ ఉండనే ఉంది. నాటినుండి నేటివరకు అతితీవ్రం అవుతూనే ఉంది. అయితే యుద్ధాలు ఎప్పుడూ జ్యోతిష్కులూ, రాజకీయవేత్తలూ సూచించినట్లు ప్రారంభం కావు. అనుకోని ప్రకారం, ఏదో చిన్న విషయానికి చినికి చినికి గాలివానగా ప్రారంభమై యావత్ప్రపంచాన్నీ చుట్టు ముట్టియ్యవచ్చు. ఉదాహరణగా, మిత్రరాజ్యసమితి పేలస్టయిన్ విషయమై చేసిన నిర్ణయం తీసుకొందాం. ఇది యెంత స్వల్పవిషయంగా గోచరించినా దీనిలోనే రానున్న మహాయుద్ధ ప్రళయానికి బీజంపడిందేమో!

పేలస్టయిన్ సమస్య విచారించడానికి సమితి ఒక ఉపసంఘాన్ని నియమించింది. వారు పేలస్టయిన్ విభజన చెయ్యాలని తీర్పుచెప్పారు. కాని నిజానికి అరబ్బుల జన్మహక్కుకే భంగం కలిగించేది ఇదేం నిర్ణయం అని మొట్టపెట్టుకొన్నారు. పెద్దసభకు విచారణకు వచ్చింది. విభజన పనికిరాదని అరబ్బు ప్రతినిధులూ, ఇండియా పాకిస్థాన్ ప్రతినిధులూ ప్రతిఘటించారు. కాని రష్యా, అమెరికా దేశాలు ఈవిషయంలో ఏకీభవించాయి. మొత్తం మీద కావలసిన మెజారటీ వోటుతో విభజన జరిగితీరవలసిందని నిర్ణయంచేశారు. ముందు అనుకొన్నవోట్లు రాకపోయినా చివరికి, 33 వోట్లు అనుకూలంగానూ 13 ప్రతికూలంగానూ వచ్చాయి. పదిమంది వోటుచెయ్యలేదు. ఇటువంటి అన్యాయమైన నిర్ణయం జరిగినందుకు అసమ్మతిగా ఇండియా, పాకిస్థాన్ అరబ్బు ప్రతినిధులు సభలోనించి లేచి వెళ్ళిపోయారు.

ఇప్పుడు ఆమోదించిన తీర్మానం ప్రకారం 1948 ఆగష్టు 1 వ తేదీతో బ్రిటిష్ అధికారం ఆఖరయిపోతుంది. పేలస్టయిన్ అరబ్బురాజ్యంగానూ, యూదురాజ్యంగానూ విభజన అవుతుంది. జెరూసలెమ్ స్వతంత్రనగరంగా ఉంటుంది. ఈనిర్ణయం అమలు జరపడానికి అయిదు రాజ్యాల ప్రతినిధులుగల ఒక కమిషన్‌ను నియమించారు. సిరియా, చెకొస్లొవేకియా, డెన్మార్కు, పనామా, ఫిలిప్పీన్సు. అయితే ఇందులో సిరియా నిరాకరించిన కారణంచేత - సిరియాకు బదులుగా బొలివియాకి ప్రాతినిధ్యంయిచ్చారు. ఈరాజ్యాలు తమ ప్రతినిధుల్ని నియమించిన వెంటనే - వీరికి తగిన సిబ్బందినిచ్చి, నిర్ణయం అమలు జరపడానికి పేలస్టయిన్ పంపుతారు.

అరబ్బులకి విభజన అంటే మొదటినించీ యిష్టంలేదు. అన్నివిధాలా ప్రతిఘటించి ఐక్య రాజ్యం స్థాపించాలనే ప్రయత్నంచేశారు. ఆఖరిసారి వారుచేసిన సూచనలోకూడా ఒక ఫెడరల్

విధానం ఏర్పరచి, రెండురాష్ట్ర ప్రభుత్వాలు స్థాపించడానికీ, వెనువెంటనే ఒక రాజ్యాంగ పరిషత్తు స్థాపించడానికీ సమ్మతించమని తీర్మానం ప్రతిపాదించారు. అదికూడా అమెరికా త్రోసిపుచ్చి, విభజన తీర్మానం వోటుపెట్టించి నెగ్గించింది. "అయితే మా మొదటి సమరం పూర్తిఅయింది. ఇంక మాదేశాన్ని మా మాతృభూమిలోనే సంరక్షించుకొంటాం" అని అరబ్బు లీగ్ కార్యదర్శి అజ్జామ్‌పాషా చెబుతున్నాడు. గత జూన్ మాసంలో అరబ్బురాజ్యాల ప్రతినిధులందరూ డెమస్కస్‌లోచేరి ఒక సైనిక నిర్ణయం చేసుకొన్నారు. దాని ప్రకారం సిరియా, లెబనాన్ ప్రదేశాలలో అరబ్బు యువకులు సైనికశిక్షణ పొందుతూ వున్నారు. ఇపుడు బాగ్దాదులో తిరిగి ముఖ్యనాయకులంతా సమావేశమై యుద్ధమేచేసి తమదేశాన్ని విభజన కానీయకుండా రక్షించాలని తీర్మానించారు. లక్షమంది సైనికులుగల సేన సిద్ధంగా ఉన్నది. యుద్ధం తీవ్రమయ్యేకొద్దీ అరబ్బు లీగ్‌లోచేరిన రాజ్యాలేగాక, ఈజిప్టు, ఇరాన్, ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్ టర్కీ మొదలయిన ఇస్లాం రాజ్యాలన్నీ యీ ఉద్యమంలో కలియవచ్చును. అంతేకాదు ఆసియావాసుల్ని అందరినీ మిత్రసమితి ద్రోహంచేసింది కనక ఆసియా అంతా యీ పేలస్టయిన్ సమరంలో పాల్గొంటుంది అని అజ్జామ్‌పాషా అంటున్నాడు.

అన్నివిషయాలలోనూ అమెరికా ప్రతిపాదించినదానికి ఎదురుతిరిగే రష్యా యీ పేలస్టయిన్ విషయంలో ఎందుకు ఏకీభవించింది అనే విషయం ఆశ్చర్యంగొల్పక మానదు. దానికి కారణం రష్యాలో నాయకులందరూ యూదులవ్వడం అటుంచి, ఇక్కడ దొరకిన అవకాశం వల్ల నయినా మిత్రసమితిద్వారా రష్యా మధ్యప్రాచ్యరంగంలో ప్రవేశించ దలచుకొన్నది. ఇంతవరకు ఎటుచూచినా రష్యాకి మధ్యప్రాచ్యరంగంలో ప్రవేశంలేదు. ఈయుపాయంచేతనైనా మధ్యధరా రంగంలో తనసైన్యాలకి ప్రవేశం కల్పించదలచుకొన్నట్టు తలచవచ్చును. రష్యాకి గ్రీసులో జరుగుతూవున్న అల్లరుల్లో ఎంత జోక్యం అనేది పరోక్షంగా ఆల్బేనియామీదుగా నిరూపించే ప్రయత్నం జరగడంతప్ప ప్రత్యక్షంగా రుజువుకాలేదు. గ్రీసులో మిగతా బాల్కన్ రాజ్యాలయిన యుగస్లావియా, బల్గేరియావంటి వాటి చేత ఏమయినా చేయించవచ్చుగాని ప్రత్యక్షంగా ఏమీ చెయ్యడానికి వీలులేదు. అలాగే టర్కీ విషయంలో చిరకాలంనించి రష్యా టర్కీల ఇరుగుపొరుగు సంబంధాలు అంత పొత్తుగాలేవు. అంతమాత్రంచేత తెగతెంపులు చేసుకొని వీధినివడవలసిన అవసరం రాలేదు.

మొత్తంమీద ముస్లింరాజ్యా లెవ్వరితోనూ రష్యా అంత సమరసంగాలేదు. టర్కీకంటె ఎక్కువ బహిరంగంగా సంఘర్షణ పడుతున్నది పర్షియాతో. 1946 వ సంవత్సరంలో పర్షియా ఆయిల్ పంపకం గురించి రష్యా ఒక ఒడంబడిక చేసుకొంది. అది పర్షియన్‌రాజా ఆమోదించాడు. అయితే పర్షియన్ పార్లమెంటు ఆమోదానికి వెళ్ళేటప్పటికి ప్రధానమంత్రి "ఖవాం సుల్తాన్" అది తిరస్కరింపచేశాడు. దీనితో రష్యాకి కోపంవచ్చి, ఒక హెచ్చరిక పంపింది. అయితే పర్షియా ప్రధానమంత్రి మాత్రం ఏమయినా సరే ఈ ఆయిల్ ఒడంబడిక ఒప్పుకోము అని ప్రకటించాడు. ఇందుకోసం యీ ప్రధానమంత్రి బ్రిటన్, అమెరికాల చేతిలో కీలుబొమ్మ అయి, దేశం ఒడంబడికలకు భంగంచేస్తున్నాడని రష్యా హెచ్చరిక

చేస్తోంది. దేశంలో రష్యా సరిహద్దు రాష్ట్రం అజర్‌బైజాన్‌లో అల్లకల్లోలం ప్రారంభమయింది. ధనవంతులయిన వర్తకులు లోపలికి పరారి అవుతున్నారు. ప్రధానికి ప్రతికూల వర్గంవారు అధికారంలోకి వస్తే—మళ్ళీ రష్యన్ ఒడంబడిక ఆమోదించవచ్చు. ప్రస్తుతం పర్షియన్ పార్లమెంటు అధ్యక్షుడుగా ఉన్న ఫాఖర్ హెక్‌మత్‌కి, ప్రధానితో అభిప్రాయభేదం ఉన్నట్టు తోస్తుంది.

ఈతని యాజమాన్యంక్రింద రష్యా ప్రోద్బలంతో ప్రస్తుత రాజు ప్రోత్సాహంతో క్రొత్త ప్రభుత్వం ఏర్పడితే ఏర్పడవచ్చు కాని ప్రస్తుత ప్రధాని ఘవాంసుత్రోపి దాటనడం కష్టం. అతనికి ప్రజలలోనూ, మజ్లీస్‌లోనుగల పలుకుబడి యెక్కువ. ఇప్పటి పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని చక్కగా నడిపిస్తూవున్న వ్యక్తి. అటువంటివాని నిర్ణయం ఆయిల్ విషయంలో రాజుకి వ్యతిరేకంగాకూడా నెగ్గింది. అందుచేత పట్టుదలతో ఘవాం రష్యన్ ప్రతికూల ఉద్యమాన్ని నడిపిస్తాడు. ఆసందర్భంలో 1946లో చేసినట్టు, ఉత్తర సరిహద్దుల్లో రష్యా పిల్లపమేరాలు లేవదీసి తన సేనల్ని టెహరాన్ ప్రాంతాలకి పంపించే యెత్తువేయవచ్చు. దానితో యిక్కడకూడా చిన్నతగాదా బయలుదేరి—మధ్యప్రాచ్య యుద్ధప్రళయానికి యిదొక చిన్నజ్వాలను కలుపుతుందేమో.

రష్యాకి ఇతర దేశాలతో జోక్యం ఏమిటి? సామ్రాజ్య తత్వాన్ని నిరసించే యీ దేశం యిటువంటి యెత్తులు వేయడం ఏమిటి? అనే ప్రశ్నలు ఉదయించవచ్చు. నిజానికి సామ్రాజ్య తత్వంతో దేశం విస్తరింప చెయ్యాలనే సంకల్పంతో రష్యా యీ విషయాలలో కలగజేసుకోవడంలేదు. పర్షియా, రష్యాకి ఇరుగు పొరుగు రాజ్యం. ఆయిల్ గనులున్నస్థలం. తనకి ఆయిల్ కావాలి. అందుకు నయానా భయాన ఒడంబడిక చేసుకొన్నది. కాని పర్షియా స్వయం బుద్ధిచేత కానివ్వండి - బ్రిటన్ అమెరికాల ప్రోద్బలంచేత కానివ్వండి నిర్ణయమైన ఒడంబడికకు భంగంకలిగించింది. అందుచేత పట్టుదలకు తన ఒడంబడిక నెరవేర్చుకోవాలని చూస్తున్నది. పైగా తన సరిహద్దు దేశం పర్షియా అవ్వడం ఆయువుపట్టు. అక్కడపరిస్థితులు ఇతరులకి అనుకూలంకావడం తనక్షేమానికే భంగంకలిగించవచ్చు. అందుచేత పర్షియాలో యింతశ్రద్ధ పూనడం రష్యా ఆత్మక్షేమంకోసమే. ఇలాగే యితర యూరపియన్ దేశాలలో కూడా రష్యా తన పలుకుబడికోసం, అమెరికాతో పోటీపడి ఎదిరిస్తోంది.

యుద్ధానంతరం యూరపు మధ్యభాగమంతా వికలమైఉన్నది. పరిశ్రమలు, పంటలుకూడా అధోగతిలో ఉన్నవి. ప్రజలందరూ అన్నవస్త్ర వసతులకు అలమటిస్తున్నారు. ఇటువంటి వాటికి సహాయంచేసి యూరపు ఆర్థికస్థితి అంతా బాగుచెయ్యాలని అమెరికా కార్యదర్శి మార్షల్ ఒక పథకం తయారుచేశాడు. అది అధ్యక్షుడు ట్రూమన్ ఆమోదించాడు. కాంగ్రెస్ ఎదుట నివేదించాడు. అమెరికన్ కాంగ్రెస్ మంజూరు చేస్తుంది.

నిజానికి యీపథకంద్వారా యూరపుప్రజల్ని ఆర్థికదాస్యంలోకి పడత్రోసి యూరపునంతనూ అమెరికా ఏలుబడి చెయ్యాలనే చూస్తోందని రష్యా ఆరోపణచేస్తోంది. అందుకోసం, తూర్పు యూరప్‌లో ఉన్నరాజ్యాలన్నిటినీ రష్యా కూడదీస్తోంది. బెల్గ్రేడ్‌లో కార్యాలయంగా

తొమ్మిదిరాజ్యాలు కలిసిన 'కామిన్‌ఫారమ్' తిరిగి రష్యా లేవదీసింది. ఇందులో రష్యా, పోలెండు, జెకోస్లోవేకియా, హంగెరీ, బల్గేరియా, రుమేనియా, యుగస్లావియా మొ॥ దేశాలున్నవి. దీనితో అంతర్జాతీయ కమ్యూనిష్టు సంస్థ సూక్ష్మరూపంతిరిగి ఏర్పడింది. 1943 లో ఆపివేసిన యీ సంస్థను తిరిగి పునరుద్ధరించి నట్లయింది. ప్రపంచంలో సంస్థ కమ్యూనిష్టు వర్గాలూ కలిసి విప్లవంతేవాలి, అందుకు అన్ని వర్గాలూ ఒక సిద్ధాంతంమీద పనిచెయ్యాలి అనేదృష్టితో లెనిన్ 1919 లో యీసంస్థ స్థాపించాడు. ఇది 1943 వరకు పనిచేసింది. ఆకాలంలో యుద్ధకారణంగా, ఇతర రాజ్యాలసహాయం రష్యాకి కావలసి యీసంస్థ రద్దు చేసింది. పైగా స్టాలిన్ విదేశాంగవిధానం యిటువంటి ప్రపంచవిప్లవాన్నీ, కమ్యూనిష్టు ప్రచారాన్ని ఆమోదించేదికాదు. తిరిగి యీనాటి ప్రతికూల వాతావరణంలో ఈ తొమ్మిది రాజ్యాలసభ ఏర్పడింది. ఇటువంటిదే దూరప్రాచ్యదేశాలయిన ఇండియా, ఇండోచైనా, బర్మా, కొరియా, ఫిలిప్పీన్సు, చైనా, మంగోలియాదేశాల ప్రతినిధులతో ఇటీవల మంచూరియాలోని హార్బిన్ నగరంలో సమావేశమైందనీ, వీరి కార్యస్థానం రష్యాకి తూర్పుసరిహద్దు వ్లాడివిస్టాక్ నగరంలో ఉంటుందనీ వదంతి. ఈ రాజ్యాలలోని కమ్యూనిష్టు ప్రతినిధులమధ్య విశేషాలు తెలుసుకోవడానికి సమాచార సంస్థగా ఏర్పడిందని మొదట అంటున్నారు. కాని మొత్తంమీద కమ్యూనిష్టు ప్రభావం తూర్పుదేశాలలో అంతకంతకి ఎక్కువవుతోంది. ఈనాడు తూర్పుదేశాలన్నీ తిండి బట్టకరువులతో అల్లాడిపోతున్నవి. చైనావంటిదేశంలో ప్రభుత్వంయొక్క అసమర్థతవల్ల ప్రజల అవస్థలు ఎక్కువవుతూ ఉన్నవి. అమెరికావంటిదేశం, ఆర్థికసహాయం సైనికసహాయం ఎంతచేసినాగాని అది బూడిదపోసినట్లే అవుతోందని ఇటీవల అమెరికా వచ్చిన సేనాని వెడిమేయర్ చెప్పాడు. పార్టీఎవ్వరైనా ప్రజల అవసరాలు తీరాలి. కష్టాలు తప్పాలి. అందుకే వారు కమ్యూనిష్టుల వైపు మొగ్గుతున్నారు. ఉత్తర చైనాలో కమ్యూనిష్టు విజయాలు ఎక్కువవడానికికూడా ఆదేకారణం. ఇండోచైనాలో ప్రస్తుతం ఫ్రెంచి అధీనప్రభుత్వమైన వారికి కమ్యూనిష్టు బలంఉన్నది. దేశంలో కమ్యూనిష్టుప్రాబల్యం ఎక్కువవుతోంది. అలాగే బర్మాలోకూడాను. ఇటీవల స్వతంత్రప్రభుత్వం ఏర్పడిన సింహళంలో - కమ్యూనిష్టు ప్రచారంచెయ్యడానికి విదేశప్రభుత్వాలతో రహస్యమంతనాలు జరిపినట్టు ఒక ఆచోకీ తెలిసిందని ప్రధానమంత్రి సేనానాయక తెలియజేశాడు. మనదేశంలో కమ్యూనిష్టుపార్టీ కార్యక్రమం అందరకు తెలిసిందే. మొత్తంమీద ప్రపంచమంతటా కమ్యూనిష్టుప్రాబల్యం రానురాను వ్యాపించడం కనిపిస్తోంది.

దీనికి కారణం ఏమిటి ? రష్యాలో నిజంగా యితరదేశాలకి దీని మూలంగా యుద్ధమే సంభవిస్తుందా ? సంభవిస్తే ప్రపంచ పరిణామం ఎలాగ వుంటుంది ? అనే ప్రశ్నలు ఇప్పుడు అందరినీ ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ ఆర్థిక దుస్థితి ఏర్పడి తిరిగి ధరలు పడిపోతే ప్రజలందరు కమ్యూనిష్టువైపే మొగ్గుదల చూపుతారు. ఆ సన్నివేశాన్ని చూచుకొనే రష్యా యీ నాడు తన తురఫుముక్క కొట్టి చూపుతున్నది. అయితే అన్నిచోట్ల, అడుగడుక్కీ సంఘర్షణ పడుతున్నవి, రష్యా అమెరికాదేశాలు. ఈ సంఘర్షణలు యిటీవల ముగిసిన

మిత్రరాజ్య సమావేశ చర్చల్లో గోచరించనే గోచరించాయి. తిరిగి యిపుడు లండన్‌లో జరుగుతున్న విదేశాంగ మంత్రుల మహాసభలో యీ విభేదాలు కనిపిస్తున్నవి. ఈ నాడు లండన్‌లో జరిగేది అయిదో సమావేశం. జర్మనీ సంధి ఒడంబడిక నిర్ణయించడం, జర్మనీకి ఏక ప్రభుత్వం స్థాపించడం మొదలయిన అంశాలు యీ మహాసభలో నిర్ణయం జరగాలి. ఇదివరకు మాస్కోలో దీనిని గూర్చి సమావేశం జరిపి యే నిర్ణయమూ తేల్చకుండా ముగించి వేశారు.

లండన్ మహాసభ నవంబరు 25 వ తేదీని ప్రారంభమయింది. అసలిది జయప్రదంకాదని ముందే బ్రిటిష్ పత్రికలు అపశకునాలు పలికాయి. ముందు చర్చావిధానం గురించే తర్జన భర్జన వచ్చింది. కొంత చర్చజరిగిన తర్వాత ఒక నిర్ణయానికి వచ్చారు. దానిప్రకారం అమెరికా సూచించిన ప్రకారం జర్మనీతో శాంతిషరతులు చర్చించడానికి పిలిచే దేశాలలో పాకిస్థాన్‌నుకూడా కలపడానికి రష్యా సమ్మతించింది. జర్మనీ కేంద్రప్రభుత్వం గురించిన చర్చకంటె ముందు జర్మనీ సంధిషరతులు చర్చించడానికి అంగీకరించారు. ఏది యేమైనా - యిప్పటికైనా యీజర్మనీ సంధిసంగతి పూర్తిగా పరిష్కారంకావాలి. జర్మనీకి స్వాతంత్ర్యం ఇవ్వాలి; జర్మనీ అంతకీ ఏకప్రభుత్వం స్థాపించాలి అని రష్యావాదన. నష్టపరిహారాల సంగతి ముందుతేల్చండి - మార్షల్ పథకం ప్రకారం జర్మనీని పునరుజ్జీవితం చేస్తాం అని అమెరికా వాదన. బ్రిటన్ ఆర్థికంగా చాలదుర్బలంగా ఉండటంచేత జర్మనీలోని తనమండలం ఏమీ చెయ్యలేదు సరిగదా వదలుకొనివచ్చే స్థితిలో ఉంది. ఫ్రాంసుస్థితికూడా అలాగే ఉంది. ఫ్రాంసులో రమాదియా ప్రభుత్వంపోయి షూమన్ యాజమాన్యంక్రింద కొత్తప్రభుత్వం ఏర్పడింది. సోషలిస్టుపార్టీ, యమ్. పి. అర్. లు కలిసి యీకొత్తప్రభుత్వం నడుపుతున్నారు. దీనికి దీగాల్‌వంటి వారిప్రోద్బలం ఉంది. అయితే ఫ్రాంసులో ప్రస్తుతం పెద్దతరహామీద సమ్మెలు జరుగుతూ ఉన్నాయి. అందులో రైల్వే, రాకపోకలు, పరిశ్రమలేగాక పోలీసువారుకూడా చేరారు. కమ్యూనిష్టు ప్రాబల్యంతో సాగే యీసమ్మెలు ఇంత త్వరగా పరిష్కారం అయ్యేటట్లు తోచదు. ఇటువంటి సందర్భంలో షూమన్‌ప్రభుత్వం ఎంతకాలం నిలుస్తుందో అనుమానమే. అటువంటివారి ప్రతినిధిగా బిడోల్టుని పంపించారు కాని ఆప్రతినిధి మాటలకి అట్టే విలువ ఉండదేమో!

జర్మనీ సంగతితేల్చడం మొత్తంమీద యూరపు భవిష్యత్తుకి ముఖ్యం. దీని పరిష్కారం విధానంమీదనే రానున్న యుద్ధవైఖరి నిర్ణయంకావచ్చు.

సనిలోపని జపాను శాంతిషరతులు నిర్ణయించడానికి త్వరలో ఒక సమావేశం జరపాలనీ అందులో అయిదు ముఖ్యరాజ్యాల మహాసభ జరపాలనీ రష్యా కోరుతోంది. అయిదేమిటి తూర్పు రాజ్యాలు పదకొండుదేశాల ప్రతినిధుల్ని యీసమావేశానికి ఆహ్వానించాలని అమెరికా కోరుతోంది. జపాను నష్టపరిహారాలు సంధిషరతులు నిర్ణయించేసభతో గత మహాయుద్ధం తాలూకు దుష్ఫలితాలు పరిసమాప్తి అవుతాయని తలంచవచ్చు.

విఙమైన అభిప్రాయభేదాలు వీటిలోలేవు. రష్యా, అమెరికాలు పోటీపడే మరో అంశం అటంబాంబు రహస్యం. ఇదేం రహస్యంలేదు మాకందరికీ తెలుసునని రష్యా విదేశాంగ మంత్రి మొలటాఫ్ ఆ మధ్య ప్రకటించాడు. రష్యనులు జర్మనీలో సేకరించిన నిపుణులతో అటంబాంబులు తయారుచేయిస్తున్నారని ఒక వదంతి ఉంది. అమెరికా తన యాటంబాంబు రహస్యం బ్రిటన్‌కి, బ్రిటిష్ సామ్రాజ్యదేశాలకి అందులో ముఖ్యంగా ఇండియా పాకిస్థాన్ దేశాలకి చెబుతుందని మరొక వదంతి. మొత్తంమీద ఉభయ దేశాలవారూ మనదేశాన్ని బుజ్జగించాలని చూస్తున్నారు. మిత్రరాజ్య సమితి చర్చించిన అనేకవిషయాలలో యీ సంగతి తేటతెల్లమైంది. సమితి భద్రతాసంఘంలో పదకొండుగురు సభ్యులు ఉంటారు. అందులో అయిదుగురు శాశ్వత సభ్యులు. ఆ అయిదు స్థానాలూ అయిదు పెద్దరాజ్యాలయిన అమెరికా బ్రిటన్, రష్యా, చైనా ఫ్రాంసుదేశాలకి లభించాయి. మిగతా ఆరు స్థానాలలోనూ ఒక స్థానానికి ఖాళీవస్తే దానికి ఇండియా, యుక్రెయిన్లు పోటీచేశాయి. చివరికి కొంత ఒత్తిడివల్ల ఇండియా యీ పోటీనించి తప్పుకొంది. యుక్రెయిన్‌కి అది లభించింది. ఇది యిలా ఉండగా, ఏదైనా ఒక నిర్ణయం జరిగితే శాశ్వత సభ్యుల్లో యేయొకరైనా తమకి ఇష్టంలేకపోతే అడ్డు తగలవచ్చు. ఇదే వీటో అధికారం. ఇది పురస్కరించుకొని రష్యా ఎన్నోసార్లు ముఖ్యవిషయాల నిర్ణయానికి ఆటంకం కలిగించిందని అమెరికా అభిప్రాయం. అందుచేత యీ కష్టంలేకుండా, మిత్రసమితి మహాసభకి బదులు మరో చిన్నసభ పెట్టాలని అమెరికా ప్రతిపాదించింది. అది రష్యా వీటో అధికారాలు తప్పించుకొనడానికి వేసిన యెత్తే. దీనికి ఇతర రాజ్యాలతోపాటు ఇండియా తోడ్పాటుచేసింది.

ఆవిధంగా ఏరాజ్యానికి ఆరాజ్యం ఇండియాను ఉపయోగించుకోవాలని చూచాయి. కాని యీయుద్ధతులమధ్య వేదలతుండ తరమా అనేది నిర్ణయించుకోవాలి. అనుభవంబట్టిచూస్తే యీ పెద్దరాజ్యాలవారు అవసరం వచ్చినప్పుడు వినియోగించుకోవడం తప్ప చిన్నరాజ్యాల సమస్యలువచ్చినపుడు ఘోరంగా దగాచేస్తున్నారు. ఉదాహరణగా ఇండోనీషియన్ సమస్య, దక్షిణాఫ్రికా భారతీయుల సమస్య తీసుకోవచ్చు. ఇండోనీషియన్ సమస్య పరిష్కారంకాలేదు. యుద్ధం ఆగింది అని పేరుకి ప్రకటించినా యుద్ధం సాగుతూనేఉంది. డచ్చివారు ఆక్రమించు కొన్న ప్రాంతాలనించి కదలమంటున్నారు. ఇటువంటి పరిస్థితులలో డచ్చి ప్రతినిధులూ, ఇండోనీషియన్ ప్రతినిధులూ ఒక అమెరికన్ ఓడలోకలిసి తమతగాదాలు పరిష్కారం చేసుకోబోతున్నారు. అది యెంతవరకు జయప్రదం అవుతుందో చెప్పలేము. మన భారతదేశం తెచ్చిన దక్షిణాఫ్రికా అభియోగానికి 22 వోట్లు అనుకూలంగా వచ్చినప్పటికీ తీర్మానంనెగ్గలేదు.

చివరకి సమితి సమావేశం ముగిసినతర్వాత అధ్యక్షత వహించిన బ్రెజిల్‌నాయకుడు ఆరన్‌హా మనతగాదాలు స్వయంగా రవుండ్‌టేబిల్ సభద్వారా పరిష్కరించుకోవలసిందని విజ్ఞప్తిచేశాడు. కాని సమయంవచ్చేటప్పటికి ఆసియా సమస్యల విషయంలో పెద్దరాజ్యాల వారు అన్యాయంచేస్తున్నారని భారతప్రతినిధి విజయలక్ష్మి చెప్పింది. అందుచేత ఆసియా రాజ్యాలన్నీ కలిసి నిలువవలసిన అవసరం ఎంతయినా ఉంది. ఆసియారాజ్యాలలో చైతన్యం

కనిపిస్తోంది. దానికి తార్కాణంగా ఇటీవల మనదేశంలో జరిగిన ఆసియా కార్మికసభనే తీసుకోవచ్చు. మిత్రరాజ్యసమితిలో విజయలక్ష్మివంటి రాయబారి ప్రతినిధిగా ఉండటంవల్ల లేనిపోని మొగమోటాలకు పోవలసివస్తోంది. కొన్ని విషయాలలో నిష్కర్షగా వ్యవహరింప వీలులేకపోతున్నది. మిగతా దేశాలలాగ, ఇండియాకూడా విదేశాంగ శాఖ అధికారులన్నే మిత్ర రాజ్యసమితికి శ్రేయస్కరం అని లూయీఫిషర్‌వంటివారు సలహాయిస్తున్నారు. ఈ సలహాలో ఎంతో సత్యం యిమిడిఉన్నది.

ఇకముందు జరుగబోయేసభకి విజయలక్ష్మినే నాయకురాలిగాపంపాలో లేక ఆమెను రష్యా రాయబారిగానే ఉంచాలో నిశ్చయించాలి. రానున్నసభల్లో ఇండియా నిర్వహించవలసిన పాత్ర ప్రాముఖ్యం మరింత అతిశయిస్తుంది. యుద్ధ మేఘాలుముసిరే యీసమయంలో ఈవిషయంలో యింకా మెలకువ అవసరమేమో! ఇండియా పలుకుబడిమీద బ్రిటన్‌కూడా ఆధారపడిఉన్నట్టు కొన్ని ముఖ్యచర్చలవల్ల తేటపడింది. అంతర్జాతీయసభల్లో ఇండియా స్వతంత్రంగా వ్యవహరిస్తోంది. జినీవాలోజరిగిన వ్యాపారసభలో ఇండియాపాల్గొని ముఖ్యమైన ఒడంబడికలు చేసుకొంది. నేడు హవానాలోజరిగే ప్రపంచసభలోకూడా ప్రధాన పాత్ర తీసుకొంటోంది. అటువంటి దేశక్షేమాన్ని యావత్ ప్రపంచంతోపాటు పూర్వపాలకులు బ్రిటిష్‌వారు గమనిస్తున్నారు.

చర్చిల్‌వంటి గ్రుడ్లగూబలు కళ్ళుపొడుచుకోవచ్చు. బ్రిటన్‌చేసిన నిర్ణయంయొక్క సత్ఫలితాన్ని ఇండియాద్వారా త్వరలోనే ఆశించవచ్చు. ఈనాడు బ్రిటన్‌లో ఆర్థికపరిస్థితులు ఏమీ తృప్తికరంగాలేవు. ఇటీవల జరిగిన చరిత్రాత్మకమైన ఎలిజిబెత్ రాజకుమార్తె వివాహం కూడా అతిస్వల్పంగా తేలిపోయింది. బ్రిటన్ ప్రజలు విపరీతమైన త్యాగాలు చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎన్నికల్లో మార్పు వస్తుందేమోయని భయంకలిగింది. మునిసిపల్ ఎలక్షన్లు మాత్రం కాన్సర్వేటివ్ పక్షానికి విజయం కలిగించినాగాని యిటీవలవచ్చిన రెండు బై ఎలక్షన్లలో తిరిగి లేబర్‌పార్టీకే విజయం లభించింది. ఇంతలో బడ్జెటు విషయం రహస్యం తెలిసిపోయిందని ఆర్థికమంత్రి డాల్టన్ తనపదవికి రాజీనామా యిచ్చాడు. తిరిగి యీ విషయంలో విచారణజరిగి అతడు నిర్దోషిఅని నిశ్చయం అయిన తర్వాత యీయన తిరిగి మంత్రివర్గంలోకి వస్తాడని ఆశించవచ్చు.

బ్రిటన్ తన ఆర్థికస్థితిని అత్యంత త్వరితంగా చక్కదిద్దుకోవాలి. అది జరిగితే తప్ప ఏమీచేసేస్థితిలో లేదు. ఈలోపున ప్రపంచాధిపత్యంలో రష్యా, అమెరికాలు పడేపోటీలలో తాను కలుగజేసుకోలేదు. యుద్ధంవస్తేగిస్తే, బ్రిటన్ తటస్థంగా అయినా ఉండిపోతుంది తప్ప ఎవ్వరిలోనూ కలిసేస్థితిలోలేదు. బ్రిటన్ అనుసరించిన విధానాన్నే బ్రిటిష్‌కామన్‌వెల్తు రాజ్యాలూ అనుసరించక తప్పదు. వాటితోపాటే మనఇండియా పాకిస్తాన్ దేశాలున్నూ. ఇండియా, పాకిస్థాన్ దేశాలున్నూ తమలోగల అభిప్రాయభేదాలు పరిష్కరించుకొని పనిచేస్తే ఆసియాఖండానికి తామే నాయకత్వం వహించి దేశసౌభాగ్యానికీ ప్రజాక్షేమానికీ ఉపయుక్తమైన ఎన్నోకార్యాలు చేయవచ్చు.



# నా చిన్ననాటి ముచ్చట్లు

కె. యన్. కేసరి

(అక్టోబరు సంచిక తరువాయి)

బందరువీధినుండి ఎగ్మూరుయింటికి పోయినపిమ్మట మందులవ్యాపారము యింకను వృద్ధి అయినది. ఇంటికి సమీపమునయుండు పూనమల్లిహైరోడ్డులో యొక పెద్దభవనమును అద్దెకు తీసుకొని అక్కడ ఆఫీసును మందులుచేయు ఫాక్టరీని యుంచితిని. అక్కడనే లోధ్ర ముద్రాలయమునుకూడ స్థాపించితిని. అక్కడనుండియే "గృహలక్ష్మి" ప్రథమ పత్రిక వెలువడినది.

ఇప్పుడు నాకు 43 సం॥ వయసు అయినది. రోగపీడితురాలయిన భార్య యింటయున్నది. ఇంటిలో మరియెవరునులేరు. నాకు కొంత ఆస్తి, ఇల్లు, వ్యాపారము చేకూరినది. సంతానము లేదు. సంపాదించిన సొత్తునకు వారసులులేరు. ఈ సమయమున నా బావమరిది కొడుకును దగ్గర తీసితిని. వాడు త్వరలోనే చనిపోయెను. పిల్లవాడు చనిపోయినవెంటనే మాకు విరక్తి భావము మనసునకుతోచి ఇరువురము తీర్థయాత్రలకు ప్రయాణమైతిమి. ఉత్తర దక్షిణ యాత్రలన్నియు మూడుమాసములలో ముగించుకొని యిల్లు చేరితిమి. నాభార్యజబ్బు దిన దినాభివృద్ధి యగుచుండెను.

## "యమ్‌డన్" క్రూయిజర్

మేము బందరువీధిలోనుండగా 22-9-1914 తేదిన మొదటి ప్రపంచయుద్ధములో జర్మన్ క్రూయిజర్ "యమ్‌డన్" మద్రాసుపై ఫిరంగిగుండ్లు వదలినది. ఆనాడు నేను రాత్రి 9 గం॥లకు భోజనానంతరము యింటి వరాండాలో యుంటిని. అకస్మాత్తుగ సముద్రములోనుండి గొప్పవెలుతురును శబ్దమును చూచితిని. ఈ శబ్దము ఏమైనది ఎవరికి తెలియక గుంపులు గుంపులుగా సముద్రతీరమువద్దకు పరువెత్తిరి. నేనును కొంతదూరమువరకుపోయి బర్మాషెల్ ట్యాంకులు భయంకరముగ తగలబడుటచూచి వెనుకకు తిరిగితిని. "యమ్‌డన్" మద్రాసుపై అకస్మాత్తుగ ఫిరంగులగాల్చి పరుగెత్తిపోయెను. "యమ్‌డన్" పోయినపిమ్మట మనవారు కోటలోనుండి సముద్రముమీద ఫిరంగిలను పేల్చిరి. ఆనాడు రాత్రి మద్రాసునుండి లక్షల కొలదిజనము దిక్కుతెలియక నలుదిక్కులకు పరుగెత్తిరి. ఇల్లువిడచి పోలేనివారు అక్కడనే వుండిపోయిరి. తెల్లవారగనే పురజనులు సముద్రమువద్దకుపెళ్ళి ప్రేలిన ఫిరంగిగుండ్ల వుక్కుముక్కలను యేరుకొనిపోయి "యమ్‌డన్" జ్ఞాపకార్థము యింటిలో భద్రపరచుకొనిరి. నేనును ఒకముక్కను తెచ్చితిని.

ఆనాటి ఫిరంగిగుండు ఒకటి హైకోర్టు ప్రహరీగోడకు - తూర్పుదిశనున్నదానికి తగిలినది. దానివల్ల ఆగోడ కొంత బొక్కపడినది. ఆ విశేషమును తెలుపుచు నాగోడను రిపేరు చేసినప్పు డాచోట నీక్రిందివిధముగా నొకరాతిపై చెక్కించి గోడలో నమర్చియున్నారు.

"1914 సెప్టెంబరు 22 వ తేదిరాత్రి జర్మన్ క్రూయిజర్ 'యమ్డన్' మద్రాసును ముట్టడించినప్పుడు ఒకగుండు ఈ ప్రహరీగోడను తగులగా ఈ భాగమున కొంత గోడ ఎగిరిపోయినది."

జబ్బుగయుండిన నాభార్య ఫిరంగిశబ్దములకు అదురుకొనగా స్మృతితప్పి క్రమముగ తెలివి వచ్చెను. అప్పుడది జరిగెను. ఇటీవలజరిగిన రెండవప్రపంచయుద్ధములో 1941 డిశంబరు జనవరినెలలో జపాను ఓడలు మద్రాసుకు వచ్చుచున్నవని పుకారు కలిగినప్పుడు మద్రాసు జనమంతయు నలుదిక్కులకు పారిపోయినప్పుడు నాభార్యయు ఒంగోలుకుపోయి మా బంధువు చివుకుల శ్రీరామశర్మగారియింట మరణించెను.

ఆమె క్రతువులు గడిచినపిదప కొన్నాళ్ళు నేను మద్రాసులో ఉంటూ ఉండగా బర్మాలో జపానువారు విజృంభించుకొలది సింగపూరు పడిపోయినపిదప జపానుసేనలు ఏనాడో మద్రాసులోదిగుసన్న భీతాహము ప్రజలలో హెచ్చసాగెను. రోజు రోజును వందలు వేలుజనము మద్రాసువిడిచి ఇతర ప్రదేశములకు వెళ్ళిపోజొచ్చిరి. ఏప్రిల్ 1, 2 తేదులనుండి కలకత్తాలో బాంబులుపడినవని పట్నములో పుకార్లురేగినవి. 3 వ తేది మాయింట మహాదేవయ్యపెండ్లి. 4, 5– పైవార్తలింకను ప్రబలమైనవి. 6 వ తేది మధ్యాహ్నమున మద్రాసులో తీరమునకు సమీపముగా శత్రునౌకలు తిరుగుచున్నవనియు, ఎప్పుడైన దాడి జరుగవచ్చుననియు, ఈసారి ఊదబోవు హెచ్చరిక బాకా అభ్యాసమునకుగాక, వాస్తవమే అని తలచుడనియు—ప్రభుత్వము వారు శబ్దవిస్తరణ యంత్రసాయమున నగరమంతయు చాటిరి. అందరికి 22-9-1914 నాటి అనుభవము తిరిగి స్మృతికివచ్చెను. నేనును బంధువులను స్థలాంతరమునకు పంపుటకై రైలుకువెళ్ళియుండి మిత్రుల బంధువుల బలవంతమున పట్నమువదలివెళ్ళితిని. ఉన్నవారు చిల్లరదొరకక, తినుటకు వస్తువులు దొరకక, హోటళ్ళలో కాఫీయుదొరకక చాలబాధపడిరట. 14, 15, 16 తేదులలో పట్నం ముప్పాతికకుపైన ఖాళీఅయినదట. పిదప క్రమముగా తిరిగీ పూటుకొన్నది. అప్పుడారునెలల పర్యంతము "కేసరీకుటీరం" ఆఫీసును తిరుచూరుకు మార్చితిమి. అప్పుడే "గృహలక్ష్మి" నిలిచిపోయి తిరిగి ఈ సంవత్సరారంభమునుండి వెలువడుచున్నది.

## ముగ్గురు బంధువులు

నేను ముగ్గురు పిల్లకాయలను దగ్గిరదీసి పెంచి పెద్దచేసితిని. వారిలో మొదటవాడు శిష్ట్లా శేషగిరి, వీడు నాకు దగ్గిరబంధువు. వీడిని యింటర్ ప్యాసుచేయించితిని. పిదప గవర్నమెంటు ఇండియన్ మెడికలు స్కూలులోచేరి L. I. M. డిగ్రీనిపొందెను. నా యనుభవమును వానికి బోధించితిని. క్రమముగ అన్నికార్యములలో సమర్థత కల్గినపిమ్మట కేసరికుటీరమునకు వైద్యుడుగను, ఆఫీసునకు మేనేజరుగను నియమించితిని. ఒంగోలు కాపురస్థుడగు శ్రీ చివుకుల శ్రీరామశర్మగారి పుత్రికనిచ్చి వివాహమును చేయించితిని. వీరిని నావద్దనే

యుంచుకొంటిని. వీనియందు నాకుకలిగిన నమ్మకము, అమరాగమువలన కేసరికుటీరమును లిమిటెడ్ కంపెనీగా మార్చునపుడు వీడికి కొన్ని షేర్లనిచ్చి కంపెనీకి డైరక్టరుగ నియమించితిని. వీనికి బిడ్డలుకలిగి సంసారము పెద్దదికాగానే ఎగ్మూరులో నాకువున్న యిండ్లలో ఒక యింటిని వీడిపేరటచేసి వీడికుటుంబమును నాయింటినుండి అక్కడికి మార్చితిని.

## రెండవ పిల్లవాడు

ములుకుట్ల మహాదేవయ్య. వీడు నా బావమరిది కుమారుడే గాక నా మేనమామ మనుమడు-ఆ పేరటివాడు. వీనినికూడ చిన్ననాటినుండి చదువుచెప్పించి పెంచి పెద్దచేసితిని. వీనికి రావుబహదూరు కవికొండల బ్రహ్మయ్యపంతులుగారి కుమార్తెనిప్పించి నా ఖర్చుతో పెండ్లి చేసితిని. వీని వివాహానంతరము వీడు నా మాటను తిరస్కరించి తప్పుత్రోవత్రొక్కి నాకు విరోధి ఆయెను. అయినను కేసరికుటీరమున నౌకరినిచ్చి నా యింటనే కాపుర మించితిని. వీని కి పెండ్లిచేయుటే నాజీవితములోని గొప్పతప్పు అని యిప్పుడు తోచుచున్నది.

## మూడవ పిల్లవాడు

చివుకుల చెంచుపున్నయ్య. వీడు నా మరదలి కొడుకు. వీడినికూడ చిన్నప్పటినుంచి నావద్దనే పెంచితిని. వీడు యింటర్ నాలుగుసార్లు టెస్టుపెట్టినాడు. పెండ్లిగానే పండిపోయెను; తలతిరిగెను. అప్పుడు వీనిని నా యింటనుండి వెడలగొట్టవలసివచ్చెను.

అలివంకవారు ఆత్మబంధువులు అనెదరు. కాని వీరిరువురు నాకు ఆత్మ ద్రోహులయిరి. దురదృష్టవంతులు: వీరినిగూర్చి నేను నిరంతరము చాల చింతిల్లుచున్నాను.

## నెల్లూరి పరిచయము

నెల్లూరిలో నాకు ముఖ్యస్నేహితులు మైదవోలు చంగయ్య పంతులుగారును. (Public Prosecutor) A. సంతానరామయ్యంగారును (V. R. H. School, Headmaster). చుండూరి వెంకటక్రిష్ణయ్యగారును (Vakil). విస్సా రాజగోపాలరావుగారును (Vakil) యుండిరి. మొదటి ముగ్గురును గతించిరి. వీర్ల స్నేహమువల్ల నేను పలుమారు నెల్లూరికి పోవుచుంటిని. నేను ప్రోగ్రసీవు యూనియనులో యిప్పుడుకూడ మెంబరుగానే యున్నాను. తిక్కన జయంతి ఉత్సవాదులలో పాల్గొనుచుంటిని. దసరా ఉత్సవములలోను పాల్గొనుచుంటిని. ఆ ఉత్సవములలో ఒకరోజు నా ఉభయము. అల్లె చంగయ్యగారు. అమంచర్ల సుబ్బుకృష్ణరావుగారును ఉభయముల చేయించేవారు. సభ్యులందరి దొకరోజు—గృహలక్ష్మి స్వర్ణకంకణ బహుమానములను శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారికిని. శ్రీమతి చిలకపాటి సీతాంబగారికిని. శ్రీమతి కవితిలక కాంచనపల్లి కనకమ్మగారికిని. శ్రీమతి కమలాదేవిగారికిని నెల్లూరి పురమందిరముననే ప్రోగ్రసీవు యూనియను తరపున యిచ్చితిని. మొల్లజయంతులను జరిపించి స్త్రీరచయితలకు బహుమానముల నచ్చటనే యిచ్చితిని. నెల్లూరులో జరుగు కార్యములలోను అప్పుడప్పుడు పాల్గొనుచుంటిని. నేను ఒంగోలుప్రాంతమునకు చెందినవాడనైనను

వన్ను నెల్లూరివానినవియే అంతరు అనుకొనెదరు. నా ముఖ్య స్నేహితులలో మొదటివారగు మైదవోలు చంగయ్యపంతులుగారు మద్రాసు హిందూ దేవాలయముల బోర్డుకు కమీషనరుగ మద్రాసుకురాగానే నాకు నెల్లూరి సంబంధము చాలవరకు తగ్గినది. నెల్లూరిలో నాకు బంధువులు, స్నేహితులు అనేకులు యిప్పటికిని ఉన్నారు—కొన్నాళ్ళు నేను నెల్లూరిలో నుండుటయు జరిగెను.

## నెల్లూరి విద్యార్థుల సంఘము

ఆ కాలమున మద్రాసులో నెల్లూరి విద్యార్థుల సంఘము వుండేది—ఈ సంఘమునకు చేరిన విద్యార్థులును, నెల్లూరునుండి మద్రాసుకువచ్చి ఉద్యోగములలో ఉన్నవారును కలసి ప్రతిసంవత్సరము వనభోజనములు సమీపమునయుండు తిరువత్తూరు, విల్లివాకము, అమింజికరె, అడయారు మొదలగు స్థళములకుబోయి అక్కడ ఒకదినమంతయు గడిపి మరునాడు యిండ్లకు వచ్చుచుందుము. ఈ విద్యార్థులందరుగలసి సుమారు 150 మంది ఉందురు. ఈ వనభోజనమునకు విద్యార్థులందరు చందాలువేసుకొని కూడినడబ్బును నావద్ద తెచ్చియిచ్చే వారు. మిగత కావలసినడబ్బును నేనువేసి ఆ ఖర్చులన్నియు చేయుచుంటిని. బోయిన స్థళములో పిల్లకాయలు ఖిలిగుడియాటలు చీట్లాటలు ఆడి భోజనానంతరము సమీపముననుండు కొన్ని చూడదగిన స్థళములకుబోయి వచ్చుచుండిరి. చెయితిరిగిన ఆంధ్రులను వంటకు తీసుకొనిపోయి మంచి తెలుగువంటలను చేయించి పిల్లకాయలకు తృప్తిగ పెట్టుచుంటిని. ఆ విద్యార్థులలో అన్నికులములవారుండిరి, అప్పుడు ఈ సంఘమునకు గుమ్మడూరి వెంకట రంగయ్యగారు అధ్యక్షులు. వారు ఆచారవంతులగుటచే ప్రత్యేకముగ భోజనమునకు కూర్చుందు వారు. వనభోజనమునకు ఆచారము అనాచారములు వుండగూడదని నెల్లూరు కాపురస్థులగు ఏనుగు రాఘవరెడ్డిగారు పట్టుపట్టి వెంకటరంగయ్యగారి ప్రక్కననే ఆకువేసుకొని భుజించిరి. వెంకటరంగయ్యగారు చాల పెద్దమనుష్యులు గనుక వారిని మన్నించి తానును భుజించిరి. ఈకాలమున అట్టి విద్యార్థిబృందము కానరాదు. ఇప్పుడు నెల్లూరిలోయుండు చివుకుల మాలె కొండయ్యగారు, ముంగమూరి విశ్వనాధరావుగారు, సుబ్బారావుగారు, బెజవాడ రామచంద్ర రెడ్డిగారు మొదలగువారు ఆవనభోజనమున భుజించినవారె.

విద్యార్థులను జూచిన నాకు ప్రేమఅధికము. పేదవిద్యార్థులకు చాలమందికి చదువుచెప్పించితిని. విద్యార్థినులను B. A; M, A; వరకు చదివించితిని. వారందరుకూడ మంచి ఉద్యోగము లలో యున్నారు. నేను వారిని చూచినప్పుడు ఆనందించుచుందును. పరులకుచేసిన మేలును చెప్పుకొనకూడదను న్యాయము నాకు దెలిసినను ఈ సందర్భములో చెప్పవలసివచ్చింది.

ఇక మద్రాసు కథల నట్లుంచి మావూరిని తిరిగి స్మరించెదను. ఎంతైనను "జననీ జన్మ భూమిశ్చ...." అన్నారుకదా!

## మావూరు

నేను చిన్నతనమున మద్రాసుకు వచ్చినపిదప అప్పుడప్పుడు మావూరగు జనమన మెళ్ళూ రికి పోవుచుంటిని. రైలుసౌకర్యము లేనప్పుడు ఉప్పుకాలువ (Buckingham canal) లో

పడవలమీద ప్రయాణమును చేయుచుంటివి. ఆకాలమున మద్రాసులో బోటుయెక్కిన కొత్త పట్టణంరేవుకు 10, 12 దినములలో చేరుచుంటిమి. బోటుచార్జి మనిషికి ఒకరూపాయిమాత్రమే. అయితే ఈ ప్రయాణమునకు కావలసిన భోజనపదార్థములను చిరుతిండ్లను సమృద్ధిగ తీసుకొని పోవలయును. వంగవోలు ప్రాంతములనుండి వచ్చినవారు కొందరుచేరి యీపడవ ప్రయాణమును చేయుచుంటిమి. ఇందు స్త్రీలు, పురుషులు, బిడ్డలుఉందురు - పడవనడుపు సరంగులుందురు. దక్షిణపుగాలియుండిన, పడవకు చాపనెత్తిన, పడవవేగముగ పోవును. ఈ చాపను ముతకగుడ్డతో, తయారుచేయుదురు. గాలిలేనప్పుడు పడవసరంగులు గడలనువేయుచు పదములను పాటలను పాడుచు పడవను నడిపించెదరు. గడలనువేసి అలసినప్పుడు బోటుకు మోకునుగట్టి లాగుకొనిపోయెదరు. కొన్నిసమయములందు ప్రయాణీకులుగూడ పడవదిగి సరంగుతోకూడ పడవమోకును లాగుచుండెదరు - ఉప్పుగాలి సోకుటవలన ఆకలి అమితముగ నుండును. నీళ్ళవసతిగల చోటుచూచి వంటచేసుకొనుటకు పడవను నిలిపెదరు. మేము పడవను దిగి సమీపమునయుండు మంచినీళ్ళ బావివద్దకుపోయి స్నానముచేసి చెట్టుచాటుననో, గుట్టచాటుననో పొయ్యిబెట్టి పుల్లలను యేరుకొనివచ్చి అన్నమును మాత్రము వండుకొనువారము. గాలివలన మంట తప్పెలకు సరిగ తగలనందున కొన్నిసమయములలో అన్నము సరిగ పక్వముగాక ననుబాయ అగుచుండును. ఇంటినుండి పచ్చడి వగైరాలనుకూడ తెచ్చుకొనెదరు. కుట్టుడాకులు కూడ యుండును, పచ్చళ్ళు విసుగుపుట్టినప్పుడు పచ్చిపులుసును చేసుకొనెదము. ఆకాలమున నెయ్యి చౌక గనుక సమృద్ధిగ నెయ్యిని తెచ్చుకొనుచుంటిమి. సమీపమున పల్లెలుండిన మజ్జిగదొరుకును. అందరము భోజనముచేసి మిగిలిన అన్నమును రాత్రికి మూటగట్టుకొని, తప్పెలనుతోమి దానినిండుగ మంచినీటిని తీసుకొని పడవచేరుదుము- పడవలోకూర్చుని కూరుకును పట్టించెదము. పడపసాగును. చల్లబడినపిమ్మట అందరము పడవ పై భాగమున చేరుదుము. పైన గాలి చక్కగ వీచునప్పుడు ఆనందముతో పాటలు పద్యములను పాడుచుందురు. మాతోకూడ ఒక లాంతరయుండును. రాత్రికాగానే అన్నము మూటనువిప్పి ఒక భాగ్యశాలి అన్నిపచ్చళ్ళను యొకటిగకలిపి కదంబముచేసి పెద్ద అన్నపువాయను కలిపి చుట్టుకూర్చున్న, వారిచేతులలో ముద్దలనుపెట్టును. పిడచ లగుటవలన పలుమారు నీరుత్రాగవలసివచ్చును. వెన్నెలరాత్రి అయిన మరల పడవపైకిపోయి నిద్రవచ్చువరకు కబుర్లు కథలు చెప్పుకొనుచుండి పిమ్మట దిగి నిద్రించెదము. ఈ ప్రకారము పడవ ప్రయాణము ఆ దినములలో చేయుచుంటిమి. ఈ పడవ ప్రయాణములలో కలిగిన ఆనందమును, ఆకలిని, భోజనము రుచిని యిప్పుడు తలుచుకున్న నేను అప్పటివాడనేనా యని సందేహము కలుగుచున్నది.

కొత్తపట్టంరేవులో పడవదిగి వంగోలుపోయి అక్కడ మాపెత్తండ్రి యింట్లో బసచేసి మరునాడు మావూరికి వెళ్ళునప్పుడు ఒంగోలుకుండి వేడివేడి శనగపప్పును, ముంత ఖర్జూరపు పండును తీసుకొని పోవుచుందును. నా అత్తగారికి మద్రాసు మిఠాయిదినుసులు సరిపడవు. మావూరికి నేనుపోవునప్పుడు గజ్జలగుఱ్ఱపు జట్కాబండిమీద పోవుచుందును. నాబండి వూరిం సమాపించగనే తహసీలుదారుడు వచ్చుచున్నాడని గ్రామమునసబు, కరణము, ముదాకి మొదలయినవారు నడుములకు గుడ్డలనుగట్టి దండములను పెట్టుచు బండిని సమీపించుచుండిరి. తీరా నన్ను గుర్తించి "ఈయన మహాదేవయ్య అల్లు"డని దిగాలపడిపోవుచుండిరి.

ఇంటివద్ద బండిదిగగానే అత్తగారు ముందు నామూటలను సవరించును. భోజనము వేళ కాగానే దొడ్డిలోయుండు ఎండకాగునీళ్ళలో స్నానమును చేయమని చెంబును కుండవద్ద పెట్టును. స్నానముచేయుటకు ప్రత్యేకముగ యీవూరిలో స్థలముఉండదు. గనుక గోడలు లేని దొడ్డియే స్నానమునకు మరుగు స్థలము. నేను స్నానముచేయునప్పుడు ఇరుగుపొరుగు వారు నావద్దకువచ్చి మద్రాసు సమాచారములను అడిగేవారు. ఆకాలమున సోపుతో వళ్ళురుద్దు కొనుట వింత. ప్రతివారు దగ్గిరకువచ్చి సబ్బునువాసన చూచిపోయేవారు. ఈసారి వచ్చినపుడు తమకొక సబ్బుబిళ్ళను తెచ్చిపెట్టమనేవారు - మద్రాసునుంచి నేనొక చిన్న అత్తరుపెట్టెను తీసుకపోతిని. ఆపెట్టెలో ఆరువిధములైన అత్తరుబుడ్లు అత్తరు బిళ్ళలుయుండెడివి. మాకు పాలు, పెరుగు, కూరగాయలు, పచ్చిశెనగమండలు, సజ్జకంకులు వగైరాలు సప్లయిచేయు కాపువారు నావద్దకువచ్చి అత్తరువును పూయించుకొనిపోవువారు - వారందరు నన్ను "నర సయ్య" యని పిలిచేవారు.

## చెదలవాడ తిరునాళ్ల

ఈ చెదలవాడ మా వూరియేటి ఆవల వడ్డుననేయుండును. చైత్రమాసములో శ్రీరామ నవమికి శ్రీరాముల ఉత్సవము చెదలవాడలో జరుగును. ఈ ప్రాంతములకంత ఈవుత్సవము ప్రసిద్ధమగుటచే పొరుగూరినుంచి వేలకొలదిజనులు సంబరమును చూచుటకు వచ్చెదరు. ఇక్కడ వరగబియ్యముపిండితోను, బెల్లముతోను తయారుచేసిన మిఠాయి, ఏలపుండలు, రంగుమిఠాయి, వేడిగారెలు మొదలగునవి అమ్ము అంగళ్ళుండును. దూదినిమ్మకాయలను అమ్మెదురు. నులకవుండలు, పట్టెమంచములు, ముల్లుకఱ్ఱలు, ఎద్దుల మెడపట్టెలు, నవారు బిళ్ళలు, పశువుల పలుపులు, మోటతోలు మోకులు మొదలగువాటినికూడ యీ తిరునాళ్ళలో అమ్ముచుండిరి. ఇది వక విధముగ గృహపరిశ్రమల ప్రదర్శనము అనవచ్చును. ఇక్కడ అమ్ముచుండిన మల్లెపూలదండల వాసనను యిప్పటికిని నేను మరువలేను. ఇది వేశ్యలుండు స్థలము గనుక చాలదూరమునుండి పెద్దమనుష్యులు వచ్చుచుండిరి. స్వామి రథోత్సవమునాడు బ్రాహ్మణ సంతర్పణజరుగును. ఆ సంతర్పణకు యిప్పుడుకూడ నేను కొంత ద్రవ్యసహాయ మును చేయుచున్నాను.

మావూరిలో శివాలయము, విష్ణాలయము - రెండు దేవాలయములున్నవి. శివాలయము గర్భగుడిగోపురముపైన బూతుబండుచిత్రములు సొగసుగ చెక్కబడియున్నవి. ఈ చిత్రము లను చూచుటకు పెద్దలు చిన్నలుకూడ చేరి చూచి సంతోషించుచుందురు. ఈ దేవాలయపు అర్చకుడు తంబళాయన. కుష్ఠురోగి. వైద్యమునుచేయును. విష్ణాలయము అర్చకుడు నంబి ఆయన. వీరికొడుకు పైచూపు పిచ్చివాడు - ఈ నంబి అర్చకుడుగూడ వైద్యుడే. ఈ వూరిలో యీ అర్చకు లిరువురు వైద్యమును చేయుచునుండెడివారు. సాధారణముగ పల్లెటూర్లలో నంబితంబళులే గ్రామవైద్యులు. ఈ విష్ణాలయ ముఖద్వారమునకు పెద్దతలుపులను నేను చేయించియిచ్చితిని. ఈ దేవుళ్ళు పార్వేటకు (శమీపూజకు వెళ్ళునప్పుడు స్వాములవెంట వూరిరంగిరీజులు వార్ల యిండ్లలో పురాతనముగయుండు కత్తులు, బాకులు, ఈటెలు మొద లగు) పురాతన యుద్ధసాధనములతో వెంటవచ్చెదరు. ఈపాత ఆయుధములు వీరికి యెట్లు లభించినవో? విజయదశమినాడు ఆయుధములకు మెరుగుబెట్టి పూజించి నమస్కరించెదరు- ఈ వూరి గుండ్లకమ్మయేరు వూరిని క్రమముగ మ్రింగుచున్నది. దేవాలయములనుకూడ కబళించుటకు ఏరు సమీపించుచున్నది.

—సశేషము.

# అనువాద సాహిత్యం

పారిస్ పట్టణంబయట ఉన్న బ్రహ్మాండమైన ఫాంటెన్‌బ్లూ మహాభవనంలో ఒక గ్లాసుకేసులో, బుటేదారీ చేసిన సిల్కుదిండు మీద నెపోలియను టోపీఉంది. ఎల్బానుంచి తిరిగివచ్చి, సమకూడిన తన సైన్యాలను వాటర్లూ యుద్ధభూమికి తీసుకొనిపోతూన్న సమయంలో నెపోలియను ధరించినది ఈ టోపీయే. ఇదంతాజరిగి నూరేళ్ళు దాటిందనుకోండి.

ఈటోపీగల గ్లాసుకేసు ముందు ఇద్దరు పల్లెటూరి నూతన దంపతులు నిలబడ్డారు. గులాబీ రేకుల బుగ్గలు కలిగిన ఆపడుచు ఒక రైతు కుమార్తె. అతను దక్షిణ ప్రాంతానికి చెందిన ఒక యువకరైతు. ఇద్దరికీ కొత్తగా పెళ్ళి అయింది.

ఇద్దరూ గ్లాసుకేసు ముందు నిలబడ్డారు. ఆమె తన దుస్తులు తడువుకుంది. అతను అనల్లని టోపీకేసి చూశాడు. వాళ్ళ ఎర్రని ముఖాలూ, ఎర్రని చేతులూ అద్దంలో అస్పష్టంగా ప్రతిఫలిస్తున్నాయి. పెళ్ళి సమయాన పురోహితుడి ముందు నిలబడ్డప్పుడు ఊగినట్టుగానే వారి శరీరాలు ఇప్పుడూ ఊగుతున్నాయి.

"ప్రపంచంలోకల్లా గొప్పవాడు," అన్నదామె.

"అవును, చాలా గొప్పవాడు. దాదాపు ప్రపంచమంతా ఏలాడు," అన్నాడతను.

"పాపం!"

"చక్రవర్తిపని కష్టం. నన్నుచెయ్యమంటే చెయ్యను. ఎన్నోకాగితాలూ, దస్తావేజులూ చదవాలి. గాలివాన వచ్చిన సంవత్సరంమనం పాట్లు పడ్డామే అట్లాఉంటుంది. చక్రవర్తి కావటమంటేనేఏమిటో ఎబ్బెట్టుగాఉండదూ?"


"ఉండదూమరీ? శానాకష్టం. కాని నువ్వయితే ఏదైనా చెయ్యగలవు, ఎమిల్. వావల్లో పుగా కోళ్ళపాకా పూర్తిచేస్తావని ఎవరన్నా అనుకున్నారా? ఒకచెంప సారాయి పీపాలు కారుతూ, కూరలమళ్ళు పురుగుపట్టి పుచ్చిపోతూ నానా యిబ్బందులుగా ఉంటే! కాకపోయినా చక్రవర్తి అన్ని కాగితాలూ చదువుతాడా ఏం? వాటిల్లో ఏముందో చెప్పేవాళ్ళుంటారు. సంతకం పెట్టెయ్యటమే. అమాత్రం నీకుమటుకు చాతకాదా ఏం?"

"ఎందుకాకూడదూ?"

"అయితే నాకే చాలాకష్టం, ఎమిల్, ఇటువంటి ఇల్లు ఉండటానికి బావుంటుంది కాని, పొద్దస్తమానం నౌకర్లు చుట్టూతా ఉంటారు. కొత్తవాళ్ళు చూస్తూ ఉంటే నాకేదోగా ఉంటుంది. మరి నువు చక్రవర్తివయితే నేను చచ్చినట్టు భరించవలిసిందే గద."

## నెపోలియను టోపీ

(మ్యానూల్ కామ్రూఫ్)



"నన్ను గుర్తుపట్టలేదండీ? మొన్న వచ్చి పాతశాస్త్రం అమ్మిపోయింది నేనే. ఇవ్వాళ అజీర్ణమాత్రలు తెచ్చాను."

"ఏం ఖరీంచాలి, మేరీ ?"

"ఏమిటంటావేం? అంతా చూసుకోవద్దూ? దొంగ వెధవలు వంటిల్లు కొల్లగొడితే! గొప్ప గొప్ప ఆడవాళ్ళు చేసేపనులన్నీ - పక్కలు వెయ్యటమూ, ఎప్పుడూ కొత్త గౌనులు కుట్టుతూ ఉండటమూ - ఇవన్నీ చెయ్యాలా, వద్దా ?"

"ఎబ్బే. అంత కష్టమైన పని ఎవరు చేస్తారు. నేమచక్రవర్తి ఉద్యోగానికిఒప్పను"

"కావాలంటేనువు ఏంచెయ్యలేవు మహా? ఎంత బలంగల వాడివి! నువ్వంటే నాకెంత ఇష్టం!"

ఆఖరుకు వాళ్ళిద్దరూ నెపోలియను టోపీ ఉన్న గ్లాసుకేసు ముందునుంచి కదిలి అట్లా తోటల్లోకి వెళ్ళారు. అక్కడవాళ్ళు తెచ్చుకున్న ఫలహారాలు తిని ఒకళ్ళ కళ్ళలోకి ఒకళ్ళు చూసుకున్నారు.

"గేట్లు మూసేసేలోపుగా మనం మళ్ళీ ఒక్కసారి వెళ్ళి ఆటోపీ చూద్దాం. ఏం. ఎమిల్ ?" అన్నదామె.

"పాపం. నెపోలియన్ !" అన్నాడు ఎమిల్.

"అవును ప్రపంచానికంతా. దాదాపు. చక్రవర్తి. ఏముంది ? చచ్చిపోయినాడు."

మళ్ళీ వెనక్కు తిరిగివచ్చి ఇంకోసారి టోపీకేసి చూశారు. మర్నా డుదయం స్టేషనుకు పోతూ, అటుగావెళ్ళి మళ్ళీ ఇంకోసారి నెపోలియను టోపీ చూసుకున్నారు.

రైల్లో ఆమె నిట్టూర్చి. "మన పెళ్ళి పండగ ఎంత హాయిగా గడిచింది! ఏం. ఎమిల్?" అన్నది.

"అవును."

ఆమె అతని చెవిలో రహస్యంగా. "నువ్వంటే నాకెంత ఇష్టం, ఎమిల్!" అన్నది.

అతను ఆమె చెయ్యి తీసుకుని నిటారుగా కూచుని, "నీకు నెపోలియనంటే యిష్టమనుకున్నానే." అన్నాడు.

"అవును. కాని అది వేరు."

"ఎందుకు వేరూ?"

"ఎందుకంటే. పాపం! చచ్చిపోయినాడాయెను. జాలిగా ఉండదూ? అంత గొప్పవాడు! చక్రవర్తి కావటం అంత కష్టమాయెను! నువ్వన్నమాటేగా ?"

"అన్నాను మేరీ. నామాట చెప్పాను. నెపోలియను మాటకాదు. అతనికేం? ఎప్పుడూ ఏదో గొప్పపని చేస్తూ ఉండేవాడు గనక, అతను సైన్యాధికారికూడా అయెను. సైన్యాధికారి చెయ్యలేని పనులుంటాయా ?"

"అతను చాలా ధైర్యవంతుడు గనక..."

"అందుకనే నీ కతనంటే ఆపేక్ష."

"నువ్వన్నా ఆపేక్షే, ఎమిల్, నువుకూడా గొప్పవాడివై, నీ టోపీ కూడా....కాని చక్ర వర్తి మాత్రం వొద్దు."

ఎమిల్‌కు నెపోలియను మీద అసూయగా ఉంది. అతను రైలు కిటికీలోనుంచి బయట పరిగెత్తే పొలాలూ, చెట్లూ చూస్తున్నాడు.

సాయంకాలాని కల్లా ఇల్లు చేరుకున్నారు. పొదలమీదినుంచీ, తడిమట్టిలోనుంచీ కమ్మని వాసనలు వస్తున్నాయి. వాళ్ళు పెళ్ళిపండగ మీద వెళ్ళిన కాలంలో అక్కడక్కడా గడ్డి దుబ్బులు పెరిగాయి. మరి పంట కోతకి సిద్ధంగా ఉంది. వాళ్ళిద్దరూ దుస్తులు మార్చు కుని వదులు దుస్తులూ కొయ్య చెప్పులూ ధరించి పనికి దిగారు. ఇంకా ఒకటి రెండు గంటల వెలుతురున్నది మరి.

ఆ రాత్రి పక్కలో ఆమె అతని చెవిలో రహస్యంగా "మళ్ళీ చక్కగా మనమూ మన యిల్లూ!" అన్నది.

అతను ఆమె చెయ్యి నొక్కాడు.

"ఎంతన్నా చెప్పు. ఆ అంతఃపురాల్లో మనం ఉండలేం," అన్నది.

అతను మళ్ళీ చెయ్యి నొక్కాడు.

"ఏమీ బాగుండదు," అన్నది.

"చచ్చిపోయిన ఆ చక్రవర్తి టోపీ విష యమే ఆలోచిస్తున్నావు." అంటూ అతను ఆమె చెయ్యి వొదిలాడు.


"లేదు, ఎమిల్. ఏదో పిచ్చి ఆలోచనలు చేస్తున్నాను. నువ్వంటే నాకెంత యిష్టం!"

ఆమె అతని మెడచుట్టూ చేతులు పెన వేసింది. అతను ఆమె. కళ్ళూ, బుగ్గలూ, నోరూ ముద్దాడాడు.

ఇక మళ్ళీ ఆ ఇద్దరి మధ్యా నెపోలియను ప్రశంస రాలేదు. కాని ఒక సంవత్సరం గడిచి మేరీ కడుపున ఒక మగ నలుసు పుట్టినాక, "పిల్లా డెంత బొద్దుగా ఉన్నాడో!" అన్నాడు తండ్రి. తల్లి పిల్లవాడి గడ్డంకింద కితకితలు పెడుతూ, "మన అబ్బాయిని గాజు పెట్టెలో పెట్టి అందరికీ చూపిద్దాం!" అని మటుకు అన్నది.

అప్పుడా యిద్దరూ కూర్చుని వాళ్ళకు తెలి సిన అందరు రాజులపేర్లూ, చక్రవర్తుల పేర్లూ జ్ఞాపకం తెచ్చుకున్నారు. అన్నిపేర్లూ విపరీతంగానూ జాలి గొలిపేలాగానూ ధ్వనిం చాయి.

ద్రాక్ష పంటకొచ్చింది. చచ్చేటంతపని చెయ్యవలసి ఉంది. అయినా వీలుదొరికినప్పు డల్లా వాళ్ళు నెపొలియనుటోపీ గురించి ఆలో చించి చర్చించకపోలేదు. కాని చివరకువారు పిల్లవాడికి "జాన్" అని పేరు పెట్టుకున్నారు.



12/47




# మెత్తని చెప్పులు

ఇప్పుడంటే జాతి ఇట్లా నీరసించిపోయింది గాని వెనకటివాళ్ళు పూటకి శేరుబియ్యమూ అర్ధశేరు పప్పూ తిని హరాయించుకునేవాళ్లు గనక వాళ్ళేపని చేసినా చూడ ముచ్చటగా ఉండేది. మచ్చుకి విమర్శన తీసుకోండి. కందుకూరి వీరేశలింగం కొక్కొండ వెంకట రత్నంమీద ఒక తడాఖాతీసినా, గిడుగు రామ్మూర్తి జయంతి రామయ్యను ఒక ఊపు ఊపినా, వెంకటకవి కృష్ణమూర్తిశాస్త్రిని ఒక పట్టుపట్టినా అందులో ఇంతసత్తా ఉండేది. వాళ్ళ విమర్శకు పూనుకుంటే మిత్రరాజ్యాల ఇన్వేషన్‌లాగా, ధర్మరాజాదులు చేసిన అశ్వమేధంలాగా అట్టహాసంగా ఉండేది. ఒకరి నొకరు శపించుకునేవారు, ఒకరికొకరు అద్దికాలు పెట్టేసేవారు. వాళ్ళగొంతులు బలంగా, పొలంమీది కేకలల్లే వినిపించేవి.

కాలక్రమాన ఇదంతా మారిపోయింది. 1702 మల్లుయుగం వచ్చింది. దానితరవాత, కవచంలా కనిపించినా పురిలేని ఖద్దరు వచ్చింది. దానివెంటనే తియ్యనిబాధలూ వాటినిచూసి ఆత్రంగా మధుకీలలూవచ్చాయి. రెండవున్నర రోడ్డుదుమ్మూ వగైరాలుగల ఎనిమిదవున్నర రేషనుకూడా వచ్చేసింది. గాఢమైన కోర్కెలతోపాటు ఘాటైన విమర్శలుకూడా వెనకపడ్డాయి.

వెనకటివాళ్ళు అన్నివిధాలా శక్తిమంతులూ, ఒడ్డుపొడుగులు గలవారూ అని ఒప్పుకున్నప్పటికీ వాళ్ళ విమర్శనాపద్ధతులలో నాగరికతలేదని ఇప్పటి మన అభిప్రాయం. వెనకటివాళ్ళు విమర్శల పేరుపెట్టి వ్యక్తి నిందలకు దిగేవాళ్ళని మన అభిప్రాయం. మనం చాలా నాగరికులమై నాజూకు తేలాం కనక అటువంటిపనులు చెయ్యమనికూడా మన అభిప్రాయం.

ఈ గడిచిన రెండుమూడు తరాలకాలంలో విమర్శనలో జరిగిన పరిణామం ఇంకా చాలాఉంది. పత్రికలు బలిసినాక లాంఛన విమర్శలు జాస్తి అయినాయి. "చాలనీ", "పుస్తకపరిచయం", "కొత్తపుస్తకాలు", "చదవండి" లాటి శీర్షికలకింద విమర్శించ బడగలందులకు తండోపతండాలుగా పుస్తకాలు వస్తాయి. వీటన్నిటినీ గురించీ రెండేసి ముక్కలు రాయాలి. ఈ రెండు ముక్కల భాగ్యానికి పుస్తకం ఎవడు చదువుతాడు? వచ్చినపుస్తకాన్ని చేతిలోపట్టుకుని పైకీ కిందికీ రెండుసార్లు ఊపి తూకం అంచనా కట్టటమూ, పుస్తకం పగలదీసి ఒక్కసారి వాసనచూడటమూ కలంపట్టి విమర్శన గీకెయ్యటమూ పరిపాటి అయింది.

12/47

పుస్తకం బాగుందంటే అడిగేవాడుండడు. బాగా లేదంటే ఇబ్బంది కలగొచ్చు.

ఇంకోవిషయమేమిటంటే వెనకటివారి విమర్శలకి కొన్ని ప్రమాణాలుండేవి. ఈనాడటువంటివిలేవు. ఎవడిప్రమాణం వాడిదీ. అటువంటప్పుడు విమర్శించేవాడు తన ప్రమాణాలమీద మరొకడు విరుచుకుపడకుండా భూనుకోవాలి; వాటినిగురించి పరాయివాడికి అంతు చిక్కకుండా, మతవిద్వేషకుల చర్యల్లాగా, రహస్యంగా ఉంచుకోవాలి.

దీనికితగ్గట్టే ఇంకోమార్పుకూడా కలిగింది. కవులకు కవులప్రాపకమూ, కథకులకు కథకులప్రాపకమూ, అయిపోయింది. పుస్తకాలు రాసేవాళ్ళకీ విమర్శలు చేసేవాళ్ళకీ మధ్య లావాదేవీలు జాస్తి అయ్యాయి. అటువంటి లావాదేవీలు ఈక్షణాన లేకపోయినా రేపు ఏర్పడవచ్చు. విమర్శనలు వ్యక్తులను గౌరవించటానికి సాధనాలయి కూర్చున్నాయి.

ఇదంతాచూసి బుద్ధిమంతుడెవడైనా విమర్శనలో అభ్యుదయం కలిగిందనుకుంటాడా? ఒక్కనాటికి అనుకోడు.

వెనకటివాళ్ళు వ్యక్తిగౌరవాలు గుర్తించనివాళ్ళుకారు. వాళ్ళు మనలాగా ఇష్టంలేనివాళ్ళని పట్టుకుని వాళ్ళమీద హేయంగా పద్యాలూ, నాటకాలూ రాయలేదు. విమర్శిస్తున్నామనే మిషకూడా వ్యక్తులను అతి నీచంగా నిందించగల మనం వెనకటివాళ్ళకన్న నాగరికత పెంచుకున్నామని ఎందుకు గర్విస్తున్నామో నాకు తెలియదు.

విమర్శించటం దగ్గిరికివస్తే వ్యక్తుల్ని వెనకటివాళ్ళు లక్ష్యపెట్టేవాళ్ళుకారు. విమర్శించటమంటే అందులో తప్పులుచూపటంకూడా ఉంటుంది. తప్పు లెవరుచేసినా తప్పులే, ఖండించతగ్గవే. తప్పుల విమర్శించటమూ, వ్యక్తులను నిందించటమూ ఒకటికాదు. ఒకవేళ తప్పుల విమర్శించవలిసివచ్చినప్పుడు వ్యక్తిని గౌరవించటం సాధ్యంకాకపోతే వెనకటివాళ్ళు వ్యక్తిని లక్ష్యపెట్టలేదు. ఇప్పుడట్లాకాదు. మనం దేన్నయినా విమర్శించవలిసివస్తే దానివెనకఉన్న వ్యక్తి ఎంత జీతంగలవాడో, ఆయనగారి హోదా ఏమిటో, ఆయనచేస్తున్న ఉద్యోగాలూ, చెయ్యబోయే ఉద్యోగాలూ ఏమిటో చూసుకుని మరీ కలం పట్టాలి! ఒకవేళ సంస్థలని విమర్శించవలిసివచ్చినా ఆసంస్థల నంటిపెట్టుకున్న వ్యక్తులెవరో వారివల్ల మనకు కలగగల లాభనష్టాలేవో అంచనాకట్టి మరీ విమర్శించాలి!

ఇటువంటి పరిస్థితులలో "మెత్తనిచెప్పుల" భాషను అమలులోకివచ్చింది. "ఫలానివాళ్ళని తిడుతూరాస్తే వేసుకుంటారా?" అని పత్రికలచుట్టూ తిరిగి వాళ్ళసహితం విమర్శనదగ్గిరికి వచ్చేసరికి "మెత్తనిచెప్పుల" సిద్ధాంతాలను బలపరుస్తున్నారు. విమర్శకు గురిఅయే వాళ్ళుకూడా, తాము చేసేపనికీ తమకూ అవినాభావసంబంధం ఆపాదించుకుని "మెత్తనిచెప్పుల" పద్ధతిని ప్రచారం చేస్తున్నారు.

ఇదీ విమర్శలోకలిగిన అభ్యుదయం!





# రాధమ్మకూతురు
[నవలిక]

భగవంతుడు ఆడవాళ్ళ నెందుకు పుట్టిస్తాడు? కష్టాలుపడి కిందటి జన్మలో చేసుకున్న పాపం పరిహారం చేసుకోవటానికి. భగవంతుడే లేడనే వాళ్ళకి ఏం చెబుతాంగాని, ఈ పంచభూతాత్మకమైన ప్రపంచంలో గలిగి ఉన్నటువంటి చరాచరసృష్టి అంతటిలోనూ కొందరు ఆడవాళ్లుగా ఎందుకు పుట్టాలి? ఎందుకు కష్టపడి పిల్లల్ని కనాలి? వాళ్లకి దేవుడు వేదాలుచదివే హక్కూ, ఆస్తి పంచుకునే హక్కూ, ఇల్లుదాటి బయటికి వెళ్ళే హక్కూ లేకుండా ఎందుకు చేశాడూ? వాళ్ళు బలహీనంగా ఉంటారేం? అనారోగ్యంగా ఉంటారేం? చిన్నతనంలో తండ్రి కాలిక్రిందా, తరవాత మొగుడికాలిక్రిందా, ఆ తరవాత కొడుకు కాలిక్రిందా ఉండమని భగవంతుడు ఆడదాన్ని ఎందుకు శాసించాలి? పూర్వజన్మకృత పాప పరిహారార్ధమేనని స్పష్టంగా కనిపించటంలేదూ?

నేను రాధమ్మ మొగుణ్ణి. పేరుకు నేను రెండోపెళ్ళి వాణ్ణిగాని పెళ్ళినాటికి నాకు నలభైఏళ్ళే. మానాన్న మొదటి పెళ్ళికే మా అమ్మకంటె పాతికఏళ్ళు పెద్దవాడు. ఇప్పుడిప్పుడు వరహీనంగా పెళ్లిళ్ల చేస్తున్నారుగాని మా తాతల ముత్తాతల కాలంలో ఎప్పుడైనా ఇటువంటి పెళ్ళిళ్ళున్నాయా?

స్వతహాగా నా పెళ్ళాం చెడుబుద్ధి కలదనుకోను. కాపరానికి వచ్చినాక నాలుగైదేళ్ళు ఎంతో అణకువగా, నోట్లో నాలుక ఉందా అనిపించేటట్టుగా ఉంటూ వచ్చింది. నలుగురు కల యిల్లు గనక మాయింటి చాకిరీ, జాస్తిగా ఉండేది. చిన్నపిల్ల గనక కోప్పడీ కసిరీ పనులు చేయించేవాళ్ళు. అదంతా ఎంత బాగానో ఓర్చుకున్నది.

ఎందుకు ఓర్చుకోదూ? ఫలానావారి కోడలు, ఫలానివాడి భార్య అనిపించుకునే సరికి దానికి కాస్త ప్రతిష్ఠరాలా? లేకపోతే దాని తండ్రి ఎవరూ? వాళ్ళకున్న ఆస్తి ఏమిటి? దాని తండ్రేమో చిన్ననాడే పోయినాడనుకోండి. బతికున్నప్పు డాయన వెలగబెట్టిందేమిటి? కాలవలమీద గుమాస్తా. పది రూపాయల జీతం! దాని పినతండ్రి ఈనాటికి నీళ్ళకావళ్ళు మోస్తున్నాడుగదా! దాని ఇంకో పినతండ్రి అక్షయపాత్రతో పొట్ట పోసుకుంటున్నాడు గదా! దాని పెత్తండ్రి వంట బ్రాహ్మడు గదా! నన్ను పెళ్ళాడటం దాని కెంత గొప్ప!

దాని కీదుర్బుద్ధి ఎవరు పెట్టినట్టు? ఏమో. ఎవరైనా పెట్టి ఉండవచ్చు. ఆడదాని బుద్ధి కోతిలాటిది. "అహా! ఎంత అందగత్తెవు!"

కె. కుటుంబరావు

అవి ఎవడన్నా అనగానే మతి చలిస్తుంది. వివేకి అయిన భర్త భార్య మనస్సు చలించకుండా పెట్టుకురావాలి. నే నెప్పుడూ దాని అందంగురించి మాట్లాడలేదు. అసలు అందమనేది ఏమిటి? అది చూసేవాడి కళ్ళలోనే ఉంటుంది. ఆడదాని అందం క్షణభంగురం. ఇద్దరు పిల్లలు పుట్టేసరికి ముసలి దవుతుంది.

దాని కడుపున రెండు కాయలుకాస్తే బాగుండునని అందరమూ అనుకున్నాం. కాని భగవంతు డివ్వాలి కద! తీరా గర్భిణిగా ఉన్నదని తెలిసినాక అందరమూ ఎంతో సంతోషించాం. కాలక్రమాన ప్రసవం అయింది. మగపిల్లవాడు కాదనే చింత ఉన్నప్పటికీ పిల్ల చక్కని చుక్క. చాలాభాగం తల్లి పోలికే అయినా మా అమ్మ కవళికలూ కొద్దిగా మామాతామహుంది కవళికలూ ఉన్నాయనుకున్నాం. ఎవరైనా పిల్లలు కన్నాక సంసారంలో కుదటపడతారు. ఇది ఏడాది నిండని పిల్లతో లేచిపోయిందేమిటో నా కర్థంకాదు.

కట్టనివాళ్ళు ఏమేమో అనుకుంటారుగాని, అది కామ సంతృప్తికోసం లేచిపోయి ఉండదు. దాని కవలు, పాపం, ఆ ప్రసక్తే తక్కువ. శారీరకమైన వాంఛలే దానికి లేవు. తిండికనిగాని, బట్టకనిగాని, నగలకనిగాని ఏమీ ఆరాట పడేదికాదు.

అదెట్లా చస్తే ఎవడికి కావాలిగాని ఆపిల్ల దానిదగ్గిర ఉండిపోవటం చాలా అన్యాయమయింది. పిల్లకోసం మనుషులను పంపాను. వాళ్ళు దానితో మాట్లాడివచ్చి పిల్లకోసం ప్రయత్నం చెయ్యవద్దని సలహా ఇచ్చారు.

ఇల్లుదాటిన తరవాత దాని మొహం నేను చూడనేలేదు—నాకేంపనీ?—కాని చూసిన వాళ్ళు, మనిషి పచ్చిళోగందిలా తయారయిందని చెబుతూవచ్చారు. ఎవరి ఖర్మాని కెవరు కర్తలు? చేసుకున్నవారికి చేసుకున్నంత, మహాదేవా!

దాన్ని ఉంచుకున్నవాడి కెంత డబ్బుంది. నన్నడిగితే ఆది ఆడబ్బు చూసే గోతిలో పడిందంటాను. అదే దాన్ని ఈనాటికి రక్షిస్తున్నది. డబ్బు ఎందుకు పనికొస్తుంది? రేపు యమధర్మరాజుకు లంచంపెడుతుందా! డబ్బు లేకుంటా ఎంతమంది నీతిగా బతకటం లేదు?

రేపు పిల్ల పెద్దదై పెళ్ళీడు వచ్చినాక దాని గతి ఏమవుతుంది? దాన్నెవరు పెళ్ళాడతారు? నా గర్భవాసాన పుట్టిన కూతురు పతితురాలై పోతే నాకు ముందు ముందు తిలోదకాలైనా ముట్టుతాయా? శాస్త్రుల్లవారిని అడిగి రావాలి.

౨

నాపేరు సీతారామశర్మ. మాఇంటి ఆవరణలోనే ఒకపాకా ఉండేది. అందులో రాధ తల్లి దండ్రులు నా చిన్నతనంనుంచీ ఉంటున్నారు. నా పెళ్ళికి రాధ ఏడాదిపిల్ల. చిన్నతనంనుంచీ కూడా రాధ చాలా అందమైన పిల్ల. సామాన్యంగా పసిపిల్లల్లో ఆరోగ్యమే అందం. వేరే అందాలు పాటింపుకురావు. అయినా రాధ అసాధారణమైన అందగత్తెగా భావించబడేది. మాయింటో,ఆడపిల్లల కరువు. అందుచేత రాధను మాయింటోనే జాస్తిగా ఉంచుకునేవాళ్ళం. మా వాళ్ళంతా కలిసి తీయించుకున్న ఫొటోల్లో రెండు మూడింట్లో రాధకూడా కూర్చుంది. ఆ రోజుల్లో మా వూళ్ళో ఫొటోగ్రాఫర్లు లేరు. ఎప్పుడో ఒకసారి ఒక అరవ ఫొటోగ్రావరు, వచ్చాడు. కాస్త కలవాళ్ళం గనక మానాన్నగార్ని ఆశ్రయించి అయిదారు ఫొటోలు తీసి, ఒక్కొక్క దానికీ మూడేసి కాపీలు ఇచ్చి యాభైరూపాయలు పట్టుకుపోయినాడు. అవిధంగా రాధ చిన్నపాటి ఫొటోలు రెండుమూడు దక్కినై.

రాధ పెళ్ళికి నేను లేను. అప్పటికి రెండేళ్ళనుంచీ నేను దూరగ్రామాల్లో నౌకరీ చేస్తున్నాను. రాధను ముసలాడి కిస్తున్నారని తెలిసినప్పుడు నా భార్య ఐనా అదుర్దాపడింది గాని నేను జాస్తిగా విచారించినట్టు జ్ఞాపకం లేదు. నెలరోజుల శలవుమీద ఇంటికి తిరిగి వచ్చినప్పుడు మా అమ్మా వాళ్ళూ ఇంటో మాట్లాడుకునే మాటలను బట్టి వాళ్ళింకా రాధను మా ఇంటో పిల్లగానే భావిస్తున్నారనీ, నా ఒక్కడికే రాధ దూరమైపోయిందనీ తెలుసుకున్నాను. మన మనస్సులు విచిత్రంగా ఉంటాయి; ఇప్పుడుకూడా నేను, రాధకు ముసలాడు మొగుడైనాడే అని విచారించలేదు కాని విచారించ లేకపోయినందుకు పశ్చాత్తాప పడసాగాను.

ఇంతలో ఏదో పండగవచ్చి రాధ పుట్టింటికి వచ్చేసింది. రాధను చూస్తే నాకు ఆశ్చర్యంవేసింది. ఎందుకో నేను రాధని వెనకటి చిన్నపిల్లగానే భావిస్తూవచ్చాను. కాని ఈరాధ నే నెరిగినమనిషి కాదు. ఆడతనం పక్వానికివచ్చిన స్త్రీ. అందగత్తె. ఏ మగవాడైనా కామించదగినది. ఇటువంటి ఆడదాని కోసం కవిత్వాలు రాయాలి. సంఘాన్ని ఎదిరించాలి, అవసరమైతే కులం చెడాలి, అష్టకష్టాలూ పడాలి.

ఈ ఆలోచనతోపాటు నాకింకో ఆలోచన కూడా కలిగింది. నాకూ రాధకూ మధ్యఉన్న అంతరాయాలేమిటి? దిక్కులేని దరిద్రుల పిల్ల, ముసలివాడి పెళ్ళాం. మాకు రుణపడి ఉన్నది. ఒక్క ముక్కలో, చెయ్యి చాస్తే అందే మామిడి పండు. మగవాడి ఆశ రేకెత్తించటానికి ఆడదానిలో ఉండే ఆకర్షణలన్నిటిలోకీ ప్రబలమైనది ఏదంటే ఆమె సులభంగా దొరుకుతుందనే నమ్మకం. రాధ నా పిలుపుకోసమే పరీక్షిస్తున్నదని నన్ను నేను నమ్మించుకున్నాను. రాధ ఒంటరిగా దొరకటమే తరవాయి! దొరికింది.

అది అమాయకత్వమో, మందబుద్ధో తెలియదుగాని రాధ నా ప్రయత్నంచూసి ఆశ్చర్యపోయినట్లు కనిపించింది. నన్ను గురించి ఆమె ఎప్పుడూ ఆలోచించినట్టే కనబడలేదు. తరవాత నా కర్థమయింది— ఆమెలో స్త్రీత్వం వికసించనేలేదు. ఆమె మనస్సులో సహజకామం ఏదైనా ఉంటే అదంతా ఆ భర్త సంపర్కంతో అణగారిపోయి ఉండాలి. రాధను నిద్ర మేల్కొలపాలని తీర్మానించుకున్నాను. జయించాను. చెయ్యి చాస్తే చేతుల్లోకి ఉరుకుతుందనుకున్న మనిషిని ప్రణయోన్ముఖురాలిని చెయ్యటానికి నాలో ఉన్న శృంగారశక్తి యావత్తూ వినియోగించవలసి వచ్చింది. అదివరకు కొంతమంది ఆడవాళ్ళను చూసిన నాకు రాధతో మొట్టమొదటి ప్రేమసంబంధం కలిగింది.

ఇంకొక చిత్ర మేమిటంటే రాధ తన నోటిమీదిగా ఎన్నడూ తన భర్తకు జరుగుతున్న అన్యాయం గురించిగాని, నా భార్యకు జరిగే అన్యాయంగురించి గాని ఎత్తలేదు. ఎందుకెత్తాలి? తన భర్త ఎన్నడూ కోరని హృదయాన్ని నా కిచ్చేస్తున్నది. అంతేకాక నేను నాభార్య సొత్తని కాని, నాభార్య దగ్గిర్నుంచి తస్కరించి నన్ను తన సొత్తు చేసుకుంటున్నానని కాని రాధ ఎన్నడూ అనుకోలేదు. ఈ మాట ఎందుకు చెప్పానంటే, రాధ నా సొత్తనే భ్రమ నాకు కలిగింది. నా భార్యకు అన్యాయం చేస్తున్నాననే ఆలోచన నాకు తట్టింది. రాధ తిరిగి అత్తవారింటికి వెళ్ళిపోతే నాగతేమవుతుందనే బాధ నన్ను వేధించింది. ఇటువంటి సమస్య లేవీ రాధకు రాలేదు.

రేపు వెళ్ళిపోతుందనగా రాధ నడిగాను, "నిన్ను విడిచి ఎట్లా ఉంటాను? ఇదంతా ఎట్లా మరిచిపోవటం?" అని.

"ఎందుకు మరిచిపోవటం?" అన్నది రాధ.



"మరచిపోవటం మరింత బాధ కాదా?" అన్నాను.

"జ్ఞాపకం ఉంచుకోవటం ఆనందం కాదా?" అన్నది.

"ఎల్లకాలమూ ఇట్లాగే ఉండాలని లేదా?" అన్నాను.

"ఎట్లా ఉంటుంది? నేను మొగుణ్ణి వొదిలెయ్యనా? మీరు మీ సుగంధిగారిని వదిలేస్తారా?" అన్నది.

నాకు కోపంవచ్చింది. నేనెంత నేర్పినా రాధకి ప్రేమంటే ఏమిటో తెలియలేదనుకున్నాను. కాని, ఆ క్షణాన రాధ నాకోసం మొగుణ్ణి సులభంగా వొదిలేసేదిగాని నా భార్యను నేను వదలగలిగేవాణ్ణి కాను. అందుచేత న్యాయంగా చెప్పుకుంటే నాకు కష్టం వేసిందల్లా ఎందుకంటే నన్ను విడిచిపెట్టి మొగుడిదగ్గిరికి వెళ్ళటానికి రాధ ఏడిచి రాగాలు పెట్టలేదని. రాగాలు పెట్టింది కాని నేను చూసేటట్టు పెట్టలేదు. ఆ సంగతి అప్పుడు నాకు తెలియదు.

ఇది జరిగిన సంవత్సరమున్నరకు నా భార్య టైఫాయిడు జ్వరంతో పోయింది. నా భార్య పోవటంతో నాలో పెద్ద పరివర్తన కలిగింది. అంతదాకా ఆడవాళ్ళకోసం పేటూ

డటం ఒక వినోదంగా ఉండేది. అటువంటిది నాకిప్పుడు కామం చాలా వికారంగా కనబడింది. నేను రోజూ అనుభవించిన ఒక ఆడదాని శరీరం నాఎదుటే కట్టెల్లో మసి కావటం చూసి ఏమి దక్కిందా అని ఆలోచించుకుంటే నాభార్య అన్న మాటలూ, నన్ను గురించి పడ్డ ఆదుర్దాలూ, నాకోసం చేసిన చాకిరీ, నా ఎడల చూపించిన ఓర్పూ, నా మనస్సు వికలంగా ఉన్నప్పుడు ఇచ్చిన అనునయమూ మిగిలినై. ప్రపంచంలో ఉన్న ఆడవాళ్ళందరికన్నా నామీద నాభార్యే అధికంగా ప్రేమచూపింది కాని నేను అర్థం చేసుకోలేక పోయినాను. ఎందుకంటే నాభార్య ప్రేమగురించి మాట్లాడలేదు. ఇప్పుడు నా భార్యతో పోల్చుకుంటే నే నెరిగిన ఇతర ఆడవాళ్ళంతా ఎంతోదూరాన కనిపించారు. రాధ కూడా. రాధ నానుంచి తను అదివరకు ఎరగని సుఖం పుచ్చుకున్నది. దాని తాలూకు ఫోటోలు తనమనస్సులో పెట్టుకుని వెళ్ళిపోయింది. ఒకపిల్ల తల్లి అయి ఆనరక కూపంలో ఈదుతున్నది. రాధ నాదగ్గిరికివచ్చి నా భార్య స్థానం ఆక్రమించుకుంటుందా? ఆక్రమించుకోగలదా? నాకు నమ్మకం లేకపోయింది.

ఏ కారణం చేతనో రాధ గురించి నే నెప్పుడూ పొరపాటు పడుతూనే వచ్చాను. నాభార్య నాకర్థమయినంత సులభంగా రాధ ఎన్నడూ అర్థం కాలేదనుకుంటాను. రాధ పిల్లతోగూడా తండ్రిగారింటికి వచ్చింది. నన్ను చూసింది, పరామర్శ చేసింది. పూర్వపు విషయాలేమీ ఎత్తలేదు. ఆపిల్లను గురించి కూడా చెప్పలేదు - అది నాపిల్లేనని నా అనుమానం. ఏదోమాటల సందర్భంలో వేళాకోళాని కన్నట్టుగా, "ఎంతమంది ఇతరులైతే ఒకపెళ్ళాం అవుతుంది? పక్కలో పడుకున్నది పెళ్ళాం కాదు, రాధా. నీ జీవితం పంచుకున్నదే పెళ్ళాం....నీమొగుణ్ణి వదిలి రమ్మంటే నువొస్తావా?" అన్నాను రాధ వస్తానన్నది. నాకేభయంవేసింది, ఆశకూడా కలిగింది. అయినా ఆలోచించు కొన్నాను. అక్కర్లేదన్నది. రాధ తన అభిప్రాయం మార్చుకోవటానికి అయిదురోజులు టైమిచ్చాను. మార్చుకోలేదు. నేనూ, రాధా, పిల్లా కలిసి బెంగుళూరువెళ్ళి అక్కడ ఆరునెల్లున్నాం. మా ఏర్పాటు లోకానికి తెలియజేయడానికి అంతకంటె మంచిమార్గం కనపడలేదు.

రాధ నాదగ్గరికివచ్చి పన్నెండేళ్ళయింది. రాధ మొగుడుపోయి ఏడేళ్ళయింది. పిల్లకు మేం మేనక అని పేరుపెట్టుకున్నాం. మేనకకు పదకొండువెళ్ళి పన్నెండు వస్తాయి. పిల్లవాడికి దీక్షితులని మానాన్నగారిపేరు పెట్టుకున్నాం. వాడికి తొమ్మిదోఏడు వచ్చింది. ఇద్దరు పిల్లలకీ ఎంతపోలికో!

తల్లీ పిల్లల్ని చూసినప్పుడల్లా నా అనంతరం వాళ్ళేమవుతారో అనిపిస్తుంది. నాజబ్బు సంగతి ఇంకా రాధకి చెప్పలేను. ఒకజీవితం పంచుకుంటున్న వ్యక్తుల్లో ఒకరిని విడిచి మరొకరు చచ్చిపోవటం చాలా పాతకం కాని ఏం చెయ్యను? నేను ఇంకో సంవత్సరమే బతుకుతానో అర్నెల్లే బతుకుతానో. నా అనంతరం రాధ యాభైయేళ్ళు బతకవచ్చు. డెబ్బై ఏళ్ళుకూడా బతకవచ్చు. ఏమనిషిగానీ ఉన్న స్పర్శలన్నీ తెంచుకుని కొత్తవి ఏర్పరచుకుని మరొక మనిషి అయిపోవటానికి ఏడెనిమిదేళ్ళు చాలు. నాఅనంతరం రాధ ఈపని అధమం అయిదారుసార్లు చెయ్యవచ్చు.

నాఆస్తి యావత్తూ రాధకే రాస్తున్నాను. రాధడబ్బుకు ఇబ్బందిపడదు. ప్రేమించి చేసుకునే వాడుంటే రాధమళ్ళీ పెళ్ళాడటానికి నా అభ్యంతరంలేదు. పాపం, ఇంకా ముప్పై నిండలేదు.

జనార్దనం రాధకు చేదోడుగా ఉంటాడనుకుంటాను. కుర్రవాడు. డబ్బున్నవాళ్ళంటే కోపమైనా నన్నూ రాధనూ ఎంత గౌరవంగా చూస్తాడు. అటువంటివాడి అభిమానంగణించదగినది. మిగిలినవాళ్ళు మాడబ్బునే గౌరవిస్తు

న్నారో, మమ్మల్నే గౌరవిస్తున్నారో తెలీదు. పిల్లనిచ్చి పది ఎకరాల ఆస్తీ, ఇల్లూ ఇస్తాను తనదగ్గిరికివచ్చి చదువుకోమన్న మేనమామను తోసేసివచ్చాడు, నా సహాయం స్వీకరించి చదువుకుంటున్నాడు. పాపం, అతను తీసుకునే ప్రతి దమ్మిడీకీ ప్రతిఫలం ముట్టచెప్పుతూనే ఉన్నాడు. పిల్లల కిద్దరికీ చదువులో మంచి సరదా కలిగించాడు. ఇద్దర్నీ స్వతంత్రంగా తప్పుచేస్తే కోప్పడుతూంటాడు. రాధనే కోప్పడుతూంటాడు. నేను పోయినాక అతను మా కుటుంబానికి ఎడంగా పోకుండా ఉంచే బాగుండును....

3

నాపేరు జనార్దనం. నేను చాలా కష్టాలు పడ్డాను. అన్నిటికన్నా దుర్భరమైన దరిద్రం నన్ను పుటకతోనే ఆశ్రయించింది. మా రక్త బంధువులంతా అంతో ఇంతో కలవారే. మా నాన్న ఎవరితోటీ కలవక తన ఆస్తంతా పాడుచేసుకున్నాడనీ, చుట్టాల సహాయం కూడా నిరాకరించాడనీ చెబుతారు. ఆయనను నే నెరగను గాని ఈ మాటలు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఆయన మీద నా కెంతో గౌరవం ఏర్పడుతుంది. డబ్బుతోపాటు తెలివితేటలు కూడా ఉండటం సాధ్యంకాదని నా మతం. మా బంధువులను ఎడంగా ఉంచిన వాడు అంతో ఇంతో బుద్ధిబలమూ, ఆత్మగౌరవమూ కలవాడై ఉండాలి. మా బంధువుల తుచ్ఛమైన మూఢవిశ్వాసాలూ, అజ్ఞానమూ, సంకుచితత్వమూ ఆమోదిస్తే నాకీ పాటికి ఇల్లూ, వాకిలీ, పెళ్ళామూ, ఆస్తీ, పిల్లలూ అంతా అమరి ఉండేవి. నాలో ఉన్న మా నాన్నరక్తం నన్ను దానికి ఒప్పనివ్వలేదు.

నాకున్న నిజమైన బంధువులల్లా శర్మగారూ, రాధమ్మగారూ వాళ్ళ పిల్లలున్నూ. వాళ్ళిల్లు నాకు స్వగృహం మోస్తరుగా ఉంటుంది. నేను పరాయి వాణ్ణని వాళ్ళు నాకెన్నడూ జ్ఞాపకంచెయ్యరు. అటువంటి వాళ్లు ఈ రోజుల్లో ఎవరుంటారు?

చిత్రమేమిటంటే రాధమ్మగారిలాటి వ్యక్తుల్ని అదివరలో చూసినప్పుడు అసహ్యించుకున్నాను. ఆవిడకి డబ్బుమీద వల్లమాలిన విశ్వాసం. మంచి గుడ్డలు వేసుకున్నవాళ్ళు మంచివాళ్ళనే విశ్వాసం పిల్లలకావిడ ఎక్కించింది. ప్రపంచం గురించి భయంకూడా వాళ్ళ బుర్రల్లో పెట్టింది. లోకం చాలా చెడ్డదనీ, ఎవరో మంచివాళ్ళు ప్రపంచంలో అక్కడక్కడా ఆశ్రయాలు స్థాపించారనీ, ఆ ఆశ్రయాల్లో తల దాచుకున్న వాళ్ళకే జీవితం సుఖంగా వెళ్ళిపోతుందనీ వాళ్ళను నమ్మించింది. డబ్బున్నవాళ్ళు అందరూ మంచివాళ్ళని కాకపోయినా డబ్బుగల మంచివాళ్ళే ప్రపంచంలో చలి వేంద్రాలు పెట్టారని వాళ్ళనుకుంటున్నప్పుడు మంచివాళ్ళ కోసం వాళ్ళు డబ్బున్న వాళ్ళల్లో వెతుకుతారా, వెతకరా?

రాధమ్మగారు బీదయింట పుట్టినదేకదా ఇటువంటి మనస్తత్వం ఎట్లా వచ్చిందో నాకర్థంకాదు. నిజానికి ఆవిడ అనుభవం అటువంటిది కావచ్చు. తనకొక ధనికుడైన మంచివాడు దొరికాడుగదా అని తన పిల్లలకా సంగతి తలకెక్కించి ఉంటుంది. అయినా రాధమ్మగారిని చూస్తే నాకు కోపంరాదు. తనకూ డబ్బున్నదిగదా ఆవిడకా అహంకారం లేదు.

శర్మగారు పోవటం, పాపం, ఆవిడకి పెద్ద దెబ్బ. అయితే ఆవిడ దానికి రెండు సంవత్సరాలు ముందుగా సిద్ధమై ఉంది. పిల్లలిద్దరూ చదువుకుంటున్నారు. డబ్బున్నది. నాకిక్కడే ఉద్యోగం అయింది గనక నేనుంటాను....

ఈ వెంకటేశ్వర్లెక్కడ దాపరించాడు? ఈయన రోజూ వచ్చి రాధమ్మగారి కేదో పిరికిమందు పోసిపోతూ ఉంటాడు. నేను వచ్చేసరికి రాధమ్మగారు విచారంగా కనిపించిందంటే ఆ రోజు వెంకటేశ్వర్లు వచ్చి వెళ్ళాడన్నమాటే. ఈ వెంకటేశ్వర్లు ఆర్చేవాడూ తీర్చేవాడూ కాదే. ఈయన ఏ విషయమై రాధమ్మను భయపెడుతున్నాడు? వెంకటేశ్వర్లకేం కావాలి? ఆవిడంతట ఆవిడ నాతో చెప్పదు; అడగటం నాకసహ్యం.

కాని రహస్యం కనుక్కున్నాను. వెంకటేశ్వర్లు రోజూవచ్చి రాధమ్మగారితో మాట్లాడేది మేనక పెళ్ళిగురించి: మేనకకి తండ్రి ఎవరు? కులగోత్రాలున్నాయా? ఎవరు చేసుకుంటారు? తల్లినిబట్టి పిల్ల ప్రవర్తన నిర్ణయిస్తారుగదా; రాధమ్మవంటి మనిషి కూతుర్ని ఎవరు చేసుకుంటారు? డబ్బుంటేమాత్రం మిగిలిన విషయాలు పరిసిపోతాయా అని ఆవిడ చెవిలో రోజూ పిరికి విషం పోస్తున్నాడు. ఆయన కేదో ఉద్దేశం ఉంది. మేనకని ఎవరికో ఇచ్చి పెళ్ళి చెయ్యటానికి చూస్తున్నాడు.

మేనక పెళ్ళి ఇప్పుడే చెయ్యటం మంచిది కాదా అని రాధమ్మగారన్నది నాతో మాట వరసగా. పద్నాలుగేళ్ళు నిండని పిల్లకి పెళ్ళి తొందర ఏమిటన్నాను. బ్రహ్మచారి ముదిరితేనే పనికి రాదంటే కన్య ముదిరి ఏం లాభమన్నది. నేను మాట్లాడలేదు. కాని మేనకని కదిలించి చూచాను. తల్లి ఎట్లా చెబితే అట్లా చెయ్యటాని కాపిల్ల సిద్ధంగాఉంది. ఇక నేను చేయగలిగిం దేమున్నదీ?....

అనుకున్నంతా అయింది. మేనకని ఆ కామేశ్వర్రావు కిచ్చి చేస్తున్నారు. వాడికి రాధమ్మగారి ఈడుంటుంది. పెళ్ళాన్ని వదిలేసి అచ్చుపోసిన ఆంబోతులాగా తిరుగుతున్నాడు. శర్మగారి స్వార్జితం యాభై అరవై వేలూ రాధమ్మ పేరనే ఉందనీ అది మేనకకే వస్తుందనీ వాడి ఆశ అయి ఉండాలి. ఏమైనా లాభం ఉంటే ఈ పెళ్ళికి నా ప్రాణం అడ్డు వేతును. కాని లాభంలేదు. ఆయిదారువేలు ఖర్చుచేసి అతి వైభవంగా పెళ్ళి చెయ్యటానికి ఏర్పాట్లు చేస్తున్నది రాధమ్మగారు. వెంకటేశ్వర్లు పెళ్ళి పెద్ద—అటూ యిటూకూడా. ఈపెళ్లి అయిపోయినాక వెంకటేశ్వర్లు కొంప కట్టించకపోతే చెవి కోసేసుకుంటాను.

పెళ్ళికి ముందుగా మేనకను మరొక్కసారి కదిలించిచూశాను. లాభంలేకపోయింది. ఆపిల్ల చాలా గొప్ప సంబంధం దొరికినట్టుగా భావిస్తున్నది. పెళ్ళి అయిపోయింది. కామేశ్వర్రావు అత్తగార్నీ, బావమరిదినీకూడా వెంట పెట్టుకుని పెళ్ళాన్ని తీసుకుపోయినాడు. ఇల్లు అద్దె కిప్పించాడు.

ఆ ఇల్లు అమ్మకం ఎప్పుడు జరిగిందీ నాకు తెలీదు. రాధమ్మగారి దగ్గిరనుంచి ఉత్తరం వచ్చేదాకా ఆవిడ విషయాలు నాకు తెలీదు. ఆరునెల్లలోపలనే కామేశ్వరరావు అత్తగారి ఆస్తి యావత్తూ పెళ్ళాంపేర పెట్టించాట్ట. ఇల్లు అమ్మేయించి డబ్బు బాంకిలో వేయించాట్ట. ఆ తరవాత అత్తగారిని కుక్కకన్న హీనంగా చూడసాగాట్ట.

ఈ విషయాలు నన్ను బాధించినా ఇంతకన్న బాధించిన వాక్యాలు వేరే ఉన్నై. "నా



ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తున్నది. డబ్బాశ మనుషుల్ని ఎంతయినా చేయిస్తు దంటారు. కాని విషం పెట్టటం జరుగుతుందని నమ్మటం నాకు అనుకోవటానికే కష్టంగా ఉంది. నేను ఆయన చచ్చిపోయినాక ఇంకా ఎందుకు బతికి ఉన్నాను?"

ఈ మాటలు నా కడుపులోకిపోయి దేవటం మొదలుపెట్టినై. తన అల్లుడు తనకు విషం పెడుతున్నాడని రాధమ్మగారు అనుమానిస్తున్నదా? అందులో నిజం ఉంటుందా? నేనేం చెయ్యాలి? వెళ్ళి ఆవిణ్ణి ఒకసారి చూసివస్తే? ఏమిటి ప్రయోజనం? నన్ను రమ్మంటారా అని ఆవిడకి ఒక ఉత్తరం రాశాను. అది పోస్టుచేసిన రోజు రాత్రే ఆవిడ మాయింటికి వచ్చేసింది. బండిదిగి లోపలికి వస్తుంటే నేనావిణ్ణి గుర్తించలేను. మనిషి చిక్కి శల్యం అయిఉంది. తెల్లని శరీరం నలుపెక్కింది. కళ్ళు లోతుకుపోయినై. మనిషి శవాకృతిగా ఉంది.

నా ఆదుర్దా చెప్పటానికి వీల్లేదు.

"ఏమిటిట్లా వచ్చేశారు?" అన్నాను.

"ఇంక నేనిక్కడ ఎందుకు, నాయనా? అంతా అతను పుచ్చేసుకున్నాడుగా. మందిప్పించమంటే మాట్లాడ్డు. పోట్లాడాను; నా

కన్నం పెట్టవద్దని పెళ్ళాన్ని ఆజ్ఞాపించాడు. నన్ను ఇంట్లోనుంచి పొమ్మన్నాడు. పరువైనవాడు నన్నింట్లో ఉంచుకోడుట. నా కూతుర్ని పెళ్ళాడతాడుగామాలు. ఏంచెప్పను? నన్నింత నీచంగా ఎవరూ చూడలేదు. ఈ అనుభవంకోసమే బతికిఉన్నానేమో."

వెక్కి వెక్కి ఏడిచింది.

"అతనేం చేసినా నాకాశ్చర్యంలేదు. మీ అమ్మాయి ఏం చేస్తున్నది? మీ అబ్బాయి ఏమైనాడు?"

"మా అబ్బాయి ఎక్కడికో వెళ్ళిపోయినాడు. వారమయింది. అమ్మాయి ఏం చేస్తుంది? దాని మొగుడు చెప్పినట్టు వింటుంది. కాపరం అది నాకోసం పాడుచేసుకుంటుందా?"

"ఒకప్పుడు మీరు మీ కాపరం ఇంకొరికోసం పాడుచేసుకున్నట్టు విన్నాను. అందుకు మిమ్మల్ని గౌరవించాను. నాదిపొరపాటంటారా?"

రాధమ్మ కాస్సేపు మాట్లాడక, "దాని సుఖమే నాకుకావలిసింది," అన్నది.

"మొగుడు తల్లికి అన్నం పెట్టవద్దంటే వినేమనిషికి సుఖపడే అర్హతలేదు. ఆమాత్రం ధైర్యం లేకుండా మీరు మేనకను ఎట్లా పెంచారో నాకర్థం కావటంలేదు."

ఆసమయంలో ఆవిణ్ణి తూలనాడటం నాదే పొరపాటు. తప్పు ఆవిడదే అయినా నేను చెప్పటాని కది తరుణంకాదు. అందుచేత ఆ సంగతి అప్పటికి కట్టిపెట్టి ఆవిడతిండి సంగతీ వైద్యం సంగతీ చూశాను. ఆవిణ్ణి విచార పడవద్దనీ ఎంత కాలమైనా నాదగ్గిరే ఉండమనీ చెప్పాను.

నాకిప్పుడు ఒక్కటే! కోరిక మిగిలింది- మేనకని తిట్టిరావాలని - ఎవరూ నేర్పని గుణపాఠం నేర్పిరావాలని. ఆఉద్దేశంతో బయల్దేరాను. ఇంట్లో కామేశ్వర్రావున్నాడు. నేను సందేహించలేదు. మేనకని అనదలిచినమాటలన్నీ అనేశాను.

"మీ నాన్నగారు మనిషి-మానవత్వం గలవాడు. తనకి తప్పని తోచినదాన్ని ఎదుర్కొన్నాడు. రైటనితోచినపని చేసితీరాడు. ఆయన కడుపున నువ్వెట్లా పుట్టావో నాకుతెలీదు. నువు అమ్మనమ్ముకున్నావు. దేనికి? ఇంత తిండికా? కీర్తికా? ఈ మొగుడికోసమా? అదివరకల్లా నిన్నుకూడా ఒకమనిషికింద చూస్తూవచ్చాను. తల్లి ఆస్తితిని తిండి పెట్టలేనిమనిషిని గొడ్డుకన్నా హీనంగాచూడాలి. ఆమాటచెప్పి పోవటానికే వచ్చాను. నేను కలవాణ్ణి కానుగాని మీ అమ్మను బతికిఉన్నంత కాలమూ నేను పోషిస్తాను. ఎప్పుడైనా మీ అమ్మను చూడాలని కోరిక కలిగి చూసే ధైర్యంకూడా ఉంటే మాయింటికి వచ్చి చూసిపో!" అని బయటికి వచ్చేశాను. ఎందుచేతనో కామేశ్వర్రావు నాకు అడ్డం రాలేదు. తంతాననుకున్నాడో ఏమో....

నేనీమాట అనివచ్చి వారంకాలేదు. మేనక మాయింటికి వచ్చింది. తల్లినిచూసి ఏడిచింది. నామాటలు వృథాపోలేదు. అసలు, పాపం, మేనక కట్టలు తెంచుకోవటానికి సిద్ధంగానే ఉంది. నేను చేసిందల్లా ఒక చిన్న గండి పెట్టాను.

"మీచేతమరి కాసిని తిట్టించుకుందామని వచ్చాను. నేనెన్నడూ తిట్లుతినలేదు. తిట్టించుకోవటం బాగుంటుందనికూడా అనుకోలేదు. తిట్టండి!" అని నాదగ్గిర ఏడిచింది. నాకు జాలేసింది.

ఇక మేనకతిరిగి మొగుడుదగ్గిరికి వెళ్ళదు. మేనక మేజరయ్యేవరకూ రాధమ్మగారి ఆస్తి గురించి గొడవలుగా ఉంటుంది. ఆతరవాత కామేశ్వర్రావు ఏమీ చెయ్యలేదు. అయినా ఈలోపల ఏమైనా చెయ్యటానికి వీలుందేమో ప్లీడర్లను కనుక్కోవాలి.





# కానుక

మునిమాణిక్యం

ఇంతలో ఆవిడ వచ్చి ఎదురుగా నుంచున్నది. తలంటుకొని స్నానం చేసింది కామాలు జుట్టు వేలుముడి వేసుకొన్నది. ఇవ్వాళ ఆమెగారు మామూలు మనిషిలాగ లేక ఏదో కొత్తగా ఉంది నా కళ్ళకు. నేను మాట్లాడకుండా ఆమెను చూస్తూ కూర్చున్నాను.

ఆమెకూడా మాట్లాడలేదు. సిగ్గుతో తలొంచుకొని ఊరుకొన్నది.

'ఏమిటి సంగతి ?' అన్నాను.

'ఏముంది ?' అన్నది.

కనకాంబరం చీర గట్టింది. ఆ చీర జరీ అంచులు మెలికలు మెలికలుగా ఆ శరీరాన్ని చుట్టుకొన్నవి. తెల్లనిరవిక తొడిగింది. కళ్ళకు కాటుక పెట్టి, నుదుట చిన్న కుంకుమబొట్టు పెట్టింది. అక్కడే నుంచుని ఉన్నది నన్ను జూస్తూ.

ఏదో ఉంది! లేకపోతే ఈ అలంకారాలూ ఈ క్రీగంటి చూపులూ ఎందుకొస్తయ్.

"ఏమిటి చెపుదూ" అన్నాను.

ఆమె ఏ సంగతీ చెప్పక, ఒక్క చిన్న నవ్వు నవ్వి గదిలోకి వెళ్ళిపోయింది. ఆమె నవ్వితే బుగ్గలు సొట్ట పడ్డవి. అది నేను చూచి ఆ సొట్ట బుగ్గలను సాఫీ చేద్దామనే సదుద్దేశంతోనే గదిలోకి వెళ్ళాను.

సొట్ట బుగ్గలను కాస్త నొక్కి, సాఫీగా తుడిచి "చెప్పు ఏమిటి సంగతి ?" అన్నాను.

"అంతమాత్రం తెలియదా ?" అన్నది ఆవిడ గునుస్తూ.

'నాకేం తెలుస్తుందీ? తెలియదు' అన్నాను.

"అయినా ఆలోచించి, జ్ఞాపకం తెచ్చుకోండి" అన్నది.

నాకు జ్ఞాపకం రాలేదని చెప్పాను.

"ఇంత ముఖ్యమైన రోజును ఎట్లా మరిచి పోతారండి" అని కాస్త ముఖం చిట్లించింది. "నేను పుట్టింరోజా ?" అని అడిగాను. కాదన్నది. "నీవు పుట్టినరోజా ?" అన్నాను కాదని తలఊపింది. ఇహ నాకేమీ తోచలేదు.

"నాకు ఏమీ జ్ఞాపకం రావటంలేదు. నీ యిష్టం నన్ను ఏం చేసినా సరే"నని - నేను మంచం మీద కూర్చున్నవాణ్ణి, లేచి స్థిల బడ్డాను వెళ్ళిపోవటానికి సిద్ధపడుతూ. ఆవిడ బుజంమీద చేయివేసి అదిమి కూర్చోబెట్టి, నా ప్రక్కనే కూర్చుని, తలొంచుకొని సిగ్గు పడుతూ అన్నది. "ఇవ్వాళ నేను కాపరానికి వచ్చిన రోజు. సరిగ్గా ఇవ్వాళతో ఇరవై ఏండ్లు వెళ్ళుతాయి. మీకు ఇంత ముఖ్యమైన సంగతి జ్ఞాపకం లేక పోయిందేం ?"

నేను అంత పవిత్రమైన దినాన్ని, నా సౌఖ్య దేవత కాపరానికి వచ్చిన సుదినాన్ని జ్ఞాపకం ఉంచుకోకపోవటం చాలా పెద్ద పొరపాటు. అందుకని అన్నాను నవ్వుతూ - "జ్ఞాపకం లేక కాదండీ కాంతమ్మగారూ, తమ నోటి తోనే ఆ అమృతవాక్కులు అనిపిద్దామని !

తెలిసిందా?" అన్నాను-ఆవిడ మరొకసారి సిగ్గుతో తలొంచుకొని, నవ్వుకొన్నది. ఆ తరువాత నా వీపుపైన మృదువుగా చరిచి, అరచేతిలో గిల్లి, వళ్ళు ఝల్లు మనిపించి వెళ్ళిపోయింది.

నా వళ్ళు ఝల్లుమనటానికి కారణం ఏమిటీ అంటే, ఆవిడగారు కాపరానికి వచ్చిన రోజు కాబట్టి అది. నేను ఏదైనా కాన్క ఒకటి సమర్పించాలిని ఉంటుంది. ఆ విషయం జ్ఞాపకం ఉంచుకోమనే అమె అరచెయ్యి గిల్లింది. డబ్బులేని సమయంకిదా ఇది ఏమి కొనేది. ఎట్లా కొనేది? అన్న ఆలోచనలలో నా వళ్ళు ఝల్లుమన్నది.

ఏదో ఒకటి కొనియియ్యక తప్పదు. నాదగ్గర డబ్బులేని రోజుచూచి, అరోజునే ఆవిడ కాపరానికి వచ్చింది. మొదటినుంచీ, మా కాంతం ఈప్లాను ప్రకారమే నడిచింది.

౨

మా కాంతం మెట్టిన రోజు పండక్కు ఏమికాన్క యియ్యాలె అన్న ఆలోచనలోకి దిగాను. పౌడరూ, అత్తరూ, దువ్వెనా, వాసన నూనె, ఇల్లాంటి దేదో ఒకటి ఇస్తే సరి పోయేదానికి, దీనికో పెద్ద ఆలోచన ఏమిటీ అని అనుకొంటారు కాని ఆవిడ సంగతి తెలిసిన వాళ్ళుమటుకు అల్లా అనరు. ఆవిడ ఇప్పటికాలం మనిషీకాదు, పూర్వకాలం మనిషీకాదు. అదోరకం మనిషి. దువ్వెనా అద్దం, అల్లాంటి వస్తువులు ఇస్తే సంతోషించదు. కాస్త ఖరీదుగలవి, నాలుగు కాలాల పాటు ఉండేవి అల్లాంటి వస్తువులు కావాలంటుంది, అందుకనే నేను అంత దిగులు పడ్డది, ఇప్పుడు అల్లాంటిది ఏదైనా కొంటానికి డబ్బు ఎక్కడనుంచి తెచ్చేదా అని!

అదీకాక ఆవిడ అనేకసార్లు అనుకొన్నది ఒకజత బంగారపు గాజులుంటే బాగుండునని! కొనియిస్తే అవే కొని యియ్యాలె. ఈ పాడు యుద్ధం రావటం మూలాన బంగారపు ధర విపరీతంగా పెరిగి పోయిందిగాని లేకపోతే ఎన్ని గాజులైనా చేయించుకొనేదట ఆవిడ! అసలు ఆడవాళ్ళను ఏడ్పించటానికే ఈ యుద్ధం ఒకటి తీసుకొచ్చారు అంటుంది ఆవిడ యుద్ధం అయిపోయిన వెంటనే బంగారం చౌక చెయ్యలేదని ఆమెకు చాలా కోపంగా కూడా ఉంది.

స్వరాజ్యం వచ్చిన రోజున మధ్యాహ్నం సరిగ్గా పన్నెండు గంటలనుంచి ఒంటి గంట దాకా, ఒక గంటసేపు నవరసులు చౌకగా గవర్నమెంటువారు అమ్మిస్తారనీ, ఆడవాళ్ళ యందు దయతలచి, గోపాలరెడ్డిగారు ఈ ఏర్పాటు ప్రత్యేకంగా చేశారనీ ఒక వదంతి పుట్టింది. అప్పు అయినా చేసి ఒక పది నవరసులైనా కొనుక్కురమ్మని ఆవిడ గోల చేసింది. "ఇది అబద్ధం, ఇల్లాంటి పిచ్చి పనులు గవర్నమెంటువారు చెయ్య"రని నేను చెప్పాను. కాని ఆవిడ నామాట నమ్మక పైగా ఏమన్న దంటే, "ఇది ఏమీ పిచ్చిపనికాదు. ఆమాట కొస్తే ఇంతకంటె పిచ్చిపనులే చేస్తున్నారు" అనికూడా అన్నది. ఆవిడ బాధ తప్పించుకోటానికి చివరకు నేనొక మాట అన్నాను "నవరసులు చౌకగా అమ్మినా, మొగవాళ్ళకు అమ్మరు ఆడవాళ్ళకు మాత్రమే అమ్ముతారు." ఈమాట కాస్త సమంజసంగా ఉందనుకొన్నదో ఏమో మా పిచ్చిది, ఆ తరువాత నన్నేమీ అనలేదు కాని, ఆ మరునాడు మటుకు ముఖం అంతా కందగడ్డ చేసుకొని "ఈ గవర్నమెంటువారు ఆడవాళ్ళను ఇంత మోసగించి, అన్యాయం చేస్తారనుకోలేదండీ!" అన్నది.

నిజానికి మా కాంతమేకాదు ఆడవాళ్ళంతా అల్లాగే అంటున్నారు. "ఎందు కొచ్చిన స్వరాజ్యం ఇది! బంగారం చౌక చెయ్య కూడదా, ఈ స్వరాజ్యం వాళ్ళు!" అని చాలా మంది అన్నారు.

ఇల్లాంటి విషయాలన్నీ జ్ఞాపకంవచ్చినవి ఆలోచిస్తూ కూర్చుంటే. చివరకు నేను కాంతానికి ఒక జత బంగారపు గాజులు కొని యియ్యక తప్పదనే నిశ్చయానికే వచ్చాను.

నిజానికి కొని ఇయ్యవలసిందే; అందులో సందేహం ఏమీలేదు. పుట్టినరోజు పండగకు, మెట్టినరోజు పండగకు భార్యకు, బహుమానం ఇయ్యాలె. ఈవిషయం కామశాస్త్ర గ్రంథ కర్తకూడా ఉదహరించి, ఆరోజున కానుకలు ముట్టకపోతే ప్రియురాలు ప్రణయకలహం పట్టవచ్చునని కూడా చెప్పాడు. అయితే మా ఆవిడ ప్రణయకలహం పడుతుందని భయ పడి నేను ఆ నిశ్చయానికి రాలేదు. ప్రణయ కలహం పడితే, వచ్చిన ఆపదయినా, ఏమీ లేదు. వచ్చిన ఇబ్బంది ఏమిటీ అంటే, మన ఆడవాళ్లు శాస్త్రరీత్యా పట్టవలసిన ప్రణయ కలహం పట్టక, చటుక్కున జాతీయమైన నాటు కలహంలోకి దిగుతారు. దానికి నేను భయపడ్డది!

## 3

పెందలాడే భోజనంచేసి బజారులో నగల షాపు చూడటానికి వెళ్ళాను. ఆ షాపు యజమాని నాకు తెలిసినవాడే. గౌరవించి కూర్చో బెట్టాడు. అక్కడ అద్దాల బీరువాలో రక రకాల గాజులున్నవి. స్వస్తిక్ గాజులు, రేడియో గాజులు, పలకల గాజులు, పార్శీ గాజులు మొదలైనవి ఎన్నోరకాలు. అందులో స్వస్తిక్ గాజుల జత ఒకటి మహా బాగుంది. మధ్య మధ్య ఎర్రరాళ్ళు పొదిగారు. ధగ ధగ మెరిసిపోతున్నది.

మా ఆవిడ చేతులకు అదే బాగుంటుం దనిపించింది. తొంభైరూపాయల ఖరీదు చెప్పాడు. ఆ జత కొనాలనిఉంది. చేతిలో డబ్బులేదు. అప్పుఅడిగితే ఏమనుకొంటాడో? చివరకు ఒక విధంగా నవ్వులాటగా అన్నాను. 'ఏమయ్యా, ఈ జత నాకు కావాలె, డబ్బు ఇయ్యకుండా తీసికెళ్ళవచ్చునా?'

ఇది తెలివితక్కువ ప్రశ్న అనుకొంటారు కాని కాదు. ఎందుచేతనంటే నేను అను కొన్నది ఏమిటీ అంటే, ఆమాటమీద ఆ షాహుకారు, 'తీసికెళ్ళండి పంతులుగారూ, డబ్బు ఎక్కడకి పోతుందీ', అని అంటాడని.

కాని, నాకర్మం, ఏంచేసేది! ఆ షాహు కారు అల్లా అనలేదు. అనక, పైగా నవ్వుతూ హేళనగా అన్నాడు "డబ్బుఇయ్య కుండా తీసికెళ్ళటానికి వీల్లేదు కాని, డబ్బు ఇచ్చి తీసికెళ్ళకుండా ఉంటానికి వీలుందండీ పంతులుగారూ" అని.

అప్పుడు నేను గొంతుకమార్చి బ్రతిమి లాడుకున్నట్లు అన్నాను- "ఈనెల ఆఖరుకు ఇచ్చేస్తాను. అసలు అందాకాకూడా అక్కర లేదు, ఈలోపునే ఇచ్చేస్తానేమో." అప్పటికీ ఆ అసామికి నాయందు నమ్మకం కుదరలేదు. "ఇప్పుడెవరికీ అప్పు ఇయ్యటం లేదండీ" అన్నాడు. "ఇప్పుడియ్యటం లేదట! పూర్వం తెగించి అందరికీ అప్పులిచ్చేవాడిలాగ. ఛీ ఇతన్ని అడగకూడ"దని లేచి వచ్చేశాను.

చాలా కష్టంవేసింది. పారిపోతా నను కొన్నాడు కాబోలు. ఛా, ఆమాత్రం మర్యాద లేకపోయింది అతనికి.

అప్పుడు నాకు ఒక చక్కని ఆలోచన చటుక్కున తోచింది; ఎక్కడైనా ఒక పంద



"ఈ లాకెట్‌లో నా భర్తజుట్టు స్మృతి చిహ్నంగా అట్టే పెట్టా."

"అదేమిటే! నీ భర్త బ్రతికే ఉన్నాడుగా."

"భర్త వున్నాడుగాని జుట్టు లేదుగా."

---

రూపాయలు అప్పు తెస్తే ఏ ఇబ్బందీ పడ నక్కరలేదని; తొంభై రూపాయలు వీడి ముఖాన పారేసి గాజుల జత తీసుకోనూ వచ్చు....మిగిలిన పదిరూపాయలూ హాయిగా వాడుకోనూ వచ్చు!

ఇంకోటి కూడా అనుకొన్నాను. డబ్బు పారేసి కొనేటప్పుడు ఇక్కడ కొనటం ఎందుకు నా యిష్టంవచ్చిన చోట కొందామని. నా మర్యాద కాపాడాడు కనకనా అక్కడే కొంటానికి!

ఇల్లా అనుకొని వచ్చాను కాని వంద రూపాయలు అప్పు ఎక్కడ దొరుకుతుంది! ఎవరినడిగేది? నాకేమీ తోచలేదు.

అయితే ఒకటి గట్టిగా విశ్వయించు కొన్నాను. గాజుల జత మటుకు కొనేతీరాలె. ఎట్లాగయినా సరే! కొని తీసికెళ్ళి అవిడ చేతులకు స్వయంగా తొడక్కపోతే నాకు పిచ్చి ఎక్కేమాట నిజము. అప్పటికే కాస్త పిచ్చి పిచ్చిగా ఉంది.

నూరు రూపాయల మొత్తం చాలా స్వల్ప మైనది. నిజానికి ఈమాత్రం సాహాయ్యం ఎవరు బడితే వాళ్ళే చేయగలరు. కాని ప్రపంచం పాపిష్ఠిది. స్వార్థపర్వతం ఎక్కువ. "అయ్యో, పాపం ఆ అబ్బాయి బంగారపు గాజులు కొని తీసికెళ్ళి భార్యకు ఇయ్యకపోతే ఎట్లా! ఎంత చిన్నతనం, సాహాయ్యం చేద్దాము" అని ఒక్కరూ అనుకోరు. అటు వంటిది ప్రపంచం!

అయినా అప్పుపుట్టే స్థలాలు ఏవా అని ఆలోచించాను. ఒకటి రెండు స్థలాలు ఉన్నవి కాని అక్కడ ఇదివరకే పుట్టించాను. బ్యాంకులో అప్పుఉంది. ప్రావిడెంటు ఫండులో నుంచి అప్పతీశాను. ఇక స్నేహితులెవరైనా ఇస్తారేమోనంటే ఆ గోఖ్లేగారు ఇయ్యరు. ఇది వరలో తీసికొన్నది ఇస్తేగా ఆయన మళ్ళీ ఇయ్యటానికి! ఇంకెవరిస్తారు? నాగేశ్వరరావుగారిని అడిగి లాభంలేదు. అవధాని గారు ఇయ్యరు. ఇహ పోతే నరసింహం గారు ఇస్తారుగాని ఏమైనా తాకట్టు పెట్టాలె. తాకట్టు పెట్టటానికి నాదగ్గర ఏమీలేదు. ఆ కంచం వెండిపూత పూసింది. అచ్చం వెండిది కాదాయె. ఛీ, జీవితం ఎంత దరిద్రంగా ఉందీ! తాకట్టు పెట్టకొనేందుకు అయినా ఏమీ లేక పోయింది! అని విచారం వేసింది.

అప్పుడే ఇంకో విషయము కూడా తోచింది. ఈ గాజులు కొని అవిడ కిస్తే- అవిడను సంతోషపెట్టినట్టూ అవుతుందీ.... ఎప్పుడైనా ఇల్లాంటి ఇబ్బంది వస్తే చప్పున తాకట్టు పెట్టుకోనూ వచ్చు! తాకట్టు పెట్టటానికైనా ఇంట్లో ఆమాత్రం వస్తువ ఉండటం అవ

పరం అని గట్టిగా మనస్సుకు తట్టింది. దాంతో ఆ గాజులజత కొనాలనే పట్టుదల ఎక్కువైంది.

ప్రొద్దున ఆవిడ 'తలవంచుకొని నుంచుని, చేతనున్న గాజుగాజులు సద్దుకొంటూఉండటం జ్ఞాపకం వచ్చింది. "ఇవేం గాజులండీ బంగారపు గాజులు కొనిఇయ్యండీ;" అని అడగటం అది. అరచేతిలో గిల్లిపోవటంకూడా దానికి సంబంధించినదే. ఈ విషయాలన్నీ జ్ఞాపకానికి వచ్చి నా పట్టుదలను మరీ దృఢపరచినయి.

ఎక్కడైనా అప్పు అడగటానికి బయలుదేరాను. కనపడ్డవాణ్ణి అల్లా అడుగుదా మనిపించింది. ఇంతలో సుబ్బారావు కనిపించాడు. అతడు కాస్త డబ్బుగలవాడు. అతనికి నాకూ కాస్తో, కూస్తో బంధుత్వంకూడా ఉంది.


"ఓ వందరూపాయలు అర్జంటుగా కావలసి వచ్చినయి. కాస్తఇస్తావ్?" అని అడిగాను, ఏదో తమాషాగాను, నిర్లక్ష్యంగానూ ఎప్పుడు వందా, రెండువందలూ ఇల్లాగ తరుచుగా అప్పుపుచ్చుకొని మళ్ళీ మర్నాడు ఇచ్చేసేవాడిలాగ.

వాడి చూపులుచూచి "తీసికెళ్ళవోయ్ ఏం భాగ్యం" అంటాడనుకొన్నాను. అట్లాగే చూశాడు.

నేను ఆశపడ్డాను.

కాని వాడి దుంపతెగ వాడు అల్లాగ అనక "ఏం, వేళాకోళంవోయ్, వందరూపాయలు నీకు అప్పుకావాలిసి వచ్చిందేం? ఎవరికైనా కావలిస్తే ఇయ్యగలవాడవు?" అన్నాడు.

నన్నుగురించి వీడికి మంచి అభిప్రాయం ఉన్నందుకు సంతోషించి, "సమయానికి పైకం అందలేదయ్యా, ఒక వారం రోజులలో పంపించేస్తాను" అన్నాను.



"మీ రెవరండీ? అప్పులవాళ్ళా? భీమావాళ్ళా? స్నేహితులా?"

"మూడూనూ."

"అయితే 'వారు ఇంట్లోలేరు.' 'చాలా తొందరపనిలో ఉన్నారు. ఇప్పుడు చూట్టానికి వీల్లేదు.' 'దయచెయ్యండి, వారు టీ త్రాగుతున్నారు.'"

---

ఈతడూ అయినా "అంత ఇబ్బంది వస్తే పట్టుకుపో" అని అనలేదు. "నీకు అంత అవసరం అయితే చీటీ వ్రాసి పంపిస్తే ఎవరు బడితే వాళ్ళే ఇస్తారు. నన్ను అడగాలా ఏమిటి?" అని పెద్ద పెద్ద అంగ లేసుకుంటూ వెళ్ళిపోయినాడు. "చీటీ వ్రాసి వీడికే పంపిస్తే!" అని అనుకున్నాను. ఏమిటో మతిలేని ఆలోచనలు: మతిఉంటే అల్లా ఎందుకు అనుకొంటాను? ఎదటబడి అడిగితే ఇయ్యనివాడు చీటి వ్రాసి పంపితే ఇస్తాడూ? ఆ ఆదుర్దాలో అల్లాగ అనిపించింది.

ఈ ప్రయత్నం కూడా ఇల్లాగ వ్యర్థం అయిపోయిందే, ఎల్లాగురా బాబూ అని ఆలోచిస్తూ నడుస్తున్నాను. వంకర మేడ దగ్గరకు వచ్చేసరికి ఇంకో ఆలోచన వచ్చింది



"ఎందుకోయ్, అట్లా నవ్వుతావు ?"
"వాళ్లంతా నాకు అప్పిచ్చిన వాళ్లలే."

అక్కడే మా కేశవరావు అత్తగారున్నారు. వాళ్ళను అడిగితే ఇయ్యరా అని !!

కేశవరావూ, నేనూ, మంచి స్నేహితుల మని వాళ్ళకు తెలుసు. నాకు ఈ స్వల్పం సాహాయ్యం చేయకపోతే అల్లుడికి చిన్నతనం అవుతుందని అయినా ఇస్తారని ధైర్యం కలిగింది.

రైట్—ఈ ఆలోచన వచ్చినందుకు చాలా సంతోషించాను. ఈతథా నెగ్గానన్న మాటే! తొంభై రూపాయలూ తీసికెళ్లి, ఇచ్చేసి స్వస్తిక్ గాజాలు కొనుక్కొని వెళ్ళాలె అనుకొన్నాను.

అయితే ఈ విషయం వాళ్ళతో ఎత్తటం ఎల్లాగ ? ఆవిషయం కాస్త తీరికగా ఆలోచించుకోవాలె. అందుకని దగ్గరలో ఉన్న కాఫీ హోటలుకెళ్ళి, ఒక కప్పు కాఫీ తెప్పించి కొంచెం కొంచెంగా తాగుతూ ఈ "క్యాంపెయిన్" ఎట్లాసాగించాలా అని తీవ్రంగా ఆలోచించాను. వాళ్ళింటికి వెడతాను. వాళ్ళు నన్ను కూర్చోమంటారు మర్యాద చేస్తారు. సరే, వెంటనే అప్పు అడగటం బాగుంటుందా ?

ఆహ. అల్లాకాదు. వాళ్ళు నాకు అప్పు ఇయ్యటం నేను కేశవరావు స్నేహితుణ్ణి అనేగా ! అందుకని ముందుగా నేను, కేశవరావుకూ నాకూ ఉన్న స్నేహాన్ని, వాళ్ళకు గుర్తుచెయ్యాలె. ఎట్లాగ గుర్తుచెయ్యటం ?....

కేశవరావును చూచివచ్చాను. కులాసాగా ఉన్నాడు అనాలె. మేము ఇద్దరం మంచి స్నేహితులం కాబట్టి తరుచు కలుస్తూఉంటా మన్న మాట !........

నేను కేశవరావు కుటుంబానికి ఆప్తుణ్ణి అయినట్లు కూడా నా సంభాషణలో ప్రకటితం చెయ్యాలె.

నిజానికి కూడా అంతేనాయె. అయితే ఈ మధ్య నేను కేశవరావును చూడలేదు. ఉత్తరాలుకూడా రావటంలేదు. అయినా మంచి స్నేహితుల మన్నమాట నిజమేగా

సరే. కేశవరావు క్షేమమూ అవీ చెప్పి మెల్లిగా సమయంజూచి అప్పు అడగాలె.

ఇదీ ప్లాను.

బాగుంది అనుకొన్నాను. వాళ్ళు భాగ్యవంతులుకూడాను. ఒక వంద రూపాయలు వాళ్ళకో లెక్కలోనిదికాదు. ఇస్తారు, నోటూ గీటూ ఏమీ అక్కరలేదనికూడా అంటారు. కాని....నోటు వ్రాసి ఇచ్చేస్తాను. అదే మర్యాదగా ఉంటుంది.

ఇల్లాగ ఆలోచించు కొన్నాను. అంతా కుదిరింది. నేను ఆ తరువాత ఒక నిమిషమైనా వృథాగా గడపకుండా, గబగబా నడిచి కేశవరావు అత్తగారింటికి వెళ్ళాను. ఆమె అయినా నాకు బాగా తెలిసిందే నాయె. కేశవరావుతో అనేకసార్లు వెళ్ళాను. వాళ్ళింట్లో చాలాసార్లు భోజనంకూడా చేస్తిని. ఇంకా భయం ఎందుకు యకాయకీని లోపలికి వెళ్ళాను.

కేశవరావు అత్తగారు నన్ను చూడటంతోనే పలకరించింది "ఏమయ్యా, అల్లుడా

చాలా కాలానికి కనపడ్డావే!" అంటూ. నన్ను కూర్చోమని కుర్చీ చూపారు. కూర్చున్నాను.

"ఆ"....

"అంతా కులాసాగా ఉన్నారా ?"

"మా అల్లుణ్ణి చూశావా ఈమధ్య ?" అని అడిగింది ఆవిడ.

"చూడకేమండీ. ఎప్పుడూ కలుస్తునే ఉంటాము పదిరోజుల్ల కొకసారి అయినా చూచుకోకుండా ఉండలేము"

"అవునవును, స్నేహితులాయెమరి ?" అన్నది ఆవిడ. ఇంకేం, ఇదేసమయమని మళ్ళీ ఇల్లా అన్నాను. "మామూలుస్నేహం కాదండి. అన్నదమ్ములకంటే ఎక్కువగా ఉంటాము".

"అవునులే నాయనా, స్నేహం అటువంటిది. అది సరేగాని మా అల్లుణ్ణి కలుసుకొని ఎన్నాళ్ళయిందినీవు ?"

"నిన్న నేనండి. నిన్న కలుసుకొన్నాను." అన్నాను. ఆవిడ సంతోషంతో "ఎక్కడ కలుసుగొన్నావు బాబూ ?" అని అడిగింది.

"నేనే గుంటూరు వెళ్ళానండి అత్తయ్యగారూ! అక్కడే చూచి మాట్లాడాను". అన్నాను.

"మా అల్లుడు / గుంటూరులో ఎందుకున్నాడు నాయనా ?" అని అడిగింది ఆవిడ ఆశ్చర్యపోతూ.

అరే ! గుంటూరులో లేడా ఏం కర్మం ! అతనికి గుంటూరులోనేనే ఉద్యోగం ! అని అనుకొని చప్పున తెప్పరిల్లి, "ఏమండీ, అత్తయ్యగారూ అల్లా అడిగారేం?"అన్నాను.

"ఆయనకు సత్తెనపల్లి బదిలీ అయిందిగా, అందుకనేగా అమ్మాయిని పుట్టింటికి పంపి ఒంటరిగా వెళ్ళాడు !" అన్నది.



"నేను ఏడ్చినప్పుడల్లా ఏదో లాభిస్తూనే ఉంటుంది."

"అదేమిటే, ఏడిస్తేలాభమా ?"

"ఆఁ. నేను ఏడ్చినప్పుడల్లా, వారు ఏదో తెచ్చిఇస్తూనే ఉంటారు."

---

చచ్చాను. వాడికి సత్తెనపల్లికి బదిలీ అయిన సంగతి నాకేంతెలుసు! గుంటూరులో ఉన్నాడనుకొన్నాను ! ఇప్పుడేమని చెప్పేది!

భగవంతుడు తెలివంటూ ఒకటిచ్చాడు కాబట్టి సరిపోయింది. చప్పున తడువుకోకుండా అన్నాను. "అవునండీ నాకు తెలుసు ఆసంగతి. కాని మళ్ళీ గుంటూరుకే వేయించుకొన్నాడు. ఆ సంగతి మీకు తెలియదా?" అని అడిగాను.

కేశవరావు అత్తగారికి ఆశ్చర్యం కలిగింది. నిజమే కామాలు అనుకొంది."అట్లాగా నాయనా ఆ సంగతి తెలియదే !" అన్నది.

"నన్ను చెప్పమన్నాడండీ !" అన్నాను గర్వంగా.

"సరె, సరె. అమ్మాయిని సత్తెనపల్లికి పంపమని వ్రాయలేదామా అని అనుకుంటున్నాము, ఇదా సంగతి !" అని నాతో అని, అమ్మాయ్-అని కూతురును పిలిచి "నీ మొగుడికి మళ్ళీ గుంటూరు బదిలీ అయిందటే తల్లీ" అని చెప్పింది.

ఆ అమ్మాయి ఆశ్చర్యంతో చూచి ఊరుకొన్నది.

"ఏమమ్మా కులాసాగా ఉన్నావా?" అని పలకరించాను ఆ అమ్మాయిని నేను.

ఆ అమ్మాయి నన్ను బావగారూ అని పిలుస్తుంది. అందుకని నా ఎదుట కాస్త సిగ్గు పడుతూ నుంచుని, "ఆ కులాసాగానే ఉన్నానండి" అన్నది.

"ఇంకా ఏమి కబుర్లు చెప్పాడు నాయినా మా అల్లుడు?"

"మరేంలేవు_అంతా కులాసాగా ఉన్నారు" అన్నాను. ఏమిచెప్పాడని చెప్పేది! ఏమీ తోచలేదు.

"అయితేచూడు అబ్బాయ్, పిల్లను పంపి నెలరోజులైందిగదా. తీసుకుని వెళ్ళలేదు సరిగదా, ఒక్కసారి అయినావచ్చి చూచిపోలేదు. ఇదేమైనా బాగుంది నాయినా నీవేచెప్పు?" అని అడిగింది ఆవిడ.

-కేశవరావూ నేనూ అన్నదమ్ములకంటే ఎక్కువగా ఉంటున్నప్పుడు, అతనిమీద మాటపడనియ్యక పోవటం నాధర్మం. అతడు నెలరోజులనుంచి ఒక్కసారి అయినా రాకపోవటానికి తగినంత కారణం చూపవలసిన బాధ్యత నాపైన పడ్డది. మెదడు చురుగ్గా పనిచేయవలసిన అవసరం వచ్చింది. అతడు భార్యను చూడటానికి రాలేదు! దానికి కారణం వాళ్ళకు వచ్చేది చెప్పాలె. అదొకపని. దాని తరువాత "కాస్త ఓ వందరూపాయలు. అవసరంగా కావలసి వచ్చినై అండి అత్తయ్యగారూ" అనేయాలె మాటల్లో కలిపి. ఆవిడ "దానికేం భాగ్యం నాయినా!" అంటుంది. అప్పుడు నేను ఊరుకోకూడదు.

"మళ్ళీ పదిరోజుల్లో ఇచ్చేస్తానండోయ్. నా సంగతి అంతే. కావలిస్తే మా మరదలును అడగండి నా సంగతి ఎటువంటిదో?" అని కూడా అంటినా, ఈ అప్పు అడగటం అనే దరిద్రపుపని, నవ్వుతూ నవ్వుతూ జరిగిపోతుంది.

అని ఇల్లాగ ముందు జరగవలసిన వ్యవహారం క్రమం కూడా నిర్ణయించుకొన్నాను.

బుద్ధి నిశితంగా పనిచేయటం మూలాన ఈ ఆలోచన అంతా క్షణంలో జరిగిపోయింది. ఇకముందు విషయం-కేశవరావు పెళ్ళాన్ని చూడటానికి ఎందుకురాలేదు. దానికి కారణాలు చెప్పాలె. ఇట్లా అన్నాను నవ్వుతూ. "ఆ విషయం నాకు చెప్పాడండి అత్తయ్యగారూ. ఈ నెలరోజుల్లో ఎంత ప్రయత్నం చేసినా వాడికి సెలవ దొరకలేదట. అందుకనే రాలేదండి." అన్నాను. నాబుద్ధి అంతా వినియోగిస్తే దొరికిన కారణం అది. ఆమె మూతి త్రిప్పి, "ఆ అంత రావాలే అనుకుంటే ఓ ఆదివారం వచ్చి చూచిపోకూడదా ఏమిటి?—ఏమంత పెద్ద దూరమని!" అన్నది.

నేను చెప్పింది తృప్తినిచ్చే కారణం కాలేదు. ఆవిషయంలో వాళ్ళను ఏదో విధంగా తృప్తిపరచకుండా నా డబ్బుసంగతీ ఎట్లా ఎత్తేది?

అందుకని అన్నాను. "మీరు అన్నమాట నిజమే. ఇంకో విషయంకూడా ఉంది లెండి రాకపోవటానికి"అన్నాను."ఏమిటినాయినా?" అని ఆదుర్దాగా అడిగింది ఆమెగారు.

"ఆఁ — మరేమిలేదు. వాళ్ళ అమ్మకు కాస్త వంట్లో కులాసాగా లేదుట! అందుకని రాలేకపోయినాడు" అన్నాను.

ఈ మాటలు విని, కేశవరావు అత్తగారూ భార్యా కూడా ఏదో రకంగా చూశారు

నావంత. వాళ్ళ కళ్ళల్లో వ్యక్తమైన భావం ఆశ్చర్యమో, అనుమానమో, నాకు తెలియ లేదు. వాళ్ళు ఇద్దరూ కూడా, ముసలావిడకు జబ్బుచేసిందని, భయపడుతున్నారని నేను అనుకొన్నాను. అందుకని, మళ్ళీ అన్నాను, "మరేం భయపడవలసిన అవసరం లేదండీ అత్తయ్యగారూ! ఆవిడకైనా, పెద్ద జబ్బు ఏమీ కాదులెండి. ఏదో కొంచెము దగ్గు పడిసెము అయి ఉంటుంది" అన్నాను.

ఈ మాట విని ఆమె అడిగింది. "ఎవరికి జబ్బుగా ఉందంటున్నావు? మా వియ్యపురాలుకా?" అన్నది ఏదో తమాషాగా చూస్తూ.

"అవునండీ." అన్నాను.

కేశవరావు అత్తగారు ఎందుకో నవ్వుకొన్నది.

ఆ అమ్మాయి మటుకు కాస్త పెద్దగానే నవ్వింది.

వాళ్లు ఎందుకు నవ్వుతున్నారో నాకు అర్థంకాలేదు. కొంచెము జలుబు చేస్తే, "జబ్బు"గా ఉన్నదని అన్నాననా?.... ఆ మాత్రానికే కేశవరావు హడిలిపోయి భార్యను చూడటానికి రాకపోవాలా అని అనుకొనా? ఎందుకు నవ్వుతున్నారో నాకు బోధపడలేదు.

నేను ఎక్కడో పొరపడ్డా ననుకొని కొంచెం గాబరాపడ్డాను. కొద్దిగా జలుబు చేస్తే, "జబ్బుగా ఉన్నదీ" అని పెద్ద మాట ఉపయోగించినందుకే నవ్వుతున్నారు అనుకొన్నాను. అనుకొని నా మాట నిలుపుకొంటానికి, "దగ్గూ పడిసెమే కాదులెండి, జ్వరంకూడా వస్తున్నది" అన్నాను.

ఇల్లాగ అనటం మంచిదేనని అప్పటికి నేననుకొన్నాను. నేను "జబ్బు" అనేమాట తెలివితక్కువగా ఉపయోగించలేదని వ్యక్తమౌతుంది ఈ జవాబువల్ల. అంతేకాక కేశవరావుభార్యను చూడటానికి రాకపోవటానికి తగినంత బలమైన కారణమూ చెప్పినట్లు అవుతుంది. మొత్తము మీద తెలివిగానే జవాబు చెప్పాను అనిపించింది.

కాని వాళ్ళు ఇద్దరూకూడా, నవ్వటం మొదలుపెట్టారు. అదేనాకు అర్థంకాలేదు. దేనికి నవ్వుతున్నారు?

అప్పుడు-ఆ పిల్ల అన్నది నవ్వు ఆపుకొని "అయితే బావగారూ, జ్వరంఅంటే బాగా నూటమూడు, నూటనాలుగు వస్తున్నదా?" అన్నది.

ఇక్కడే నేను కొంచెం ఆలోచించవలసి వచ్చింది. ఆవిడకు ఎంత జ్వరం వస్తున్నదని చెప్పాలే అని ఆలోచించాను. కాస్త ఎక్కువగానే వస్తున్నదని చెప్పటమే మంచిదని తోచింది. వెంటనే అన్నాను. "నూటరెండు, రెండున్నర అల్లాగ వస్తున్నదమ్మా" అని.

ఆ అమ్మాయి మరీ విపరీతంగా నవ్వింది. "అత్తగారికి జబ్బుగాఉంటే, కోడలుకు నవ్వులాటగాఉంది కాబోలు!" అన్నాను, కొంచెం వేళాకోళంగా! ఆ అమ్మాయి నాకు మరదలు వరసేగా! అందుకనే అట్లా అన్నాను. కేశవరావు తల్లిమటుకు తెల్లబోయి చూస్తున్నది. ఆ అమ్మాయి మళ్ళీ ఇంకొకసారి నవ్వు ఆపుకొని "అయితే, బావగారూ అసలావిడ ....లేచి తిరుగుతున్నదా. లేకపోతే........ మంచానే పడి ఉన్నదా?" అని మళ్ళీ ప్రశ్నించింది.

"నూట రెండు జ్వరం వస్తుంటే, లేచి ఎట్లా తిరుగుతుందమ్మా! అందులో పెద్దది కదా?" అన్నాను.

"అల్లాగా అండీ బావగారూ, మా అత్తయ్యకు అంత జబ్బుగా ఉందండీ!" అని అంటూ ఆ అమ్మాయి విరగబడి నవ్వింది.

"ఇంతలో ఎవరికే అమ్మా జబ్బు?" అంటూ యాభై ఏండ్ల ముసలమ్మ లోపలి నుంచి వచ్చింది. "మీకేనండి అత్తయ్యా. మీకు, దగ్గూ, పడిసెమూనట!" అని కేశవ రావు భార్య విరగపడి నవ్వింది.

"నాకు జబ్బేమిటే?" అన్నది ఆముస లమ్మ.

"మీకు జబ్బుగా ఉందిటండి! నూట రెండు జ్వరంకూడా వస్తున్నదట! ఈయన చెబుతూ ఉంటేనే మా బావగారు" అని మళ్ళీ నవ్వింది ఆపిల్ల.

ఆవచ్చిన మనిషి కేశవరావుతల్లి అని నేను గుర్తుపట్టేసరికి గుండెలు జారిపోయినవి.

ఛా, ఛా, ఛా, నేను వేసిన ప్లాను అంతా పాడైపోయింది. ఈ ముసలమ్మగారు వచ్చి నట్లు ఏమాత్రం తెలిసినా నాకు ఈ దరిద్రపు స్థితి వచ్చేది కాదు.

ఇంకా ఏ ముఖం పెట్టుకొని నూరు రూపా యలు అప్పు అడిగేది!

అక్కడ ఒక్కనిమిషమైనా ఉండలేక పోయినాను. "మాట నాయినా, ఏమిటి సంగతి?" అని కేశవరావు తల్లి అంటున్నా వినిపించుకోకుండా గబగబా వచ్చేశాను.

ఇంటికొచ్చి ఏవో రెండు మెతుకులు తిని ముడుచుకొని పడుకొన్నాను. అసలే నేను, నా పని నవ్వులపాట్లు అయిందేనని, సిగ్గుపడి చస్తూ ఉంటే ఆవిడగారు ఒకటేగోల ఏమిటి అల్లా ఉన్నారు చెప్పమని!

ఏమని చెప్పేది? ఏం ఘనకార్యం చేశా నని చెప్పేది!

ఆవిడ చెప్పమని ఒకటే పట్టు బట్టింది. చివరకు చెప్పాను సంగతంతా.

జరిగిన అవమానాన్ని గురించి, భార్యతో ఎవరైనా చెప్పుకుంటారా, తెలివితక్కువ తనం కాదా అని ఎవరైనా అనవచ్చు.

ఆవిడమీద ఎంత ప్రేమ లేకపోతే నేను అంత కష్టపడతాను! ఆ విషయం గ్రహించి, నేను పడ్డ శ్రమనే ఆమెగారు కానుకగా స్వీకరిస్తుందని నేను ఆశించాను.

కాంతం, కానేపు నవ్వి, "మీరు ఇంత పిచ్చివాళ్ళేమండీ?" అన్నది.

"ఇంత శ్రమపడ్డా నేను పిచ్చివాణ్ణే అయి నాను?" అన్నాను ఆమెవంక దీనంగాచూస్తూ.

"కాకపోతే ఏమిటి చెప్పండి. ఇవ్వాళిటి రోజున మీరు నాకు ఏమీ కొనియ్యనక్కర లేదే!" అన్నది.

'ఏం?—' అన్నాను ఆశ్చర్యంగాచూస్తూ.

"నేను పుట్టినరోజు పండగకేమన్నా, మీరు నాకు కానుక ఇయ్యాలె. తెలిసిందా?"

"ఆ........"

"నేను మెట్టినరోజు పండుగకేమన్నా, నేనే మీకు ఇయ్యాలె."

"నాకేంతెలుసూ ఇదంతా?"

"ఏమీ తెలియదండీ. మీకు!" అంటూ ముఖంమీద చెయ్యివేసి, బుగ్గలునొక్కి "జరగండి" అన్నది మా కాంతం.






పాత్రలు

| | |
|---|---|
| పురుషోత్తం | ప్రసాదు |
| సత్యనారాయణ | వెంకన్న |

మహేశం

రంగం — హాలు

[పెద్దహాలు. ముందు వరండా. వరండాలోకి బయటినుంచి ఎక్కిరావటానికి నాలుగైదు మెట్లు. మెట్లకు పదిగజాలదూరంలో బజారు.

వరండాలో పూలమొక్కల తొట్లు, రెండు కుర్చీలు. హాలులో దక్షిణపు కిటికీవద్ద పెద్ద టేబులు కుర్చీ. హాలు దక్షిణభాగంలో గోడల కానించి ఏడెనిమిది సోఫాలు. గోడలమీద విశ్వరూపసందర్శనం, శ్రీ కృష్ణుని గీతోపదేశం, గాంధి బొమ్మ వేలాడుతుంటాయి. హాలులోనుంచి లోపలి యింట్లోకి వెళ్ళటానికి కుడివైపున ఒకవాకిలి; ఎడమవైపున ఒక వాకిలి. హాలు ఉత్తరభాగంలో చిన్న టేబులు మీద ఫోను ఉంటుంది.

వెంకన్న మోకాళ్ళదాక పంచె ఎగగట్టి బనియను తొడుక్కొని వాటర్‌కాన్‌తో వరండాలోని పూలతొట్లలో వంగి నీళ్ళు పోస్తుంటాడు. బుజంమీదనుంచి జారే తుండుగుడ్డను పైకి లాక్కొంటూ ఉంటాడు. వయస్సు 56 సంవత్సరాలకు తక్కువఉండదు. తల రాగడి బుగ్గపుస్తీలు పూర్తిగా నెరిసి ఉంటాయి.

సత్యనారాయణ అప్పుడేవచ్చి వీధిలో నిలబడతాడు. అతడు అంత పొడుగూకాదు, పొట్టీకాదు. కళ్ళకు లావాటి అద్దాలు, కాళ్ళకు బూట్లు, పైజమా, పొడుగాటి అరచేతుల చొక్కా ఉంటాయి. వయస్సు 32 దాకా ఉంటుంది.]

సత్యనారాయణ: ఏమోయ్ వెంకన్నా! బాగున్నావా?

వెంకన్న. (శేరి పారజూస్తూ) యవరది? ....సత్తెం అఁ, అఁ, బాబుగారా? యన్నాళ్ళకెన్నాళ్ళకుచూశాను. పరాయివాళ్ళల్లే అలా వీధిలోనిలబడ్డారేంది? రండి. సత్తెం బాబు గారూ, రండి.

స. (ముందుకువచ్చి వరండా మెట్లమీద నిలబడి) పెద్దబాబుగా రున్నారా?

వెం. రండి బాబుగారూ. లోపలికిరండి. యంత కాదనుకున్నా. యంత మాట పట్టింపులు వచ్చినా, ఇంటి అల్లుడివిగందా. గుమ్మం యెక్కకుండా అలా నిలబడితే .... లోకుల

సంగతి అలా ఉంచండి. ముందు మీరు గుమ్మం యెక్కకపోయారా, తిమ్మ చంపుకు తిన్నట్టే.

స. ఆదేమిటి వెంకన్నా, ఏమంది వచ్చిన వాడు రాకుండా పోతాడా? (వరండా కుర్చీలో చతికిలబడుతూ) ఇంతకూ పెద్దబాబుగారు ఉన్నారో లేదో చెప్పావుగావేం?

వెం. అడిగో, ఇక్కడ కూర్చుంటారు? (చెయ్యి పట్టుకొని) రండి లోపలికి.

స. బలవంతంచేస్తేగాని రానా యేమిటి?

వెం. ఏమో నమ్మకమెట్లా? నిజంగా వచ్చేవాళ్లే అయితే యిన్నేళ్ళు యిటుకేసి యెందుకు తొంగిచూడకుండా వుంటారు? దూరాభారం అయితే అనుకోవచ్చు. పూళ్ళోనే గందా వుండి!

స. తీరికఉంటే గంటగంటకు వద్దును. (వెంకన్న వెనకనే వెళ్ళి హాలులో పెద్ద టేబులుకు దగ్గర్లో ఉన్న సోఫాలో కూర్చుంటాడు.)

వెం. యిదిగో. యిటుచూడండి! యేదీ, నవ్వకుండా చెప్పాలి.

స. (నవ్వుతూ) ఏమి చెప్పమంటా?

వెం. ఈ ఆరేళ్ళనుంచి మీకు ఒక గంట పేపు పీలు చిక్కకపోయిందా? అసలు కడుపులో వుండాలిగాని.

స. కడుపులో లేక ఏడకపోతుంది వెంకన్నా!

వెం. యెందుకు చెబుతారు, యీ కబుర్లు! పెద్దబాబుగారూ, మీరూ యేదో అనుకున్నారే అనుకోండి. పత్తెంబాబుగారు, మిమ్మల్ని యింతప్పటినుంచి యెత్తుకు మోశానుగందా! తిప్పమన్నచోటికల్లా తిప్పాముగందా! ఈ ముసలాడు యేమయ్యాడో, యెలావుండాడో, అసలు వుండాడో పోయాడో కనుక్కున్నారా? యెందుకులెండి.....

స. అన్నీ తెలిసినవాడివి నువ్వే అలా విష్టురాలాడితే....

వెం. అవునులెండి, అత్తగారి చావులకు రానివారు, యీ ముసలాణ్ణి చూట్టానికివస్తారట లెండి. యక్కడే వుండండి, ఇప్పుడే వస్తా. పోయారంటె వొట్టు. (హాలు ఎడమ వాకిలి దగ్గరకు వెళ్ళుతుంటాడు)

స. ఇంతకూ పెద్ద బాబుగారున్నారో, లేరో చెప్పావుకావేం?

వెం. బయటికెళ్లారు. యెల్లి చాలా సేపయింది. యీ పాటికి వస్తుండాలికూడా.
(సత్యనారాయణ సోఫానుంచి లేచి నిలబడతాడు) బయలు దేరుతున్నా రేమిటి, యీల్లేదు.

స. కాదు వెంకన్నా. పనుంది. మళ్ళీ వస్తానుగా.

వెం. (తిరిగివచ్చి సత్యనారాయణ చేయి పట్టుకొని) యీల్లేదు. యిన్నేళ్ళకు వచ్చి గుక్కెడుకాపీ అన్నా తాకుండా పోతానంటే? లేదు, యీల్లేదు. యీ ముసలాడిగొంతులో పూపిరుండగా అలా యీల్లేదు. ముమ్మాటికి యీల్లేదు.

స. (నవ్వుతూ) నిజంగా కొట్టేట్టున్నావే.

వెం. కొడతానో లేదో తరవాత సంగతి. ముందు కాపీతాగందే కదలటానికి యీల్లేదు.

[లోపలినుంచి ఒకలేతగొంతుఒకముదురు గొంతు వినిపిస్తాయి.

లేతగొంతు: వచ్చాను మామయ్యా, వచ్చా!

ముదురుగొంతు: ఎవరు రమ్మంటే వచ్చావురా? లేతగొంతు: నువ్వురమ్మంటే రావటానికి, పొమ్మంటే పోవటానికి నీయింట్లో జీతగాణ్ణనుకొన్నావా?

ముదురుగొంతు: అబ్బో, చాలదాకా ఉందే వ్యవహారం!]

స. (కుడివైపు తలుపువంకచూస్తూ) ఎవరది వెంకన్నా?

వెం. చినబాబుగారుకాదూ. మీరు వచ్చా రని చెబుతా.

(కుడివేపు తలుపుదగ్గరకు వెళ్ళుతాడు.)

స. ఇప్పుడు దేనికిలే. మీపెద్ద బాబుగా రితో ఒంటరిగా మాటాడవలసి ఉందికూడా.

వెం. సరే; నేను కాఫీతెస్తా. యీలోగా పోయేరు. పోతేతెలుసుగా. ప్రాణాలతో కాక పోయినా, చచ్చిదయ్యంగానైనా పట్టుకుంటా. తరువాత మీయిష్టం.

(సత్యనారాయణ వంక చూస్తాడు.)

స. సరే, తప్పేదేముంది? (వెంకన్న యీమాట చెవినివేసుకొని ఎడమవేపు తలుపు తెరుచుకొని లోపలికి వెళ్ళుతాడు. కుడివైపు తలుపుగుండా వెనకటి రెండుగొంతులు మళ్ళీ వినిపిస్తాయి.)

లేతగొంతు. తాతయ్యేడీ? ఎక్కడకు పోయాడు?

ముదురుగొంతు. కాస్త గుర్రాన్నికట్టెయ్యి.

లే. గొం. ఎక్కడకు పోయాడంటె? (సత్యనారాయణ చెవులు రిక్కించి వింటూ ఉంటాడు.)

ము. గొ. ఏం గిరాకి?

లే. గొం. పనుందిగా, చెప్పు.

ము. గొం. ఏమిటాపని, నాతోచెప్పరాదు?

లే. గొం. నువ్వు తాతయ్యవైతే అలాగే చెబుదును.

ము. గొం. కాసేపు తాతయ్యనే అనుకో.

లే. గొం. నిజంగానా?

ము. గొం. నిజంగానే....అబ్బబ్బ ఒరే పిట్టపిడుగా వదలరాజుట్టు.

లే. గొం. కాసేపు తాతయ్యనే అనుకో మన్నావుగా.

ము. గొం. అంటేమాత్రం?

లే. గొం. తాతయ్యతో నాకున్నపనేయిది.

ము. గొం. జుట్టు గుంజటమా?

లే. గొం. గుంజటమేమిటి, పిలక పీకి వాబెయ్యక పోయానా?

ము. గొం. చేసినతప్పేమిటి మహాప్రభూ?

లే. గొం. నన్ను రమ్మని యింటికాడ తేకుండాపోతాడా మరి?

ము. గొం. ప్చ్‌ప్చ్‌ప్చ్, ఎంత పొరపాటు జరిగింది!

(వెంకన్న ఒకచేత ట్రేలో ఇడ్లీపళ్లెం, పచ్చడి గిన్నె, పాసరు, కప్పు, పాలకూజా పంచదారగిన్నె, రెండు స్పూన్లు, రెండోచేత వెండి చెంబుతో మంచినీళ్లు వెండిగ్లాసు తెచ్చి పెద్ద టేబులుమీద పెడతాడు. సత్యనారాయణ కుడివేపు తలుపుకేసి చూస్తూ కూర్చోటంవల్ల వెంకన్న తెచ్చినవి చూడడు.)

స. వెంకన్నా ఎవరాపిల్లాడు? గొంతు ప్రసాదుకు మల్లేఉందే.

వెం. (కాస్త తటపటాయిస్తూ) యేడీ, యేడీ! ప్రసాదువచ్చాడా? యెట్టే రాందే. లేవండి, చేతులు కడుక్కొని కాఫీ పుచ్చుకోండి.

స. కాఫీకి చేతులు కడుక్కోవటందేనికి?

వెం. కాస్త ఫలారంకూడా తెచ్చాను (సత్యనారాయణ టేబులువైపు తిరిగి ట్రేలోని యిడ్లీని కళ్ళతో లెక్కబెడుతుంటాడు) యేమిటి అలాచూస్తారు?

స. (సాగదీస్తూ) ఒకటీ, రెండూ, నాలుగూ, ఆరు.

వెం. యిడ్డెన్లేగా!

స. దేశం అలోలక్షణా అని అఘోరిస్తూ వుంటే....

వెం. ఏ కాపీహోటలు యిడ్డెన్లు మాని వేసింది? సీరంగపీతులకేమి, చాలఉన్నాయి. వాటికేంలే కానీండి.

స. ఇటుచూడు వెంకన్నా, నీదీ కన్న కడుపే. కష్టసుఖాలేమిటో నీకు తెలుసు. ఒక సారి ఆలోచించు. నీకు డబ్బుఉందని దేశంలో ధాన్యమంతా పోవేకొని తిన్నంత తింటూ మిగిలింది యిష్టంవచ్చిన ధరలకు అమ్ముకొంటావా? కోటానుకోట్ల పేద సాదలకు,

పిల్ల జెల్లలకు, ముసలీ ముతకకూ తిండి లేకుండాచేస్తావా?

వెం. అనుకొన్నట్టు అంతా చేస్తే బూలోకం శొర్గం అయిపోతుంది సత్తెం బాబుగారు! కాఫీంది ఆరిపోతాయి.

స. నాకు తినే ఓపికలేదు. పెద్దవాడివి పీల్లేదంటున్నావు కనక యీ కాఫీ తాగుతాలే.

(కుడివేపు తలుపు దభేలున తెరచుకొని ప్రసాదువస్తాడు. వయస్సు తొమ్మిదేళ్ళు. కాకి నిక్కరు. తెల్లని చొక్కా. నడుముకు బెల్టు. కాలికి జోడు. ఎక్కడా జంకు గొంకూ ఉండదు. తండ్రి సత్యనారాయణను చూడకుండానే)

ప్ర. వెంకన్నతాతా, వెంకన్నతాత! ఇడ్లీ పెట్టమంటే ఒకటిచ్చి అయిపోయాయని మిగిలినవన్నీ యిక్కడ దాచావా? అమ్మదొంగా! ఉండు అనిక్కా నీపని చెబుతాలే.

వెం. (ప్రసాదువైపుకు తిరిగి నాన్నగారున్నారు జాగ్రత్త అన్నట్టుగా ముక్కుమీద వేలెట్టుకొని) ఇస్!

స. అరే ప్రసాద్!

ప్ర. నేనే నాన్నగారు!

స. (కోపంతో) వెంకన్నా వీడెలా వచ్చాడిక్కడికి?

వెం. మరిగత్తే....

ప్ర. నేనే వచ్చా నాన్నగారూ. రాగూడదా?

స. ఎవరితో చెప్పి వచ్చావురా గాడిదా? చెప్పా పెట్టకుండా రావటమేనా? అమ్మ నీకోసం దేవుళ్ళాడదూ?

ప్ర. (తప్పుచేసినవాడికి మల్లే నీళ్ళు నములుతూ) అమ్మతో చెప్పాను నాన్నగారు, చెప్పకుండా ఎలా వస్తాను?

స. నిజంగా అమ్మతో చెప్పే బయలుదేరావా? ఏదీ యిటుచూడు, అమ్మ నిన్ను నిజంగా పొమ్మందీ?

వెం. నోరూ వాయి లేని పసివాణ్ణి ఎందుకు అలా గదుముతారు. నేనే వచ్చి తీసుకొచ్చాను.

స. (వెంకన్న చెప్పేది వినిపించుకోకుండానే) చెప్పవేమి మొద్దా! అమ్మ నిన్ను నిజంగా ఇక్కడికి పొమ్మందీ?

ప్ర. (బిత్తరపోయి)నిజంగా నాన్నగారూ, అమ్మ పొమ్మంటేనే నేను ఇక్కడికి వస్తున్నా.

స. (ఆశ్చర్యంగా) ఎన్ని రోజులనుంచి వస్తున్నావేమిటి?

ప్ర. అప్పుడప్పుడు వస్తూనేవున్నా.

వెం. పసికాయను యెందుకలా కోప్పడుతారు? పెదబాబుగారు ప్రసాదునుచూడందే వుండలేరు. అందుకని పది పదిహేనురోజులకొకసారి నేనే వచ్చి తీసుకొస్తున్నా. పిల్లకాయ తప్పేముంది సత్తెంబాబుగారు?

స. పాముచుట్టం, పడగ పగ—బాగానే ఉంది వ్యవహారం. అరే ప్రసాద్; నీకేచెప్పేది; తిన్నగా ఇంటికి నడు.

ప్ర. ఇప్పుడే వెళ్ళుతున్నా, నాన్నగారూ. (నిక్కరు రెండుజేబుల్లోకి రెండు చేతులుపెట్టి లోనఉన్నవి ఒక్కొక్కటీ బయటికిలాగుతూ. ఇదిగో వెంకన్నతాతా, మొన్న పానయ్య దగ్గర యీ బొంగరం తీసుకున్నాను. నాకు తిప్పట ఏం చేతగావటంలా. ఈతడవ వచ్చినప్పుడు నేర్చుకుంటాగాని, యివిగో రంగు చాక్పీసులు: ఎర్రయ్యి రెండు, పసుపుపచ్చయ్యి రెండు, ఆకుపచ్చది ఒకటి, తెల్లయ్యి మూడు. ఇదిగో ట్వైనుదారం. గాలిపటం కడతానన్నాడు. నేనుమళ్ళీ వచ్చేటప్పటికి కట్టమను. ఇవన్నీ యిస్తావుగాదు! గూటిలోపెట్టి మరిచిపోతావా? మళ్ళీవచ్చి కనుక్కుంటాగా? మొత్తం పదకొండు.



వెం. (ఏడుపు బిగబట్టుకొంటూ) యవరి కిచ్చేది బాబు?

ప్ర. ఎవరికేమిటి. పానయ్యకి.

వెం. (తుండుగుడ్డ ముఖానవేసుకొని బావురుమంటూ) యింకాడ పానయ్య నాయనా?

ప్ర. ఏమయ్యాడు. ఊరికి పోయాడా? వచ్చింతరువాతనే యియ్యిలే. వెంకన్నతాతా మొత్తం ఉరువులు పదే, పదకొండు కాదు. జాగ్రత్తగా యివ్వవని అలా అన్నాలే.

స. ఈముసలివాణ్ణి ఎందుకు వేధిస్తావురా. ఆ పిచ్చివాగుడు కాపేపు కట్టెయ్యి.

ప్ర. నేనేం చేశాను నాన్నగారూ? పానయ్యకు ఇవి యిమ్మన్నాను. ఈబొంగరం పానయ్యదే. అతనిబొంగరం అతనికిచ్చెయ్యక పోతే తప్పుకాదూ?

స. పానయ్య లేడురా.

ప్ర. నేను చాక్లెట్లు తెచ్చేదాకా ఎక్కడికీ పోనన్నాడు నాన్నగారూ. పానయ్య మాట అన్నాడు అంటే అంతే. చేసి తీరతాడు. మీకు తెలీదుకామాలు.

స. అబ్బబ్బ నీతోవేగలేకుండా ఉన్నామురా. పానయ్య చచ్చిపోయాడు.

ప్ర. అంటే.

స. చచ్చిపోయాడంటే చచ్చిపోయాడు. ఏమిచెప్పేది నీ నెత్తి నానెత్తీని.

ప్ర. పాపయ్యకేం వెంకన్నతాతా? క్రిందటి సారి వచ్చినప్పుడు మేమిద్దరం ఆడుకున్నాము. బొంగరం ఎంత బాగా వేశాడని!

వెం. అప్పుడు బాగానే ఉన్నాడు బాబు.

స. పాపయ్యంటే నీ మనవడు కాదూ? పాపం ఏమివచ్చింది?

వెం. ఏమిచెప్పేది బాబు! గిలకలాగా తిరిగి ఆడుకుంటూ ఉండేవాడు. అలా ఆడుకొనే వాడికే నాలుగురోజులు మంటజెరం పుట్టుకొచ్చింది బాబు. నాకు మొదటినుంచి అదేమిటోగాని దక్కుదక్కు మంటూనే వుంది. అందుకని పెదబాబుగారి డాకటేరు దగ్గరి కెళ్ళితే ఆయన ఏదోయిన్ని మందుపిళ్ళు యిచ్చారు. అయి పోస్తూనే వచ్చాం. అయిదో రోజుకల్లా మాటపలుకు లేకుండా అంకెళ్ళు పడిపోయాయి.

స. డాక్టరుకు చూపించలేదా?

వెం. లబ లబ లాడుతు అయిదోరోజు సాయంకాలం వాణ్ణి బుజానవేసుకొని డాకటేరు దగ్గరకు తీసుకెళ్ళాం. ఆయన చూసి చప్పరించాడు. నేనూ మాబుద్దది ఏడుస్తూ ఆయన కాళ్ళమీదపడ్డాం. మందు తెచ్చుకోండని ఒకేమందు మూడుగొట్టాలు రాసిచ్చాడు. ఆచీటి పట్టుకుని బజారుకుపోతే ఒకచోట నలభైరూపాయలు పుచ్చుకొని ఒకటేగొట్టం యిచ్చి యికలేవన్నాడు. పక్కకొట్లలో కనుక్కొంటే నూట యిరవై, నూటముప్పై చెప్పారు. చూడండిబాబు యాడుందో న్యాయం. యింకేమిచేసేది. చేతిలోవున్న నాలుగురాళ్ళు పెట్టి ఆరెండు గొట్టాలుకూడా కొన్నాను. ఆరోనాటి సాయంకాలానికల్లా మందుతాగి కూడా పోయాడు. బాబుగారు. కుర్రాడికి కుర్రాడికి చెడ్డాను, డబ్బుకు డబ్బూ చెడ్డాను.

స. ఇదీ సంఘం! పచ్చినెత్తురు తాగే మేకమన్నా నయం.

ప్ర. డబ్బంతా ఖర్చుపెట్టావా తాతా? రేపు రోగమో నొప్పో వస్తేనో?

వెం. యిక ఎన్నుమీదికి యాగాడికూడా లేదు బాబు. లేదనుకుని లాభం యేముంది. ముందెట్టా జరగాలినుందో అట్టా అవుద్ది. ఇంకా యేమిచెయ్యను.

స. ఇంకా చేసేదేమిటి. సిగ్గాకూడు! సంఘమంతా యీమూలనుంచి ఆమూలదాక కుళ్ళి లుకలుక లాడుతుంటేను. దయ, ధర్మం, మంచి, చెడ్డా యేనాడో అంతరించాయి. వెంకన్నా, నీవంటివాడికి ఈసంఘంలో తావు లేదు. నిజంగాలేదు. ఇలాంటిసంఘాన్ని నిర్మూలంగా పెరికివేయకుండా ఉండటం నీదేతప్పు. ముమ్మాటికీ నీదేతప్పు.

వెం. (పై తుండుగుడ్డతో కళ్ళు తుడుచుకొని) మా దేముంది బాబు, ఒకచదువా, సంధ్యా? గొడ్లుయంతో మేము అంతేగందా. మాసంగతి పోనీండి. మీరంతే చక్కగా చదువుకున్నారు. చుట్టరికం చూదామా లక్షాధికారికి అల్లుళ్ళు. మీకింత అవస్థ ఎందుకు వచ్చినట్టు. ఒకరకంగా చూస్తే నాపనే బాగుందేమో ననుకొంటాను.

స. (నవ్వుతూ) అదేమిటి వెంకన్నా. నాకన్నా నువ్వు ఎందుకు బాగుండగూడదు? నిజంగా నీకులేనిసుఖం నాకెందుకుండాలి?

వెం. ఎందుకు బాస్తారు? నాకు తెలుసులెండి. యాలకు బొక్కెడన్నమన్నా తింటున్నాను. సత్తెంబాబుగారు. నేనుకళ్ళారచూస్తున్నాను. ఇంట్లో ఉప్పుకుంటే పప్పుకులేక, పప్పుకుంటే బియ్యానికిలేక అమ్మాయి అవజీవాలు కుంగిపోతూవుంది. కలవారింటి ఆడ

వేరుచుకు పిల్లలచొక్కాలకు, పసిపాప పాల బుడ్డికి లేకపోతే మనస్సు యెలావుంటాదో తూడండి. మానవులాలు యక్కడన్నాపొఱ్ఱ టుండా. ఆ యీశ్వరుడికక్కడా తెలుసునంటే నాకు నమ్మకంలేదుబాబు. రేషను తగ్గించాక యిచ్చే నాలుగ్గింజలు పిల్లలికే సరిపోతుండాలి. యింకా యెంతకాలానికి యీ చెరవిరగడద్ది సత్తెంబాబూ?

స. ఏమిచెయ్యమంటావు వెంకన్నా? ఈఆరేళ్ళనుంచిఉద్యోగం దొరుకుందేమోనని తిరుగుతూనేవున్నా. సూదిమోపే సందైనా కనిపిస్తేనా?

వెం. బాబు నామాట వినండి. ఎప్పుడో కోపంలో అనుకొన్నమాటలు పట్టుకు ప్రాకులాడటం దేనికి చెప్పండి. లోకం యట్టాపోతే యేమిపోయింది. మీరు తెక్కలు విరుచుకొని కడుపు మాడ్చుకొంటేమాత్రం బాగుపడద్దా బాబు.

(మహేశం లోపలినుంచే వెంకన్నా అని పిలుస్తూ కుడివేపు తలుపుతెరుచుకొనివస్తాడు. ఎర్రగా కొంచెం బొద్దుగాఉంటాడు. వయస్సు 28 దాకా ఉంటుంది. వెనక బిళ్ళగోచీ. ముందు నేలకు జారుకాడే కుచ్చెళ్ళు. సన్నని లాల్చి. కోడిపిలాంటి ముక్కు. కాళ్ళకు ఇంట్లోవేసుకు తిరిగే అకుచెప్పులు. చేతిలో వేలు పుటలమధ్యపెట్టి పట్టుకున్న పుస్తకం.)

మహేశం. వెంకన్నా, నీళ్ళుపెట్టు. ఎన్ని రోజులైంది స్నానంచేసి! ఈ సాయంకాలం చేద్దాం. ఈసాయంకాలంచేదాం అనుకుంటూ ఉంతగానే మూడు సాయంకాలాలు గడిచి పోయాయి.

స. ఇంకా నాలుగురోజులు అలాగేఉండు. ఏం పరవాలేదులే. (ఉలిక్కిపడి సత్యంవేపు చూస్తాడు)ఎందుకు అలా ఎగాదిగాచూస్తావు?

మ. (నవ్వుతూ) బావేనా అని.

స. పెద్దవాడివి అయిపోయావుకాబట్టి చూపు ఆనదులే.

మ. బావవచ్చాడని చెప్పలేదేం వెంకన్నా. ఎంతసేపయింది వచ్చి?

స. ఇప్పుడేరా.

మ. ఇప్పుడేనా? ప్రసాదు పావుగంటసేపునుంచి మెదలకుండాఉంటే ఏమిటా అని చూస్తున్నాను. ఇదా సంగతి!

ప్ర. ఏమి గోలచేశాను మామయ్యా. అన్ని కల్పనలుగాని.

స. కల్పనచేయందే కవి యెట్టా అవుతాడురా?

మ. అప్పుడే బాబు కొడుకులు ఏకమయ్యారు. కానీండి! సరేకాని వెంకన్నా చుట్టంవస్తే కాళ్ళకు నీళ్ళిచ్చుకోరు?

వెం. మతిపోయింది చినబాబుగారు. యేదో మాటల్లోపడి మరిచిపోయాను.వుండండి తెస్తా.

స. నీకు నిజంగామతిపోయింది వెంకన్నా. కాఫీకూడా అయితే యిప్పుడు కాళ్ళకు నీళ్ళిందుకు. అదిగో ముద్దులబావమరిది రానిరాని అవు రావురుమంటూ వస్తాడని యిద్దెన్లుకూడా అట్టిపెట్టాను.

మ. బావ మాటలకేమిగాని, నీవుపోయి నీళ్లుపెట్టు వెంకన్నా.

వెం. వేన్నీళ్ళుపెట్టేదా,చన్నీళ్ళుపెట్టేదా? వేన్నీళ్ళయితే కాస్త ఆలస్యం అవుద్ది.

మ. నీ యిష్టంవచ్చినవి పెట్టు.

వెం. అయితే వేన్నీళ్ళే పెడతాలెండి. (ఎడంవైపు తలుపు తెరుచుకొని లోపలికి వెళ్ళిపోతాడు)

మ. ఏమిరా ప్రసాద్, మూలచేరి చాల బుద్ధిమంతుడులాగా కూర్చున్నావే! నాన్న గారు వచ్చారనా?

ప్ర. నాన్నగారు వస్తేమాత్రం ఏమం టారు?

స. ఏమిరా మహేశం, ఏమిటివిశేషాలు? ఒకనాడన్నా వచ్చి తొంగి చూదావుకావే. 'మీ నాన్నగారు పోవద్దన్నారా? లేక వస్తే ఒకపూటన్నా అన్నం పెట్టలేమనుకున్నావా?

మ. నువ్వు నాన్నగారు పోట్లాడుకుంటే మధ్య నాకేమిటి? అంత యిష్టంలేకపోతే ఆయన రాకపోతాడు. ఆయన గుమ్మం నువ్వు తొక్కకపోతావు. అంతేగాని నన్ను పోవద్దనటానికి ఆయన యెవరు?

స. కొయ్యకు కోతలు. ఆయనతో అను యీ ముక్క.

మ. అనాలని అంటున్నావుకాని నిజం నీకు తెలీదా?

స. అయితే ఒకసారి కాపోతే ఒకసా రన్నా యెందుకు రాలేదు?

మ. వస్తేమాత్రం నువ్వు ఇంటిదగ్గిర దొరుకుతావా, పెడతావా? ఎప్పుడూ కూలీలనీ, వాలీలనీ, మీటింగులనీ, అవనీ, యివనీ, తిరుగుతుంటావయితివి. పోతే ప్రసాదును చూస్తూనే ఉన్నాగా?

స. ఏదో సాకుచెబుతున్నావు కాని మీ అక్కయ్య లేదటరా? ఎప్పుడూ తమ్ముడు కోసం కలవరిస్తుంటుందే!

మ. నిజంచెబితే ఏమనుకోవుగదా?

స. అనుకోటం దేనికి?

మ. నాకు మనస్సు ఏమీ బాగుంటంలేదు.

స. ఒకప్పుడు బాగుంది కనకనా?

మ. అలాకాదుబావా. చూడగా చూడగా ఏమిటేమీటో అనిపిస్తూవుంది.

స. ఒకసారి విశాఖపట్నం పోయి రాక పోయావా?

మ. నీకు నిజంచెబితే నవ్వికీలు గా ఉంటుంది.

స. ఇంతకూ ఏమంటావు?

మ. ఈ లోకం బాగాలేదు.

స. పరలోకానికి వెళ్లతానంటావా ఏమిటీ కొంపదీసి. ముందుగాచెప్పు. ముసలాడికి సద్దుకోవలసింది చాల ఉంటుంది.

మ. నువ్వు ఏమన్నా అను. ఈ సంఘం ఉందే యీ సంఘం నఖశిఖపర్యంతం కుళ్ళి గబ్బుకొడుతూవుంది.

ప్ర. ఏమిటి మావయ్యా!

మ. ఈ సంఘం నఖశిఖ పర్యతం కుళ్ళి పోయిందిరా అబ్బాయి. ఈమాట మామయ్య చెప్పాడని జ్ఞాపకముంచుకోరా.

స. ఏమిటి, అప్పుడే అప్పగింతలుకూడా మొదలెట్టావు.

మ. నీకు అన్నీ యెకసెకాలు బావా? నీమట్టుకు నీకు కనిపించటంలేదా?

స. అసలు సంగతి యేమిటి? ఏదో కుళ్ళుతున్న దంటున్నావు. గబ్బు కొడుతున్న దంటున్నావు. నా కెలా అర్థమౌతుంది?

మ. బావా నీవేమన్నా అను. ఒకటి మాత్రం స్పష్టంగా కనిపిస్తూవుంది. ఈ ప్రపంచం ఎంతసేపటికి గొర్రెదాటుగా పోతు న్నది తప్ప ఏమాత్రం ఆలోచించటంలేదు. ఆలోచించకపోతే ఆలోచించక పోయింది.

కష్టసం ఆలోచించేవాళ్ళనన్న చూస్తూ వూరు కోవటంలేదు. దేశద్రోహాలనీ, జాతిద్రోహాలనీ, పరజాతికి మానసపుత్రులనీ అంటున్నది. వీలైతే ప్రాణాలనుకూడా అపహరించటానికి వెనుకంజవేయను. జ్ఞానానికి తూర్పు పడమరలనీ, ప్రాచీనత ఆధునికత లనీ, స్పృశ్యతా అస్పృశ్యతలనీ ఉన్నాయా? అసలు ఈ భావాలు యీ ప్రపంచానికి ఎక్కడనుంచి వచ్చాయి. సొంతంగా ఆలోచిస్తేనే వచ్చాయా. లేదు. తెలుసునన్న యీ దురహంకారంపోయి జిజ్ఞాస యేర్పడేటంత వరకు, పరులు ఏమిచెబుతున్నారో విందామన్న సహనం ఏర్పడేటంతవరకు యీ సంఘం లాభంలేదు. కుళ్ళుతూ ఆలా గబ్బుకొట్టాలిసిందె. ఈ అనంత మహాప్రపంచం ఉండే యిది నినాదాలతోను, సూత్రాలలోను అర్థమయ్యేదికాదు. ఈ సంఘంలో ఈ నినాదకరణం, ఈ సూత్రకరణం శల్య శల్యంలో నాళ నాళంలో ఎక్కిపోయింది. లాభంలేదు. దీన్ని సమూలంగా పెకలించి శతసహస్ర సముద్రాల్లో నానవేసినా యిప్పుడున్న కల్మషం పోదు.

వెం. (లోపలనుంచి) చినబాబుగారు, నీళ్ల పెట్టావండి.

మ. ఇక మొదలెట్టాడు లాభంలేదు. పిలవగానే పోకపోతే మనిషికి చెడ్డచికాకు. ఇప్పుడే స్నానంచేసివస్తాను. ఉంటావుగా?

స. పనుందా?

మ. లేకపోతే ఉండగూడదా?

స. సరే చూదాము, స్నానంచేసిరా.

(మహేశం ఎడమవైపు తలుపు తెరుచుకొని వెళ్ళిపోతాడు)

స. ఏమిరా ప్రసాద్, అలా కూర్చున్నావే పదిక.

ప్ర. తాతయ్య వచ్చినాక పోతాను నాన్నగారు.

స. ఏమిటి విశేషం! దేవరహస్యాలున్నాయా?

ప్ర.వచ్చి కనపడకుండాపోతే బాగుంటుందీ?

స. ఇంతలావు పెద్దమనిషివి కాదూ, పోతే కొంపలు మునుకుపోతాయి.

వెం. (ఎడమవేపు తలుపు తెరుచుకొని సరాసరి వరండాలోకి వెళ్లి వచ్చి) పెదబాబుగారు వస్తుండారు.

(కప్పులు సాసరు వగైరా ట్రేలోకి సర్ది ట్రేలోని పాతగుడ్డతో టేబులుతుడిచి కుర్చీ టేబులు దగ్గరకు సరిగా నెడతాడు, ట్రే ఎడమ చేతిలోకి తీసుకొని కుర్చీకి దూరంగా నిలబడతాడు. పురుషోత్తం వెంకన్నను పిలుస్తూ వస్తాడు. అతడు ఎర్రగా బక్క పల్చగా, పొడుగ్గా ఉంటాడు. కాళ్ళకు సన్న చెప్పులు. ఖద్దరు దోవతి, పొడుగాటికోటు, నెత్తిన తెల్లనిటోపీ. టోపీ తీస్తే నన్నపిలక కనిపిస్తుంది. మెడకు జరీ అంచుల ఉత్తరీయం. కళ్ళకు జోడు, నున్నగా చేయించిన గడ్డం, తెల్లని మీసాలు, వయస్సు అరవైదాకా ఉంటుంది. టోపీ తీసి ఒక చేతపట్టుకుంటాడు. రెండోచేతిలో కర్ర ఉంటుంది.)

పు. వెంకన్నా, వెంకన్నా!

(సత్యనారాయణ టేబులు దగ్గరున్న సోఫాలోనుంచి లేచి కొంచెం ఎడంగా ఉన్న సోఫాదగ్గరకు వెళ్లి నిలబడతాడు. పురుషోత్తం ఆశ్చర్యపడి చూచి) ఆఁ....ఎవరు! (అంతలోనే గిరుక్కున వెంకన్నవైపుకు మళ్ళి) ఎప్పుడు రావటాలు వెంకన్నా?

వెం. ఒక పావుగంట అయిందో లేదో. మీరు అటు వెళ్ళారు, సత్తెంబాబుగారు ఇటు వచ్చారు.

పు. (టోపీ తిరిగి పెట్టుకొని కుర్చీలో కూర్చుంటూ) పిల్లా జెల్లా బాగున్నారటనా?

ప్ర. బావే!

పు. ఓహో నువ్వుగూడా వచ్చావన్నమాట!

ప్ర. వచ్చాను తాతయ్యా, వచ్చా (తాతయ్య కాళ్ళు కావులించుకొంటాడు.)

పు. ఎందుకువచ్చా?

ప్ర. (చటుక్కున తాతయ్యను వదలి వెంకన్న దగ్గరకుపోయి కోపంతో మొఖమింతచేసుకొని) ఏయ్ నన్నెందుకు ఇక్కడికి తీసుకొచ్చా? చెప్పవేఁ.

వెం. (ఆతురతతో) ఏమిటిబాబు, ఏమిటిబాబు?

ప్ర. చెప్పవేం, నన్నెందుకు తీసుకొచ్చాయీకోపంలోకి చెప్పవేం? (చేపట్టుకొన్న చంకలోనిగుడ్డ లాగుతాడు. చేదబేలున క్రింద పడి కవ్వులు, పాసర్లు, గిన్నెలు బద్దలౌతాయి.)

పు. ఏమిటిపాపా, ఏమిటిపాపా?

స. (నిల్చునే) ఏమిటి ఆ అగడం!

ప్ర. (ఏడుస్తూ వెంకన్నను వదలి దూరంగా ఉన్న సోఫాదగ్గరకు పోయి) అందరూ ఊఁ ఊఁ ఎందుకొచ్చారని ఊఁ ఊఁ అడిగేవాళ్ళే. ఊఁ ఊ వీళ్ళని ఊఁ ఊఁ ఎవరు తీసుకు రమన్నారో! (ఏడుస్తూనే సోఫాలో కూలబడతాడు.)

వెం. (ప్రసాదు దగ్గరకువెళ్ళి వంగి సముదాయిస్తూ) బాబుగా యాడవకు, ఎందుకేడుస్తావు? యేదోపిల్లవాడివని నవ్వితే యేడుస్తారా?

ప్ర. నవ్వికేలా? మావయ్య మట్టుకు మావయ్యా అలా అనే; తాతయ్యమట్టుకు తాతయ్యా అలా అనే. నువ్వు నన్నసలు ఎందుకు తీసుకురావాలి?

వెం. మాబాబుగా ఊరుకో.

ప్ర. నన్నింటికి తీసుకెళ్ళుతావా లేదా? (వంగిన వెంకన్న వీపుమీద గుద్దుతాడు.)

వెం. మాబాబుగా ఊరుకో. నాన్నగారు కోప్పడుతారు. అవిగో ఆపెంకులు యారనీ. (పోయి పెంకులు ఏరి చేటలో వేస్తాడు.)

ప్ర. ఇంకొక్క నిమిషం ఉండను. తీసుకెళ్ళుతావా, లేదా?

వెం. ఈపెంకులు పారేసివచ్చి. ....

(ప్రసాదుగునుస్తూ ఉంటాడు.)

స. నోరుముయ్ వెదవా. ఎప్పుడూ ఒకటే అల్లరి! (ప్రసాద్ కుఁయ్ కుఁయ్ మనకుండా కూర్చుంటాడు. చేట పట్టుకొని ఎడమచేతి తలుపు తెరుచుకొని వెళ్ళిపోతూ.)

వెం. సత్తెం బాబుగారు అలా నుంచున్నారే కూర్చోండి. పెదబాబుగారు, మీతోమాట్లాడాలటండి (తలుపు వేసుకొని పోతాడు.)

పు. ఎవరు మాట్లాడవద్దన్నారు వెంకన్నా?

స. వెళ్ళిపోయిన వెంకన్న యెలా సమాధానమిస్తాడు? ఎదురుగా ఉన్నవాళ్ళను వదలి వెళ్ళిపోయినవాళ్ళను పట్టుకొని ప్రయోజనమేముంది?

పు. ఎవరిని పట్టుకుంటే ప్రయోజనమట?

స. ఆసంగతి మీరే ఆలోచించుకోవాలి. తరువాత రెండోవిషయం నేను ఇంటి అల్లుడినన్న ఉద్దేశంతో మీదగ్గరకు రాలేదు.

పు. ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని బోర్డు కట్టలేదే?

స. మీదగ్గర ఉద్యోగం దేవురించే గతి యింకా రాలేదు.

పు. అయినప్పుడు రావటందేనికి.

స. మీమిల్లు కూలీలసంగతి మాట్లాడుదామని వచ్చాను.

పు. అయితేపోవలసింది ఆఫీసుకు. మిల్లు ఆవరణంలోనే రెండంతస్తుల మేడఉంది. అందులో పైన దక్షిణపు గదిలో మీరుకలుసుకొని మాట్లాడవలసిన నతను ఉంటాడు. ఎర్రగా బక్కపల్చగా పొడుగ్గా ఉంటాడు.

పురుషోత్తం పేరుచెబితే అక్కడయెవరన్నా చూపిస్తారు. అతగాడు ఒక్క ఆదివారంతప్ప ప్రతిరోజు ఉదయం 10 గంటలనుంచి సాయంకాలం ఆరింటిదాకా అక్కడే ఉంటాడు. ఇవ్వాళ ఆదివారంకాదూ? అందువల్ల మీకు అక్కడ దొరకడు. సోమవారంవెళ్ళినా, మరో రోజు వెళ్ళినా నేనుచెప్పిన కాలంలో వెళ్ళితే మీకు కనిపిస్తాడు. సావకాశంగా మీరు చెప్పవలసినవన్నీ చెప్పవచ్చును. అతగాడు చేయగలిగింది ఉంటే తప్పకుండ చేస్తాడుకూడా.

స. మీసలహాకు ఆజన్మం కృతజ్ఞుణ్ణి కాని....

పు. ఇక్కడ నాతోమాట్లాడే దేముంది?

స. మనవి చేసుకుంటాను. మీ అల్లుడు మీతో మాట్లాడటం లేదని ఒకసారి చెప్పుకొన్నాను. మీరు ఆలోచనలో ఉండి సరిగా వినలేదేమో.

పు. పరాయివాళ్ళువచ్చి నాతో మాట్లాడవలసిందేమిటబ్బా? నాకు అప్పూ సప్పూ లేదు, ఒకళ్ళను ఆశ్రయించుకొని బ్రతకటం లేదు. అయినవీ, కానివీ నెత్తిన వేసుకొని తిరగటంలేదు. పెళ్ళాము బిడ్డల్ని తిండికి మాడ్చటంలేదు. గుడ్డకు వాచిపోయేటట్టు చేయటంలేదు. ఇంకా ఎలాంటి లావాదేవీలు కూడా లేవే.

స. పెద్దలు చాల అద్భుతంగా సెలవిస్తున్నారు.... ఆ సంగతి పోనీండి. నేను కాస్త తొందరగా పోవాలి. ఇలాగే ధోరణి సాగితే పెద్దలకు కాలం వ్యర్థమైపోతుంది. మీకు మిల్లు నోటీసివ్వకుండా కట్టివేయటం ఉందే....

పు. అన్యాయం, అంతేనా? మీటింగులు పెట్టి నన్నూ, నా కుటుంబాన్నీ, నా మేనేజర్లను దుమ్మెత్తి పోయటానికి ఆవేతు హిమాచలం ఖాళీగా ఉంది. నిరసన ప్రదర్శనాలు జరపటానికి వీధులన్నీ ఊరకనే ఆఘోరిస్తున్నాయి. ఇంకా అంతకన్నా ఏమీ కావాలి?

స. కొంచెం ప్రశాంతంగా ఆలోచించండి. వేలకొలదిగా ఉన్న కార్మికులు అనవసరంగా మాడిపోతారు. దీనివల్ల మీకు వచ్చేలాభం ఏమీలేదు. వాళ్ళు మలమల మాడిపోతే మీకు వచ్చే సుఖమేమిటి? అది అలా ఉండండి. దేశమంతా గుడ్డలేక అలమటించిపోతూవుంది. తిండిలేక అలోలక్ష్మణా అంటూ ఉంది. గుడ్డ సప్లయిచేస్తే, ఆహార ధాన్యాలు ఎగుమతిచేసే దేశాలున్నాయి. ఆలోచించండి. బాగా లాభిస్తున్న యీసమయంలో మిల్లు కట్టివేసుకుంటే ఎంత నష్టమో చూడండి. కేవలం పగ సాధించటంకోసమని జాతినంతను యిలా చేయటం ఏమంత భావ్యం? ధర్మం ధర్మమంటారే యిదేనా ధర్మం? ముప్పూట గీతాధ్యయనం చేస్తారు కాబోలు. ఈ పనే గీత చెయ్యమంటున్నదా?

పు. (బిగ్గరగా) ఒరే వెంకన్నా, వెంకన్నా!

వెం. (తలుపు తెరుచుకొనివచ్చి) పిలిచారా పెదబాబుగారూ?

పు. వెంకన్నా, గీత ఎవరికి ఎవరు చెప్పారురా? (వెంకన్నవిత్తరపోయిచూస్తాడు) అలా చూస్తావేమిరా?

వెం. (వత్తులు గోడుతూ) కృష్ణభగవాన్లు అర్జునుడికి.

పు. పళ్ళు నమలుతావు దేనికి. నే నడిగే వాటికన్నిటికీ సరిగ్గాచెప్పు. కృష్ణభగవాన్లు ఏమి చెప్పాడు?

వెం. ధర్మం.

పు. అర్జునుడు విని ఏమిచేశాడు?

వెం. కౌరవుల్ని చావమోదాడు. ఎందుకండి పెద్దబాబుగారు అలా అడుగుతున్నారు?

పు. ఏమీలేదు పో. (వెంకన్న అలాగే నిలబడి ఉంటాడు) తటపటాయిస్తావేం పోక. (వెంకన్న తలుపుతెరుచుకొని వెళ్ళిపోతాడు.)

స. సరే అర్థమైంది. చెప్పవలసినబాధ్యత ఉంది కాబట్టి చెప్పాను. అవతల నన్నని ప్రయోజనంలేదు. పురుషోత్తంగారు, సెలవు తీసుకొంటాను. ఎప్పుడన్నా ఉద్యోగానికని మీకు అప్లికేషను పెట్టుకొంటానేమో. అల్లుణ్ణని కాస్త కనికరం ఉంచండి. మరచిపోరు కాదు. (విసురుకొని పోతుంటాడు.)

పు. (తెల్లబోయి) ఆఁ!

స. (పోతూపోతూ వెనకకు తిరగకుండానే) సంఘం నఖశిఖ పర్యంతం కుళ్ళి చితచితలాడుతున్నది. వాళ్ళకు గత్యంతరం లేదు. (బయటికి వెళ్ళిపోతాడు)

పు. (బిగ్గరగా) వెంకన్నా, వెంకన్నా! కళ్ళు కనపట్టంలేదా. కొంప చీకటి బియ్యారంగా ఉంటే లైట్లు వేసుకోరూ? (వెంకన్న తడువుకుంటూ వెళ్ళి టిక్కు టిక్కుని రెండు లైట్లు వేస్తాడు) జన్మానికొకసారి పిసలైన ముక్క చెప్పాడు. నిజంగా చితచిత లాడిపోతున్నది.

వెం. నిజమే పెదబాబుగారు.

పు. ఏమిటిరా?

వెం. చితచితలాడిపోతున్నదండి.

పు. చితచితలాడిపోయేదేమిటి నీ మొఖం నీ మోరాను.

(మహేశం లోపలినుంచి తలుపు తెరుచుకొని వస్తాడు. నున్నగా వెనక్కుదువ్విన తడితల, పొట్టిచేతుల చొక్కా, ముదుగు దోవతి. కట్టు మొదట్లోలాగానే ఉంటుంది. కాళ్ళకు ఏమీ ఉండవు. బుజాన చిన్న తుండుగుడ్డమాత్రం ఉంటుంది. పురుషోత్తం ఎగాదిగా చూస్తాడు.)

మ. నాన్నగారు వెళ్ళుతున్నా.

పు. (ఆశ్చర్యంగా) ఈచీకట్లో ఎక్కడికి? నాటకానికా?

మ. కాదు, నాటకంలోనుంచి బయటికి.

పు. అలాగా! ఎంతకాలంనుంచి ఆడుతున్నావేమిటి?

మ. ఆడిస్తుంటే ఆడుతున్నాను. కావాలని నే నాడలేదు. అందుకనే బయలుదేరింది.

పు. జ్ఞానోదయం అయిందన్నమాట!

మ. జ్ఞానోదయమో అజ్ఞానోదయమో అయింది. బావకూ మీకూ జరిగిన కథచాటున ఉండి వింటూఉంటే కళ్ళు తెరిపిళ్ళు పడ్డాయి. అప్పుడే తెలిసింది.

పు. ఏమి తెలిసింది?

మ. గీతా ధర్మం. డబ్బుతో మానవుల్ని హింసించటం, మానవత్వాన్ని రూపుమాపటం, ఇంటికి వచ్చినవాళ్ళ ముఖంమీద కాండ్రించి ఉమ్మివేయటం. దాన్ని ధర్మమనటం, అలాంటి ధర్మసంస్థాపన కోపం కంకణం కట్టుకోవటం.

పు. ఈ నాటికైనా తెలిసిందికదా, సంతోషం.

మ. ఇక వస్తాను.

పు. ఇది నాటకం కాదని తెలుసుగదా?

మ. తెలియకపోవటమే-తెలుసు, తెలుసు- ఈ ధర్మానికి తల్లి అనీ, బిడ్డనీ, బంధువనీ, శత్రువనీ, మేలనీ కీడనీ వివక్ష ఏ కోశాన లేదు. దానికి ఒక్కటే లక్ష్యం. ఎప్పుడూ ఒకటే మంత్రం జపిస్తుంటుంది. లాభం, లాభం, లాభం. అంతకు తప్ప మరేమీ లేదు. వీడికి చదువు చెప్పించాను; ఎంత లాభం ఉంటుంది. ఈ మందు మార్కెట్లో పెట్టాను; ఎంత లాభం వస్తుంది. ఈ పుస్తకం అచ్చు వేయించాను; ఎంత లాభం గిడుతుంది. ఇదే దాని ఆలోచన. వాత్సల్యం, మైత్రి, దయా దాక్షిణ్యం, ఔదార్యం, నైత్యం దానిముందు పొటమరించనన్నా పొటమరించవు. సెలవు. వెంకన్నా, వెళ్ళివస్తాను.

వెం. (విస్తుపోయి) ఎక్కడికి చినబాబుగారు?

మ. వాస్తవప్రపంచంలోకి (బయటికి వెళ్ళిపోతాడు. పురుషోత్తం కళ్ళప్పగించి చూస్తుంటాడు.)

వెం. (దగ్గరకు వచ్చి) బాబుగారు, బాబుగారు! చినబాబుగారు పోతున్నారెక్కడికి?

పు. నువ్వుకూడా పోతానంటావా? పో, పోండి, పోండి! అంతా పోండి! ఇంకా ఉంచున్నావెందుకు.

వెం. (దీనంగా) ఎక్కడికి పొమ్మంటారు బాబుగారు?

పు. (వెటకారంగా) సోషలిజం చెయ్యటానికోయ్, కొత్త పెపంచం పిలుస్తోంది.

వెం. అదేంటో నాకు తెలీదు బాబుగారు. ఇన్నేళ్ళు వచ్చాక యాడకుపోతాను. ఇక్కడే పడుండనీండి బాబుగారు. మీ కాళ్ళు పట్టుకొంటాను. నన్ను తరిమేయకండి. ఈ ముసలితనంలో యాడకుపోయేది. యవరు చూస్తారు?

పు. (టోపీ మెల్లగా తీసి టేబులుమీద పెడుతూ) ప్రసాదు నిద్రపోయాడా?

వెం. లేదు. మేలుకొనే ఉన్నాడు. (ప్రసాదు కూర్చున్న సోఫాదగ్గరకెళ్ళి) బాబూ తాతయ్య పిలుస్తుంటే పలకవే? (కూర్చున్న వాణ్ణి కూర్చున్న పళంగా ఎత్తుకెళ్ళి పురుషోత్తానికి దగ్గరగాఉన్న టేబులుమీద కూర్చోబెడతాడు)

పు. మాబాబు అలిగాడు, మానాన్నగా, బా, కన్నతండ్రిగా ఊరికే నవ్వితే అలుగుతారా. లే మా అమ్మగా, లే! గిలిగిలి చక్కలి గిలిగిలి.

ప్ర. (నవ్వుతూ) నన్ను తాకావంటేనా తాతయ్యా....

పు. నువ్వుకూడా నామీద అలిగితే నేను బ్రతకొద్దూ. లేదు, నాచిట్టి తండ్రికి నామీద కోపంలేదు. నేను పడేశ్రమంతా వాడికేగా. వెంకన్నా, చిట్టిబాబుకు నీళ్ళుతోడు ఒళ్ళంతా చెమటపోసింది. పో, తొందరగా పో.

ప్ర. మిల్లు కట్టివేశారా తాతయ్యా?

పు. ఆ.

ప్ర. ఎందుకని?

పు. సంఘం చెడిపోయిందిబాబు. చితచితలాడుతున్నది. దేవుడూలేడు, దైవంలేదు, పాపంలేదు, పుణ్యంలేదు.

ప్ర. అంటే.

పు. ఇటుచూడుబాబు. ఈచొక్కా నీదేనా?

ప్ర. నాదికాక మరెవ్వరిది తాతయ్యా?

పు. కాదు, సంఘందిట.

ప్ర. అలాగా, సరే కాని తాతయ్యా, సంఘం అంటే ఏమిటి?

(తాతయ్య చేతులు పట్టుకొంటాడు.)

వెం. చిట్టిబాబు, నీళ్ళు పోసుకుందువుగాని రా.

పు. పిచ్చివాడ, ఎందుకునాచేతులుచూస్తా? పోయి నీళ్ళు పోసుకురా.

(ప్రసాదు తాతచేతులు వాసన చూస్తాడు.)

ప్ర. సంఘం అంటే ఏమిటి తాతయ్యా?

పు. నీకు చేతులెందుకురా. అదంతా....

వెం. చిట్టిబాబు, వెళ్ళుదామురా.

(గలగల మోగించుకుంటూ నాలుగైదు పెద్దకార్లువెళ్ళుతూన్న చప్పుడువినిపిస్తుంది.)

ప్ర. తాతయ్యా, తాతయ్యా ఫైరయింజన్లు పోతున్నాయి.

వెం. ఎక్కడో ఏదో మునుగుతున్నట్టున్నది పెదబాబుగారు.

పు. (చిరాకుతో) నీవుపోయి వాణ్ణిస్నానం చేయించు.

వెం. వెళ్ళుదాము రా చిట్టిబాబు.

(పురుషోత్తానికి దూరంగా వెంకన్న ప్రసాదు వెళ్ళుతుంటారు.)

ప్ర. వెంకన్న తాతా, నాచేతులు వాసన చూడు.

వెం. మా చిట్టిబాబు చేతులకేం కమ్మగున్నాయి.

ప్ర. నీ చేతులేంటి? సబ్బు వాసన కొడుతున్నాయి. సరేకాని తాతా, నాన్న చేతులు వాసనలేవు, నా చేతులు వాసనలేవు. నీ చేతులు వాసనలేవు. కుళ్ళుతున్న దెవరు?

వెం. ఎవరు కుళ్ళుతున్నారు.

ప్ర. నాన్న అన్నాడు, నువ్వు అన్నావు. మామయ్యా అన్నాడు. తాతయ్యా అన్నాడు.

వెం. (నవ్వుతూ) పిచ్చిబాబూ, పిచ్చిబాబూ, సంగం కుళ్ళుతున్నదన్నారు కాని మనమా?

ప్ర. మరి సంఘం ఎక్కడుంది తాతా?

వెం. నాకు తెలీదుబాబూ. నువ్వు నీళ్ళు పోసుకుంటూ ఉండు. తుండుగుడ్డ పక్కగదిలో ఉంది తీసుకొస్తా. ఆపట్నే కూర్చునేవు. ఇప్పుడే వస్తా.

(ఇద్దరూ లోపలికి వెళ్ళుతారు. హాలులో ఫోను మ్రోగుతుంది)

పు. వెంకన్నా, వెంకన్నా, ఆ ఫోను ఏమిటో చూడు. రామరామ, కాసేపు ప్రశాంతంగా కూర్చోటానికి నోచుకోలేదుగదా!

వెం. (హాలులోకి వచ్చి ఫోను తీసుకొంటూ) అయ్యా....ఎవరది....నేనేనండా.... వేనా వెంకన్నని....ఏమిటి సంగతి....ముట్టుకొందీ....గిడ్డంగులా.... ఇంకేముంది బాబుగారూ ఇంకేముంది బాబుగారూ.

పు. (కలవరంగా) ఏమిటీ ఆ అమ్మమ్మ శోకాలు.

వెం. తగలడుతోంది. తగలడుతోంది.

పు. ఏమిటిరా తగలడుతోంది చెప్పవేం?

వెం. గిడ్డంగులు....

పు. ప్రసాదెక్కడా?

వెం. స్నానంచేస్తుండాడు. ఇంకేముంది పెద్దబాబుగారు. పదండి, పదండి.

పు. ఏడి ప్రసాద్ వెంకన్నా?

వెం. స్నానాలగదిలో వదిలొచ్చావండి. ఎక్కడికిపోతారు. మీరు మిల్లుకాడికి బయలుదేరండి.

పు. (పెద్దగా) ప్రసాద్, ప్రసాద్, (సమాధానం రాదు) వెంకన్నా, చిట్టిబాబు ఎక్కడకుపోయాడో చూడు.

వెం. నేను ప్రసాద్‌ను చూస్తానులెండి. మీరు ముందు పదండిబాబు.

(మళ్ళీ ఫైర్ యింజన్ల మోత వినిపిస్తుంది)

పు. చోదరా ముసలిదెయ్యమా? (ప్రసాద్, ప్రసాద్ అని కేకలుపెడుతూ గబగబ రెండుమూడుసార్లు లోపలికి పోయివచ్చి) ఏడీ ప్రసాదు?

వెం. ఇంకెక్కడి మిల్లు.

(కాసేపు నిశ్శబ్దం)

ప్ర. (వీధిలో పరిగెడుతూ) ఓ సంఘం, ఓ సంఘం, ఓ సంఘం.

[ తెర ]



# విజయ

బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం

(గతసంచిక తరువాయి)

వచ్చే ఆదివారం ఎగ్మోరు ఇంటికి నేను వెళ్ళినప్పుడు నానవలలో అప్పటివరకూ వ్రాసిన భాగం విజయకి చదివి వినిపించడానికి తీసుకువెళ్ళలేదు. విజయ అంతగా జ్ఞాపకం ఉంచుకుని అడుగుతుందనుకోలేదు. వెళ్ళి వెళ్ళగానే అడగడంమాత్రం అడిగింది. తేవడం మరచిపోయానంటే ఊరుకుంది....

నవల పూర్తిఅయేవరకూ విజయకి కథచదివి వినిపించడం జరగలేదు. బెంగుళూరులో ఆఖరికి చదివి వినిపించాను, అడిగిన రెండేళ్ళకిపైగా తర్వాత....

ఈ ఆదివారంకూడా తన స్నేహితురాలు, నిత్య, ఇంట్లోలేదు. వెళ్ళి మేడమీద కూర్చున్నాం.

"ఈవాళ మనం సినీమాకి వెళ్తున్నాం," అంది విజయ, నవ్వుతూ.

"ఏసినీమాకి, విజయా?"

సినీమాపేరు చెప్పింది.

అదే సినీమాకి ఆరోజునే నాకన్నడ స్నేహితుడు, హరి సర్వోత్తమరావూ నేనూ వెళ్ళాలని నిశ్చయించుకున్నాం: సాయంత్రం ఆరుగంటలకి సినీమాహాలుదగ్గర హరిని కలుసుకుంటాననిచెప్పి, మూడుగంటలకి విజయ ఇంటికివచ్చాను:

"నిత్యవెళ్ళి మనముగ్గురికీ టిక్కెట్లుకొని తెస్తానంది."

"ఆవిడకూడా వస్తున్నారా?"

"సినీమాకి వెళ్ళాలని నిత్యే నిశ్చయించింది. ఎన్నాళ్ళబట్టో మనం ముగ్గురం సినీమాకి వెళ్లాలని అనుకుంటున్నాను నేను."

"సాయంత్రపు ఆటకేనా?"

"అవును."

"విజయా, నాస్నేహితుడు హరీ నేనూ ఈసాయంత్రం ఈ సినీమాకే వెళ్ళ తలచుకున్నాం. హరిని ఆరుగంటలకి సినీమాహాలుదగ్గర కలుసుకుంటానని చెప్పి వచ్చాను. ఈసంగతి పొద్దున్న తెలిస్తే...."

"నాకేం తెలుసును మరొకరితో వెళ్ళదలచుకున్నావని...."

"అసలు పొద్దున్నే వద్దామనుకున్నాను...."

"ఎందుకురాలేదూ ?"

"ఉంటావో ఉండవోనని... "

"ఉండకేం చేస్తాను?"

"చర్చికీ అక్కడకీ వెళ్తావేమోనని...."

"ఇప్పుడు చర్చికి వెళ్ళడమేలేదు నేను. పూర్వంకూడా ప్రతి ఆదివారమూ వెళ్ళే దాన్ని కాను."

"అయినా ఎందుకని మధ్యాహ్నమే వచ్చాను."

"మీస్నేహితుడిది బెంగుళూరా ?"

"అవును."

"ఏమిటి చేద్దాం మరిప్పుడు?....నిత్య సీట్లు రిజర్వుచేసి ఉంటుంది."

"హరికి చెప్పివస్తాను, తనతో వెళ్ళడానికి వీలులేదని....లేకపోతే మరొకసీటు కూడా రిజర్వుచేద్దామా ?"

"వద్దు....రావడంలేదని వెళ్ళిచెప్పు నీస్నేహితుడితో....త్వరగా వెళ్ళి చెప్పాలేమో ?"

"తీరా ఇప్పుడువెళ్తే హోటలులో ఉంటాడో ఉండడో...."

"అయినా చూసి చెప్పిరా."........

తీరా వెళ్తే హరి హోటలులోలేడు. ఆరోజున ఇలా విజయతో ఆసినీమాకే వెళ్తున్నాననీ, మరొకరోజున తనూ నేనూ వెళ్ళవచ్చుననీ, చీటీవ్రాసిపెట్టి, తిరిగి ఎగ్మోరువెళ్ళేను.

ఆచీటి చూసుకునేందుకు వీలులేకుండా, హరి, హోటలుకి వెళ్ళకుండానే, తిన్నగా సినీమాకి వచ్చేసేడు. విజయతోనూ విజయ స్నేహితురాలితోనూ నేను సినీమాకి రావడంచూస్తూ ఆశ్చర్యపోయాడు. అతనే హరి అని విజయకి చూపిస్తే, "మరి నువ్వు వ్రాసిపెట్టినచీటి చూసుకోలేదా ఆయన ?" అని అడిగింది.

అటుపక్క హరి, "నువ్వు ఎంతసేపటికీ రాకపోయేసరికి చూసి చూసి ఆఖరికి టిక్కట్లుకూడా ఉండవేమోనని, రెండుటిక్కట్లూకొని, కాచుకుని ఉన్నాను నీకోసం," అన్నాడు.

నలుగురం ఒకచోటనే కూర్చుందామన్నాను. విజయకి నచ్చలేదు. అయినా ఏమీ అనలేకపోయింది. హరికీ విజయకీ పరిచయం కలిపేను. విజయ స్నేహితురాలికికూడా నమస్కారంపెట్టేడు హరి, ఆవిడని మాఆఫీసులో చూసినజ్ఞాపకంతో.

కాసేపు మతిపోయినవాడిలా విజయకేసి ఒకటేచూడడం మొదలుపెట్టేడతను, అందరం హాలులో కూర్చున్నాక.

"మిమ్మల్ని బెంగుళూరులో ఈమధ్యనే ఎప్పుడో ఎక్కడో చూసినజ్ఞాపకం అండీ," అన్నాడు హరి విజయని పలకరిస్తూ.

"చూసేరేమో" అంది విజయ అతి పరాకుగా. ఎప్పుడు చూసేదో, ఎక్కడ చూసేదో, జ్ఞాపకం తెచ్చుకునేందుకు మహాప్రయత్నంచేసి, ఆఖరికి. "మదన గోపాలూ బృందమూ నాట్యం సంగీతం మొన్న జానువెలలో ప్రదర్శించి నప్పుడు మీరక్కడున్నారు," అన్నాడు హరి, విజయని సంబోధిస్తూ.

"అవును, వెళ్ళేను," అంది విజయ.

"మీ అక్కగారో ఎవరో ఆవిడ...."

"అక్కకాదు, మా అమ్మే," అంది విజయ, 'ఈప్రశ్నలన్నీ వేస్తూ ఇతనెందుకు చాపురించాడో ఈసాయింత్రం,' అన్నచిరాకు స్పష్టంగా ముఖంలో చూపిస్తూ.

"ఆరెండు జావళీలూ, ఆ త్యాగరాయకీర్తనా అతి చమత్కారంగానూ, అతి మనోహరంగానూ పాడేరు మీఅమ్మగారు ఆవేళ," అని, ఇంకా వదలకుండా సంభాషణ నడుపుతున్నాడు హరి.

"మీఅమ్మ పాడగలరు కూడానా ?" అని అడిగేను విజయని, నేనుకూడా సంభాషణలో పాల్గొనేందుకు.

"ఆగొంతు వినవలసినగొంతు," అని హరే మళ్ళీ అందుకున్నాడు. "అంత చక్కనిగొంతు దక్షిణదేశంలో ఎవరికీలేదు" అన్నాడు.

కాసేపుపోయాక విజయనే పలకరిస్తూ మళ్ళీ, "మీకూ ఆవిడకీ ఉన్నపోలిక చూసి అక్కచెల్లెళ్ళనుకున్నాను సుమండీ ఆరోజున. మీకంటె వారు అంతపెద్ద అనుకోలేదు....మీకు అమ్మగారవుతారా !" అన్నాడు.

"మా ఇద్దరినీచూసి చాలామంది అలాగే అనుకుంటారు," అంది విజయ.

హరి విజయతో మాట్లాడాలని ఇంకా కుతూహలపడ్డాడు. విజయ మాకేసి చూడకుండా తన స్నేహితురాలితోనే మాట్లాడుతూ కూర్చుంది. ఇంతట్లో సినీమా మొదలుపెట్టేరు.

ఒకమూల సినీమానడుస్తుంటే, హరి నాతో ఒకటే మాట్లాడడం మొదలు పెట్టేడు.

విజయగురించి నన్ను ప్రశ్నలువేస్తుంటే, "ఇప్పుడు మాట్లాడొద్దు, హరీ. తర్వాత మాట్లాడుదాం. సినీమాచూడు," అని కసరవలసివచ్చింది.........

మాఆఫీసులో పది పదిహేనురోజులక్రితం విజయ స్నేహితురాలివిచూసి, విజయ పేరు విన్నప్పటినుంచీ, 'విజయ ఎవరు?' అంటూ నన్ను వేధిస్తూనే ఉన్నాడు హరి, ఆరోజున నేను, ఆలోచించకుండా, "విజయ ఒకవేశ్య కుమార్తె," అని చెప్పడం కూడా తప్పయింది. అనేకసార్లు నన్ను, ఈ పదిపదిహేనురోజులలోనూ, విజయ గురించి ఇతర వివరాలు చెప్పమని అతను అడుగుతుంటే, విజయ చెన్నపట్నంలో చదువుకుంటోందన్న విషయంతప్ప నాకు మరేమీ తెలియదన్నాను.

"వేశ్యకి పుట్టినట్టు ఎవరుచెప్పేరు నీకు ?" అని అడిగేడు.

"విజయ తల్లి సన్మార్గురాలుకాదని వాళ్ళహాస్టలులో అనుకుంటున్నట్లు కామేశ్వరి నాకు చెప్పేది. అందువల్లమాత్రమే ఆ అనుమానం," అని అబద్ధం ఆడేను.

విజయతో నాకెంతపరిచయం ఉందో తెలుసుకోవాలని ఇన్నిరోజులూ హరి చాలా ఆత్రుత కనపర్చాడు. నే నతన్ని తృప్తిపరచదలచుకోలేదు.

ఆమధ్య మరొకరోజున, "మీవిజయని నాకొకసారి చూపించాలి సుమా." అన్నాడు.

"చూపిస్తాను." అన్నాను.

అనుకోకుండా ఈవిధంగా సినీమాలో కలవడం తటస్థించింది........

సినీమాఆట మధ్య ఆపుజేసి దీపాలువేసినప్పుడు, హరి సిగరెట్టుకాల్చుకునేందుకు లేచి పైకివెళ్ళేడు.

"నీస్నేహితుడు వస్తాడని అనుమానంగాఉంటే మేము సినీమాకి రాకనేపోదుం." అంది విజయ, నేనేదో తప్పుచేసినట్టు నాకేసి చూస్తూ.

"అతను వెళ్ళి చీటి చూసుకోలేదు, విజయా. నన్నేమిటి చెయ్యమంటావు మరి?"

"కాదు, చెప్తున్నాను....కాని, ఈ బైతు స్నేహం ఎప్పుడు సంపాదించావు?"

"నాస్నేహితులందరూ నాలాగే బైతులు....ఇద్దరంకలిసి చదువుకున్నాం."

"ఒకటే మాట్లాడుతా డెందుకూ నాతో?"

"మీఅమ్మ సంగీతం చాలా మెచ్చుకుంటున్నాడు. హరికి సంగీతంలో చాలా ప్రవేశంఉంది....మీఅమ్మకి సంగీతం అంత బాగా వచ్చునని నువ్వు ఎప్పుడూ చెప్పలేదే?"

"మాఅమ్మ బాగా పాడుతుంది. అయితే నాకు సరిగమాలుకూడారావు. నాచిన్నప్పుడు ఇళ్ళకివెళ్ళి ఆడపిల్లలకి సంగీతం నేర్పేది మాఅమ్మ. నేనుమాత్రం నేర్చుకోలేదు."

ఇంతలో హరి వచ్చేసేడు. మళ్ళీ అందుకున్నాడు. విజయ నవ్వు ఆపుకోలేకపోయింది.

"మదనగోపాలుని ఎరుగుదురా అండి మీఅమ్మ?" అని ప్రశ్నించాడు.

"నాకు తెలియదండీ."

"మరి మదనగోపాలు బృందంలో ఎందుకున్నా రా రోజున?"

"ఆడపిల్లల హాస్టలుకని డబ్బుకోసం అప్రదర్శనం తయారుచేయడంలో, సుమిత్రరావుగారు అడిగితే మాఅమ్మ పాడడానికి ఒప్పుకుంది."

"సుమిత్రరావుగారంటే?"

"డాక్టరు సుమిత్రరావు."

"బసవంగుడిలో ఉన్నాడు, ఆయనేనా?"

"అవును."

"ఆయన్ని బాగా ఎరుగుదును నేను....మీరుకూడా బసవంగుడిలోనే ఉన్నారా ?"
"అవునండీ."
"ఎక్కడ ?"
విజయఉండే వీధిపేరూ నంబరూ చెప్పింది.
ఇంతట్లో దీపాలు ఆర్పేసేరు. మళ్ళీ సినీమా ప్రారంభమయింది.
"కాంతమ్మగారే కనుక గానసభలలో పాడేటట్టయితే మీ అరియకుడీ, మీ కోయంబత్తూరుతాయీ, మీ సుబ్బలక్ష్మీ ఎందుకూ పనికిరారు," అన్నాడు హరి, గట్టిగా, విజయకి వినపడేటట్టు.
కాంతమ్మగారంటే ఎవరో ఒక్కక్షణం జాపకంరాలేదు. జ్ఞాపకంవచ్చాక, ఇంత పట్టుదలగా, ఒక్కసారి పాటవిని, విజయ తల్లి పేరు హరి జ్ఞాపకం ఉంచుకోడం ఆశ్చర్యమే అనిపించింది....
సినీమా అయిపోయాక హరి, ఎవరినో కలుసుకోవాలని, హడావిడిగా వెళ్ళిపోయాడు. విజయనీ విజయ స్నేహితురాలినీ టాక్సీలో ఎగ్మోరులో దిగపెట్టి, నేను ఇంటికి వెళ్లిపోయాను.

హరి చెన్నపట్నంలో రెండునెలలుండిపోయాడాసారి. వర్తకవిషయంలో వచ్చినట్టూ, పనిపూర్తికానట్టూ చెప్పేడు. రెండురోజులకీ మూడురోజులకీ ఒకసారైనా [illegible] ఆఫీసుకి వస్తూఉండేవాడునన్ను చూడడానికి. విజయని సినీమాలో కలుసుకున్న [illegible]నుంచీ, ప్రతిరోజూ రావడం ప్రారంభించాడు.
సినీమా అయిన మొన్నాడువచ్చి. "మళ్ళీసారి నీస్నేహితురాలిని చూడడానికి [illegible]టప్పుడు నన్నుకూడా తీసుకువెళ్ళాలి," అన్నాడు.
"చూద్దాం," అన్నాను.
"చూద్దాంలేదు, గీద్దాంలేదు. తీసుకువెళ్ళకతప్పదు". నా కీధోరణి నచ్చలేదు.
"అంతగా ఎందుకు మళ్ళీ చూడాలనుకుంటున్నావు ?" అని అడిగేను.
"అంత చులాగ్గా దురభిప్రాయపడకు మరి. నాసంగతి నీకు తెలియదూ ? [illegible]తంఅంటే చెవికోసుకుంటాను...."
"విజయకి సంగీతంరాదే !"
"ఆవిడ సంగతికాదు. వాళ్ళమ్మగారిని బెంగుళూరులో కలుసుకుని, కచ్చేరీ [illegible] పెట్టించాలని ఉంది."
"దానికి విజయనిచూస్తే ఏమిలాభం ?"
"నీకు నే నావిడనిచూడడం అంత అయిష్టంగాఉంటే, పోనీ, వద్దులే....తల్లికీ [illegible]ంగా
[illegible]కి చాలా పోలికఉంది, సుమా." [illegible]ంది."
"నేను చూడలే దావిడని."
"ఆవిడ వేశ్యవృత్తిలో ఉందని నీకు నిజంగా తెలుసునా ?"

"నాకేమీ తెలియదని ఇదివరకే చెప్పేనుకా."

"చాలా సంసారపక్షంగా ఉంటుందావిడ, నీకెవరో తప్పుచెప్పేరు. నేను బెంగుళూరు, ఒక్కరోజుకిమాత్రమే. ఈఆదివారం వెళ్తున్నాను. అడాక్టరు సుమిత్రరావుని కలుసుకుంటాను. ఆయనతోవెళ్ళి ఆవిడనిచూసి, సంగీత కచ్చేరిలగురించి మాట్లాడాలనుకుంటున్నాను. ఆదివారం వెళ్ళేముందు కూతురిని కలుసుకుని తల్లికి ఉత్తరం వ్రాయమని కోరాలనిఉంది....నువ్వు చెప్పినాసరే చాలు."

"చెప్పడానికేమిలే. చెప్తాను. కాని, ఈసంగీత కచ్చేరీలగురించి, ఇంత ఆత్రుతా పట్టుదలా ఇప్పుడే ఎందుకు కలగాలి? కూతురునిచూసేక ఉత్సాహంహెచ్చిందా? జూనునెలలోనే ఆప్రదర్శనం చూడగానే ఎందుకు ప్రయత్నించలేదూ?....ఇంతకీ ఆవిడకిలేని అభిలాష నీకేల?"

"అప్పుడు ఆవిడెవరో నేనెరగను. ఆవిడ కూతురుకీ నీకూస్నేహం కనుక ఇప్పుడు ప్రయత్నించాలనుకుంటున్నాను. తప్పయితే చెప్పు."

"ఈ ప్రయత్నానికిమట్టుకు నీకేసుహక్కుంది?....మరొకరయా మరొకరూ ఐతే, పాటఉన్నంతమాత్రాన, కచ్చేరీలిమ్మని అడగడానికి, ఇళ్ళకి వెళ్ళగలుగుతావా? వీధిలోకూర్చున్న భర్తని, ఆవిడతో మాట్లాడాలని చెప్తూ, తప్పుకోమంటావా?"

"ఆవిడ భర్తకూడా ఉన్నారా?"

"ఏమో, నాకు తెలియదు....లేరన్న ధైర్యంమీదనేవెళ్లి ఎకా ఎకీని అడుగుదామనుకుంటున్నావా?"

"ఆవిడ సరదా అయినస్త్రీ అని నువ్వేకాదటోయి చెప్త?"

"నే నావిడని చూడందే ఎన్నడూ!....నాకేమీ తెలియదు. నేనేమీ చెప్పలేదు."

"పోనీ నీకంతకోపంగా ఉంటే నేను చూడనులే....ఆవిడని వెళ్ళిఅడగనూ అడగను, ఈవిడని వెళ్ళిచూడనూ చూడను....ఆమాట మరచిపో....బుధవారం కోయంబత్తూరునుంచి రామకృష్ణన్ వస్తున్నాడు. నేనున్న హోటలులోనే దిగుతున్నాడు. మొన్నాడు మళ్ళీ వెళ్ళిపోతాడట. మనంముగ్గురం సాయంత్రమూ రాత్రీ సరదాగా గడుపుదాం....మరేమీ ఉండదులే....వస్తే అయిదుగంటలకి నాగదికిరా. వస్తావని రామకృష్ణన్‌తో చెప్పనా?"

"వస్తాను. చెప్పు."....

మొన్నాడుసాయింత్రం అయిదుగంటలుదాటేక హరినీ రామకృష్ణన్‌నీ కలుసుకునేందుకు వెళ్ళేను. వాళ్ళతోపాటు రామకృష్ణన్ చుట్టం, చంద్రన్ కూడా అక్కడున్నాడు....

చదువుకునేరోజులలోకూడా రామకృష్ణన్ చాలాకులాసా పురుషుడు. అతని తండ్రికి కోయంబత్తూరుజిల్లాలో మూడో నాలుగోమిల్లులూ, ఇతరాస్తులూ ఉన్నాయి. ఒకడేకొడుకు. ఇంతడబ్బుండీ గర్వంలేదు రామకృష్ణన్‌కి. కాలేజీ చదువులోమాత్రం

ఏమీ శ్రద్ధలేకపోయినా, అనేక లైబ్రరీలనుంచి అనేక పుస్తకాలు తెప్పిం[illegible]వుతూ ఉండేవాడు. అతని గదినిండా ఎప్పుడూ పత్రికలే. వాఙ్మయాలగురించి [illegible]కీయాలగురించీ అతనూ నేనూ గంటలకొలది మాట్లాడుకునేవాళ్ళం. అనేకరకాల మనుష్యులని అతనెరుగును. అందరికీ అతను ఆప్తుడే. మనిషిని చూసీచూడగానే పూర్తిగా ఆకర్షించేవాడు. పదినిముషాలు అతనితో మాట్లాడేక అతనిదగ్గర దాపరికాలు అనవసరమనీ, తప్పనీ అనుకునేటట్టు చేసేవాడు. అతనికి నేనంటే అపరిమితమైన అనురాగం. అతనూ నేనూ సహాయ సంపాదకులుగా ఉండి ఇంగ్లీషులో ఒక మాసపత్రిక నడపాలని అతనికొక తీవ్రమైనకోరిక. అప్పటికింకా ఆకోరిక ఫలించలేదు.

అతని విషయంలో నాకు నచ్చనిదల్లా, చీకటిపడ్డాక అతని చర్యలు....

నేనూ వెళ్ళగానే, చంద్రన్‌లేచి, "నేను వెళ్ళాలి," అన్నాడు.

"ఏమిటంతపని, చంద్రూ, కూర్చో. వెళ్దుగానిలే," అంటూ, రామకృష్ణన్ మాకేసి తిరిగి, "చంద్రూకి సాయింత్రం అయాక నాతోఉండడం అంటే భయం: విస్కీపోస్తాననీ, వ్యభిచారంలో దింపుతాననీ అనుమానం అనుకుంటాను. అవునా, చంద్రూ? చంద్రూ తండ్రికి, మామేనమామకి, చంద్రూ నాతో పట్టపొగలు రోడ్డుమీదనుంచుని మాట్లాడినా దిగులే," అన్నాడు.

నుంచున్న చంద్రన్ మళ్ళీ చతికిలబడ్డాడు.

"చంద్రన్‌కి ఏమీ పరవాలేకుండా, వేళకేవచ్చావు నువ్వు," అన్నాడు రామకృష్ణన్, నన్ను పలకరిస్తూ. "నువ్వున్నంతసేపూ చంద్రూ ఉండొచ్చు. నువ్వుండగా మేము దుండగీడుతనాలకి దిగడానికిలేదుకా!"

"నీదుండగీడుతనాలు ఎన్ని ఆపగలిగేనేమిటి?" అని అడిగేను.

"ఆపగలిగేవో, లేదో, నిన్నెదుటపెట్టుకునిమాత్రం పొరపాట్లేమీచేసిన జ్ఞాపకం లేదు," అని రామకృష్ణన్ జవాబుచెప్పేడు.

హరి అందుకున్నాడు:

"అతని విషయంలో నువ్వింకా పెరటితోవ నున్నావు, రామకృష్ణన్. ఇంకా పూర్వపుమనిషే అనుకుంటున్నావు. వేశ్యల గురించీ, వ్యభిచారం గురించీ ఒక పెద్ద నవల వ్రాస్తున్నాడు...."

"నిజమేనా?" అని అడిగేడు రామకృష్ణన్.

"నిజమే," అన్నాను.

"కథ వ్రాయడమేకాదు,....మరినేను చెప్పవచ్చునోలేదో,....చెప్పవచ్చునా?.... సరే, అయితే, చెప్తాను ...కథేకాదు, ఒకవేశ్యయొక్క కుమార్తెతో అతిస్నేహంగా ఉన్నాడు. పెళ్ళి చేసుకో దలచుకున్నాడేమో అనికూడా అనుమానంగా ఉంది," అన్నాడు హరి.

"ఇదంతా నిజమేనా ?" అని అడిగేడు రామకృష్ణన్.

"నిజమే," అన్నాను.

"చంద్రూ, అయితే నువ్వువెళ్ళిపో. ఇతని అండని ఉన్న ప్రయోజనం లేదింక నీకు. అతనికంటె నేనే నయం. వేశ్యలతో పరిచయం కలుపుతానేమోకాని, వేశ్యలని పెళ్ళిచేసుకో మనను నేను."

మళ్ళీ నన్ను చిన్నబుద్ధి నేమోనని సంకోచించి, నాకేసితిరిగి, "నేనునమ్మను. వేశ్యలగురించి నవల వ్రాస్తున్నాడేమోకాని, వేశ్యల ఇళ్ళకి వెళ్తున్నాడంటే నేను నమ్మను," అన్నాడు రామకృష్ణన్.

"వేశ్యలని ఎరగనివాడు వేశ్యలగురించి కథవ్రాయబోతున్నా డంటావా ?" అని అడిగేడు హరి.

"ఎరగనివాళ్ళ గురించే కథలు వ్రాయాలనుంటుంది, వాళ్లెటువంటివాళ్లో కథలలో నిరూపించి తెలుసుకుందామన్న ప్రయత్నంలో. ఎరిగినవాళ్ళ విషయంలో కథలనవసరం. వాళ్ళఫోటోలుంచుకుంటే చాలు," అన్నాడు రామకృష్ణన్.

"నువ్వు వేశ్యలగురించి కథలెందుకు వ్రాయవో ఇప్పుడు నాకు బోధపడుతోంది," అన్నాను.

రామకృష్ణన్ నవ్వి, "నిజమే, వేశ్యలగురించి నాకు తెలియని అంశంలేదు. వాళ్ళగురించి తెలుసుకోడానికికూడా అంశాలు అట్టేలేవు. వేశ్యలు, అంటే నిజమైన వేశ్యవృత్తిలో ఉన్నవాళ్ళు, చంటిపిల్లలలాంటివాళ్ళు. వాళ్ళని బోధపరచుకోడం చాలా సులభం. చంటిపిల్లలు పాలిమ్మంటారు, ఎత్తుకోమంటారు, ఆడించమంటారు. అంతే. లోకంలో ఇతరత్రా ఇతరులకి ఉన్నకష్టసుఖాలతో కాని, న్యాయాన్యాయాలతో కాని, వాళ్ళకి ఎటువంటి సంబంధమూ లేదు. వాళ్ళ లోకమేవేరు. వాళ్ళ అహంభావమేవేరు. వృత్తిలో ఉన్నవేశ్యలూ అంతే. వాళ్ళ లోకానికి పై లోకానికి సంబంధంలేనట్టే ఉంటుంది. చంటిపిల్లలలాగే వాళ్లూ, వయస్సు ముదిరిన వాళ్ళూ లోకజ్ఞానం ఉన్నవాళ్లూ కోరేకోర్కెలుకోరరు. చిన్నవిషయాలలోనే పెద్ద అభిలాషలు.... మొన్నరాత్రి కోయంబత్తూరులో ఒక అమ్మాయి,- వేశ్యే ఆపిల్ల, పాతికేళ్ళదాకా ఉండొచ్చు, నేను చెన్నపట్నం వెళ్తున్నానంటే, దంతపుబ్రూచి ఒకటి తెచ్చిపెట్టమని నన్ను ఎంతో బతిమాలింది...."

హరి, నవ్వి, "దంతపుబ్రూచి చిన్నవిషయమా నీకు ? ఈరోజులలో ఎంత ఖరీదో తెలుసునా ?" అన్నాడు.

"ఖరీదుకి చెప్పడంలేదు....సంసార సముద్రంలో మునిగితేలుతున్న పాతికేళ్ళ మనిషి మరెవరైనా, ఎదిగి, జ్ఞానం ఉన్నదైతే, బ్రూచిలగురించి బాధపడదు," అన్నాడు రామకృష్ణన్.

"బ్రూచిలగురించి ఏమోకాని, బెంగుళూరులో పూలుదొరకడంలేదని, చెన్నపట్నంలో కొన్నిమణుగుల నీలిరంగుపూలూ, పచ్చరంగుపూలూ, ఎర్రరంగు

పూలూ, తెల్ల పూలూ కొని తేకపోతే వీలులేదనీ మా ఆవిడ నాకు ఫిర్మాను ఇచ్చి పంపింది !" అన్నాడు హరి.

"అదంతా నీకో, లేకపోతే, ముఖ్యంగా, నీ అసంఖ్యాకమైన/అనారోగ్యపు స్త్రీ పురుష సంతతికో, షల్ ఓవర్లు అల్లడానికి అడిగిఉంటుంది మీఆవిడ. అదంతా సంసార తాపత్రయం. అదే మా కోయంబత్తూరు రాజాయి అయితే, నాలుగంగుళాల చిన్నుగుడ్డ జడకి వేలాడేసుకునేందుకు అడిగి ఊరుకునుండును," అన్నాడు రామకృష్ణన్.

ఈసంభాషణ దానితో ఆగి, నాకథగురించి చర్చ ప్రారంభమయింది. రామకృష్ణన్ నేను వ్రాయదలచుకున్న కథఏమిటో చెప్పమన్నాడు. ఎంతవరకు వ్రాశానో చెప్పమన్నాడు. ఎలా వ్రాశానో చెప్పమన్నాడు.

నేనువ్రాస్తున్న కథయొక్క సారం, ఎలాగైతేనేమి, చెప్పేను. శాంతంగా విన్నాడు. విని, "వేశ్యలగురించి కథలు వ్రాసే వాళ్ళందరూ, అతి సున్నితమైన స్వభావంగల వేశ్యని సృష్టించాలని ఎందుకు తలక్రిందులుగా తంటాలుపడతారో నాకు తెలియదు," అన్నాడు.

"డ్యూమా చిత్రించిన కెమీల్ నీ, జోలా చిత్రించిన నానా నీ, జ్ఞాపకం ఉంచుకుని మరీ మాట్లాడు," అన్నాను.

"ముఖ్యంగా వాళ్ళగురించే మాట్లాడుతున్నాను," అని జవాబు చెప్పేడు.

కాసేపు ఆగి, ఆలోచిస్తూ, తన ఊహకి సవ్యమైన రూపం ఇవ్వడానికి ప్రయత్నిస్తూ, ఇలా చెప్పేడు: "సున్నితమైన వేశ్య అన్నది ఎక్కడా ఉండదు. సున్నితమైన స్వభావమే కావాలంటే, వేశ్యలలోనూ వృద్ధవనితలలోనూ వెతికిన లాభంలేదు. 'అనాఘ్రాతం పుష్పం' ఎక్కడైనా పట్టాలి, సున్నితానికే అయితే. వేశ్యలగురించి ఏమాత్రం తెలిసిన వాడికైనా, మొదట బోధపడే విషయమే ఇది. తనవద్ద అకది ప్రతీదీ ఒక క్వీన్ విక్టోరియాయే అనుకునే వాడికి తప్ప, వేశ్య వృత్తిలో, ఏ దేశంలోనైనా సరే, ఏ కాలంలోనైనా సరే, సున్నితమైన స్వభావం గల మనిషి ఉండడం అసంభవం అన్న సంగతి సులభంగా తెలుస్తుంది. ఈ నిజానికి వ్యతిరేకంగా వేశ్యలగురించి కథలు అల్లే కథకులు మూడు రకాలకి చెందిన వాళ్ళుంటారు: మొదటి రకం, కథలంటేనూ వాఙ్మయం అంటేనూ ఏమిటో తెలియని వాళ్ళు. ఢ్యూమా, జోలా, ఈరకం కాదు, నిజమే. రెండవరకం, వేశ్యలంటే ఎవరో తెలియనివాళ్ళు. డ్యూమా, జోలా, ఈ రకం వాళ్ళే అని నా అనుమానం. కాని వాళ్ళు రెండవరకంలో పడకుండా కూడా, మూడవరకంలో పడొచ్చును. మూడవరకం ఎవరంటే, కథలంటే ఏమిటో తెలిసీ, వేశ్యలంటే ఎవరో తెలిసీ కూడా, తమ జీవితంలో ఏదో వంకర గుణం ఉండడంవల్లనో, లేకపోతే, వాఙ్మయం యొక్క ప్రయోజనం జీవితంయొక్క వెలితిలన్నీ తీర్చడమే అని

తాము తప్పుగా నమ్మడంవల్లనో. వేశ్యలకి ముఖ్యంగా లేనిగుణం, ఒక వేశ్యకి ముఖ్యంగా ఉన్నట్టు కథవ్రాస్తే తప్ప తృప్తిలేనివాళ్లు."

"నేనే రకానికి చెందినవాడి నంటావు?" అని అడిగేను, నవ్వుతూ.

"నేను అరవవాడిని. నువ్వు తెలుగులో కథలు వ్రాస్తావు. నీకు కథలు వ్రాయడం తెలుసునో లేదో నాకెలా తెలుస్తుంది? పైగా, మీ 'త్రివేణి' పత్రిక తెలుగుభాషలో కథలు వ్రాసే ప్రతి కుర్రకుంకా టాగూరంతటి వాడూ అయినట్టు తర్జుమాలు షుర్జిస్తుంది!......వేశ్యలగురించి కథలు వ్రాసేందుకు నీకు తాహతులేదు......"

"నీ కుందేమో అయితే!" అన్నాను.

"వేశ్యలగురించి కథలు వ్రాసేందుకు ఎవరికీ తాహతులేదు. ఎందువల్లనంటే, అందరి వేశ్యలకథా ఒకటే. భిన్నమూ భేదమూ లేని కథ. శరీరసౌష్ఠవమూ ఆరోగ్యమూ ఉన్నన్నాళ్ళు ఆర్జన: తన లాభానికో, మరొకరి లాభానికో. శరీరం పాడయిన నాడు, కుష్టీ, ముష్టీ, చావూ. ఆ కథ వ్రాయగలిగితే వ్రాయి! నువ్వే ఒప్పుకుంటావు, అందులో వ్రాయడాని కేమీలేదని."

"ఇంత తెలిసిన వాడవు......"

"నేనెందుకు కథ వ్రాయడంలేదంటావా?"

"కాదు. ఇంత తెలిసినవాడవు వేశ్యలవెంట ఎందుకు పడతావు?"

"వేశ్యలని సృష్టించిన సంఘమే నన్నూ సృష్టించింది కనుక!....ఆ విషయం అలా వదలిపెట్టు....కోయంబత్తూరులో, నేనొక నాయుడిని ఎరుగుదును. మీ వాడే. తెలుగువాడు. సగం ఆస్తి వేశ్యలకి పెట్టేడు. అతనిలో ఒక చమత్కార గుణం ఏమిటంటే, తను చూసిన ప్రతి వేశ్యా తనని మోహించిందనుకుంటాడు, తను చూసిన ప్రతి వేశ్యాఅయిష్టంగా, ఏదో బలవంతంవల్ల, వృత్తిలో దిగవలసి వచ్చిం దని నమ్ముతాడు. నలుగురైదుగురికి ఇళ్ళు కట్టించి ఇచ్చాడు, వృత్తి మాని గౌరవంగా జీవించేందుకని చెప్తూ. తనకి మాత్రం వీలు ఉంచుకుని. స్వంత ఇళ్ళు వచ్చాక, అయిదు రూపాయిలముంద పాతికరూపాయిలు అడగడం తప్పితే, మార్పు లేదు. అతనామాట నమ్మడు....అతను వేశ్యలగురించి కథలు వ్రాయబోతే నీలాగే వ్రాస్తాడని ఘంటాపదంగా చెప్పొచ్చును....ఉండు, మరొక విషయం కూడా నీకు చెప్పాలనుకుంటున్నా నిప్పుడు. వేశ్యలగురించి కథవ్రాయ దలచుకున్న స్నేహితుడికి కొన్ని సంగతులు తెలియజెప్పాలి. తెలియజెప్పడమేకాదు. నిజానికి, చూపించాలి... హరీ నేనూ మధ్యాహ్నం మాట్లాడుకున్నాం. ఈ రాత్రి కొక ప్రోగ్రాము వేసు కున్నాం. చంద్రన్ లేకపోతే నిన్ను తీసుకువెళ్ళాలని ఉంది. చంద్రన్ మరీ కుర్రాడు. అదికాక మా మామయ్య నన్ను బతకనివ్వడు...."

"మరేమీ పరవాలేదు," అన్నాడు చంద్రన్.

"నువ్వూ వస్తానన్నా తీసుకువెళ్ళను." అన్నాడు రామకృష్ణన్. మళ్ళీ నాకేసి తిరిగి, "ఆరునెలలకిందట, బ్రాడ్వేసందులలో, ఒక చిన్నచీకటికొంపలో, నవనీతం

అన్న పేరుగల ఒక చిన్నపిల్లని ఒకరాత్రి పట్టుకున్నాం. ఎంతో అందంగానూ ఎంతో చలాకీగానూ ఉంది. ఒక వారంరోజులుండిపోయాను చెన్నపట్నంలో ఆసారి. ఆసారే మనంఇద్దరం పత్రిక ప్రారంభించడం విషయమై చాలాసార్లు కలుసుకొని చర్చించాము కూడాను, నీకు జ్ఞాపకం ఉందోలేదో. అయిదారు వారాలు పోయాక మళ్ళీ వచ్చాను. ఆలోపున ఒక పోలీసుద్యోగి, ఉద్యోగంలో పై అంతస్తులవాడు, చేబట్టేడు. చీకటికొంపపోయి, పెద్దడ్రాయింగురూముఉన్న ఇల్లూ, నౌకర్లూ పటాటోపమూ తయారయింది. ఒకసారి హరీ నేనూ వెళ్ళేం. వీధిలో ఉన్నపోలీసుజవానుకి పదిరూపాయిలిచ్చాం. అపోలీసుద్యోగి వచ్చేవేళవుతోందని భయపెట్టి, హరినిదగ్గరకి చేరనివ్వలేదా పిల్ల ఆనాడు...." అన్నాడు.

"దొంగముండ!" అన్నాడు హరి.

"అప్పటికప్పుడే అది క్షీణిస్తోంది. జబ్బులు తగిలేయి....నాకాసారి అంటించింది కూడాను...."

"నిజంగా?....నాకెప్పుడూ చెప్పలేదే ఈమాట నువ్వు," అన్నాడు హరి.

"ఎందుకు చెప్పాలి?....నాకు చిన్నప్పుడు పొంగూ ఆటలమ్మా వచ్చాయని చెప్పేనా ఎప్పుడైనా నీతో?" అని సమాధానం చెప్పేడు రామకృష్ణన్, నవ్వుతూ.

చటుక్కున, రామకృష్ణన్ అంటే నాకు ఎక్కడలేని రోతా అసహ్యమూ పుట్టుకొచ్చింది.

"ఆటలమ్మా ఈ జబ్బులూ ఒకటేనా? ఎందుకొచ్చిన మాటలివన్నీ? కాస్త తెలివితేటలున్నాయని గర్వపడుతున్నావు నువ్వు! కాని రోజురోజుకీ కూలిపోతున్నావు. ఇదేఫక్కీని జీవితం నడిపేవంటే, రోజులు లెక్కపెట్టుకోవచ్చును నువ్వు.. నేను వెళ్ళాలి," అని లేచేను.

"కూర్చో, కూర్చో. నీప్రశ్నలకి జవాబులు విని మరీ వెళ్ళు. 'ఆటలమ్మా ఈ జబ్బూ ఒకటేనా?' అని అడిగేవు. ఎప్పటికీ ఒకటికావు. ఆటలమ్మకి మందులేదు. తరచుగా చావరు, కాని చస్తే చచ్చినవాళ్లూ ఉన్నారు. చస్తే, మందులేని జబ్బు కనుక చావవలసినదే. ఈ జబ్బులలాకాదు. వేళకివెళ్తే పూర్తిగా కుదిర్చేమందు లున్నాయి...."

"నాకీసోదె అంతా చెప్పకు. నన్ను వెళ్ళనీ."

"నేను చెప్పేకథయినా పూర్తిగా విని వెళ్ళు. నీకథంతా నేను విన్నందుకయినా, నా కామర్యాదచూపించాలి నువ్వు....నవనీతంగురించి చెప్తున్నాను. నూరురూయిల నోటుచూపించేవరకూ నన్నుకూడాతోసి రాజుచేయబోయింది. ఆరువారాలలో అంత హోదాసంపాదించింది. తర్వాత నాలుగైదునెలలు ఎక్కడుందోకూడా తెలియలేదు. హరీ నేనూ అనుకున్నాం, బెంగుళూరులో ఒకసారి: నవనీతానికి ఆరునెలల గడువనీ, ఆరునెలలయాక వీధిలో మొష్టెత్తుతుందనీ. వారంరోజులకిందట కోయంబత్తూరికి నాకు ఉత్తరంవ్రాసింది, షూంబళంలో ఎదో ఇంటి అడ్రసు ఇస్తూ. ఇంకా

వీధిలోపడి ముష్టెత్తుకోడంలేదు కాని, జబ్బుగాఉందనీ, క్షయ అంటున్నారనీ, ధన సహాయంకావాలనీ ఏడుస్తూ వ్రాసింది. ఈవాళరాత్రి వస్తున్నామని కబురుపంపించాం, హరీ నేనూను. వస్తే నువ్వుకూడారా."

"నేను రాను."

"నీఇష్టం. చంద్రూకూడా రావచ్చు నసలు. క్షయతో బాధపడుతున్నమనిషితో ఈ పరిస్థితులలో మాట్లాడి, పాపపరిహారార్థం ఏవో నాలుగురాళ్ళు చేతిలోపెట్టి వచ్చెయ్యాలని వెళ్తున్నాం కాని మరొక దుర్వ్యాప్తికి వెళ్ళడంలేదు. మళ్లీ మందులు వెతుక్కుంటూ వెళ్ళనుకదా!....ఎన్నడూ నిజమైన వేశ్యని చూడలేదని నువ్వు ఒప్పుకుంటున్నావు. నవనీతం చరిత్రంతా చెప్పేను. మనిషినికూడా చూడాలని ఉంటేచూడు. షేక్స్పియర్‌నాటకం చదివేక అసలు క్లియోపాత్రాని చూడడానికి వెళ్ళినంత విలువైన అనుభవంకాదనుకో!....అయినా ఆలోచించు."....

హోటలులోనే భోజనంచేసి, టాక్సీచేసుకుని మాంబళంవెళ్ళేం. చంద్రన్‌కూడా మాతోవచ్చాడు. రౌండ్‌ఠాణాదగ్గర షణ్ముగం అన్న పేరుగల దూతనొకడిని రామకృష్ణన్ పిలిపించి టాక్సీలో ఎక్కించాడు.

మాంబళంలో ఒక సందు మొగని చీకట్లో టాక్సీని ఆపించి, వెళ్ళవలసిన ఇంటికి ఆ షణ్ముగాన్ని పంపించాడు రామకృష్ణన్. అయిదునిమిషా లయాక వాడొచ్చి, "నలుగురున్నారంటే భయపడుతున్నారండీ. ఇద్దరే వస్తారనుకున్నారట. ఆ పెద్దది. తల్లి, వీలేలేదంటోంది. పక్కింటివాళ్ళు చూస్తున్నారనీ, పోలీసుకి రిపోర్టిస్తారేమోననీ భయపడుతోందా పెద్దముండ," అన్నాడు.

కారులోంచి దిగి, "నేనూ చంద్రన్ వెళ్ళిపోతాం. మీరు వెళ్ళండి," అని నేను తప్పించుకోబోయాను. చంద్రన్‌కూడా నాతో దిగేడు.

మమ్మల్ని ఆపి, "ఈ మధ్యవర్తులని పెట్టుకుంటే, ఎప్పుడూ ఇంతే. ఎంత కష్టమని అంటే అంత ఎక్కువ డబ్బు వస్తుందని, లేని కష్టాలు తెస్తారు. నేను వెళ్ళొస్తానుండండి," అంటూ రామకృష్ణన్ తనే వెళ్ళేడు. రెండునిమిషాలలో తిరిగి వచ్చి, "అందరూ రండి," అన్నాడు. టాక్సీవాడిని ఉండమని, షణ్ముగానికి ఏదో ముట్టజెప్పి పొమ్మన్నాడు. ఇచ్చినది చాలదని సణుక్కుంటూ బస్సుడబ్బులకని వేరుగా పుచ్చుకుని పోయాడు షణ్ముగం.

ఇంటిగుమ్మంలోపల నుంచుని ఒక ముసలిది, "ఇదేమిటీ?......నలుగురు ఒక్కసారా రావడం?....ఉండండి....ఆగండి....ఏమేవ్," అని ఇంకా ఏదో అనబోతుంటే, ఒక చిన్నపిల్ల లోపలినుంచి వస్తూ, "నోరుముయ్యవే, దరిద్రపు ముండా. ఆయనెవరో తెలియడంలే?" అని కసిరింది.

"గుడ్డిముండని. నువ్విస్తే మెతుకూ, లేకపోతే పస్తూ. నాకేమి ఎరుక?" అని తప్పుకుంది ముసలిది.

కసిరినపిల్ల నవనీతం అనుకున్నాను. తర్వాత ఆ పిల్లే నవనీతం అని తేలింది.

లోపల మరొకగదిలో, ఇంకా చిన్నపిల్ల ఒకత్తె, సింగారించుకుని, సిగ్గు అభినయిస్తూ మూలగానుంచుంది.

నవనీతాన్ని, "ఈపిల్ల ఎవరు?" అని అడిగేడు రామకృష్ణన్.

"నాచెల్లెలు," అంది నవనీతం.

"నిజంగా చెల్లెలా? వృత్తిలో చెల్లెలా?" అని అడిగాడు రామకృష్ణన్.

"కాసా చెల్లెలండీ, బాబూ, ఏదీ నమ్మరుమీరు! ఇదొక కాసా చెల్లెలూ, అది కాసా అమ్మా..."

"తలుపుదగ్గర నుంచున్నముసలమ్మా?" అని ఆశ్చర్యపోతూ అడిగేడు రామకృష్ణన్.

"అవునండీ, మా అమ్మే."

"మీఅమ్మనే అలా తిట్టున్నావు?"

"మమ్మల్ని అది తిట్టదేమిటి? డబ్బు లాగినన్నాళ్లు డబ్బు లాగింది. ఇప్పుడు ముసలిముండ ముసలిముండలా ఉండాలి...."

"నీకు చెల్లెలుందని నాకు తెలియదే," అన్నాడు రామకృష్ణన్, మూలనున్న పిల్లకేసి తదేకదృష్టితో చూస్తూ.

"ఇద్దరు చెల్లెళ్లున్నారు. రెండోది పడుకుంది."

"ఒక్కత్తే పడుకుందా?"

"ఛీ, ఊరుకోండి!....అందరూ ఇలా నుంచున్నారేమిటి? ఇంతమందిని చూస్తే నాకూ భయమేస్తోంది, బాబూ. అరుగో, వీరిని చూడనేలేదు. బెంగుళూరు కన్నదపంతు లిరుగో. ఆయన్నిచూస్తే నాకు మరీ భయం. బాబూ. కుర్చీలు తేవే! అలా నుంచున్నావేమిటీ? అదే చూస్తూ ఆయనకేసి? ఎక్కడికీపోదులే. నీమీదే కన్నే పేదాయన. కుర్చీలు తీసుకురా," అంది నవనీతం, హరిపక్కకి చేరుకుంటూ.

నవనీతం ముఖంలోఉన్న నాజూకుతనం చెల్లెలి ముఖంలోలేదు. కాని నవనీతం చక్క శిల్పంలా ఉంది. హరికూడా నవనీతం చెల్లెలికేసే చూస్తూ నుంచున్నాడు.

"నీ మరొకచెల్లెల్నికూడా రమ్మను, చూద్దాం," అన్నాడు రామకృష్ణన్.

"అయ్యో, వద్దు, బాబూ. దానికి ఒంట్లో బాగాలేదు," అంది నవనీతం.

రామకృష్ణన్ నవనీతంచెల్లెల్ని రెండుకుర్చీలు తేవిచ్చాడు. మూడవకుర్చీ తేవ దానికి లోపలికివెళ్తుంటే, లోపల పడ్డాడు తనుకూడా.

"అయ్యో. అదేమిటి?" అంటూ, నవనీతంకూడా లోపలికి వెళ్లింది.

లోపలనుంచి అయిదునిమిషాలపాటు గుసగుసలూ కేకలూ వినిపించాయి. తరువాత నిశ్శబ్దంగా ఉంది.

"అందరూ ఇలారండి," అని పిలిచాడు రామకృష్ణన్.

"అయ్యో, అలావెళ్ళకండి, బాబూ, వెళ్ళకండి," అంటూ నవనీతం మమ్మల్ని ఆపింది.

రామకృష్ణన్ తనే నవనీతంచెల్లెల్ని పైకి పట్టుకు లాక్కొచ్చాడు!

ఆపిల్ల ఒంటిమీద బట్ట ఏమాత్రమూ సమంగాలేదు।

అసలే రామకృష్ణన్‌తో ఈ పూట ఇలా వచ్చినందుకు నాకు ఎంతో సిగ్గుగానూ కోపంగానూ ఉంది. ఇప్పుడు రామకృష్ణన్ నడవడి చూస్తే, "ఇతను మనిషేనా?" అనిపించింది!

"మీరుంటే ఉండండి, నేను వెళ్ళిపోతున్నాను," అని వీధివైపు తిరిగేను. ఉండమని పిలిచాడు రామకృష్ణన్. నావెంట వచ్చాడు. రామకృష్ణన్ లేడని చూసి, నవనీతం చెల్లెలిదగ్గరకి హరి వెళ్ళేడు.

నా వెనుక నుంచుని, అదే ధ్యానంగా, ఆ స్థితిలో ఉన్న నవనీతం చెల్లెలి కేసి చూస్తూ, చటుక్కున వెక్కి-వెక్కి ఏడవడం ప్రారంభించాడు చంద్రన్. ఏడుస్తున్నాడే కాని, నవనీతం చెల్లెలికేసి చూడడం మానేడుకాదు. రమ్మని లాగినా, నా వెంట రాలేదు. అలాగే నుంచున్నాడు.

రామకృష్ణన్ నన్ను వెంబడించి, "నేనుకూడా వచ్చేస్తున్నాను నీతో. ఒక్క నిముషం ఉండు. నీతో చాలా మాట్లాడాలి. బెంగుళూరులో ఒక పెద్ద భవనం కొన్నాను. ఒక ప్రెస్సుకూడా కొంటున్నాను. మన పత్రిక స్థాపిద్దాం... నిన్నొకసారి రేపైనా కలుసుకోవాలి మరి. అదుగో, చంద్రూ కూడా వచ్చేస్తున్నాడు. అందరం వెళ్ళిపోదాం, ఉండు....పత్రిక మాట ఏమంటావు?" అని వెనుకనుంచి నా చేయి పట్టుకున్నాడు.


"పత్రికాలేదు, గిత్రికాలేదు, నన్నొదిలిపెట్టు," అని అంటూ, కఠినంగా అతన్ని విదిల్చుకుని, చంద్రన్ టాక్సీలో ఎక్కడనిచూసి, నడుస్తూ నాతోవని నేను పోయాను.

మొన్నాడు రామకృష్ణన్ నేనూ కలిసి ఏడాదిలోగా పత్రిక ప్రారంభిద్దామనీ, ఏడాదిలోపున నేను బెంగుళూరు వెళ్ళవలసిఉంటుందనీ స్థిరపరచుకున్నాం.

రామకృష్ణన్ నన్నెలా ఒప్పించాడో నాకే మొదట్లో బోధపడలేదు.

ఏడా దాఖరికి, పరీక్ష ప్యాసయాక, విజయ బెంగుళూరులో ప్రాక్టీసు పెట్టిందన్న విషయమే నా ఒప్పుదలకి ముఖ్యకారణం అని తర్వాత గ్రహించాను.

[సశేషం]




మదరాస్ పెన్సిల్ ఫ్యాక్టరీ :: మదరాస్

# ఈస్ట్ అండ్ వెస్ట్

## ఇన్షూరెన్సు కంపెనీ, లిమిటెడ్, బొంబాయి.

[1913 లో స్థాపితం]

ప్రధాన కార్యాలయం :

'ఈస్ట్ అండ్ వెస్ట్ బిల్డింగ్', ఫోర్టు, బొంబాయి.

33 సంవత్సరాలుగా దేశసేవచేస్తూ జాతీయోన్నతి పెంపొందిస్తూ ఉన్న ప్రముఖ భారతీయ భీమాసంస్థ.

ఆర్థికంగా సుస్థిరమై, పాలసీదార్లతోనూ, ఏజంట్లతోనూ వ్యవహరించుటలో సంప్యాకాలికి పేరెన్నికగన్న సంస్థ.

1944 లో జరిపిన అదనపువ్యాపారం కోటిరూపాయలు మించింది.

చురుకైనటువంటివీన్ని, పలుకుబడి కలిగినటువంటివీన్ని వ్యక్తులు ఏజన్సీలకొరకు దరఖాస్తులు పెట్టుకోవచ్చును.

వివరాలకు:

శ్రీ జె. యస్. రెడ్డి
బ్రాంచి సెక్రటరీ.,
377, ఎస్ప్లనేడ్,
మద్రాసు.

★

శ్రీ వి. ఎ. నాగరెడ్డి
చీఫ్ ఏజంటు,
రాయల్‌సీమ ఏరియా,
విక్టోరియాపేట, ఆదోని.

శ్రీ యస్. మల్లికార్జునరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, బెజవాడ.



# మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

## బాధపడుచున్నయెడల వెంటనే

పాత్రుడుగారి

# బాలసంజీవిని

యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు:

## డా॥ పిళ్లా పాపయ్యా పాత్రుడు & బ్రదరు,

11, దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి:
నెం. 7, సారంగపాణి కోవిల్,
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి:
నెం. 15, పుగళ్ పిళ్ళై వీధి,
తెప్పకొలం.



Printed and Published by B. Nagi Reddy at B. N. K. Press, Madras 1.
Editor : Chakrapani.

## విడుదల తేదికై నిరీక్షింపుడు!




శ్రీ ఛత్రపతీవారి

# రాధిక

తారాగణం:

బాలసరస్వతి

పద్మనాభరావు

రఘురామయ్య

కోటిరత్నం

సుందరమ్మ

డైరెక్టర్:

V. P. T. సదాశివ్

మ్యూజిక్:

S. హనుమంతరావు

స్టూడియో:

నెప్ట్యూన్

వివరాలకు:

**CHATRAPATHY PICTURES LTD.,**

4. ALWARPET STREET, MADRAS 18.




వాహిని

ఉత్తమచిత్రాన్ని చూడదలచినపుడు
వాహినీ చిత్రాల్ని మరచి పోకండి.

యోగి వేమన ..
స్వర్గసీమ.....
భక్తపోతన ...
దేవత.......
సుమంగళి.....
వందేమాతరమ్

THE VAUHINI PICTURES LIMITED
MADRAS BEZWADA TADPATRI


PRINTED AT THE B. N. K. PRESS, 37, ACHARAPPAN STREET MADRAS - 1